మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083
అనుక్షణం నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 30 బుధవారం | అక్టోబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 44

ANU FURNITURE
HYDERABAD | BENGALURU
Call: +91 9100913033, 8688003033



# ట్రంప్ గెలుస్తాడట!



- ప్రపంచ ఆర్థిక వేత్త సంచలన జోస్యం..!
- ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక వేత్త క్రిస్టోఫ్ బరౌడ్ కూడా
- అమెరికా ఎన్నికల విజేతపై తన జోస్యం
- అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచి పగ్గాలు చేపట్టేది
- రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంపేనన్న క్రిస్టోఫ్
- బెట్టింగ్ మార్కెట్‌లు, పోల్స్, ఎన్నికల మోడలర్‌ల అంచనాలు, ఆర్థిక మార్కెట్‌లు పరిశీలిస్తే విజేత ట్రంపే

హైదరాబాద్-నవభూమిబ్యూరో
అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష ఎన్నికలపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ప్రపంచ పెదన్నగా భావించే అమెరికాకు అధ్యక్షుడు అయితే దాదాపు ప్రపంచానికి అధ్యక్షుడు అయినట్లే అన్న భావన కూడా ఉంటుంది. దీంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఈసారి ఎవరు గెలవబోతున్నారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో పాటు ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ మధ్య జరిగే ఈ పోటీపై ఇప్పటివరకూ వచ్చిన సర్వేల్లోనూ హోరాహోరీ తప్పదని తేలిపోయింది.
ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్ష పదవి దక్కేది డొనాల్డ్ ట్రంప్ కా లేక కమలా హ్యారిస్ కా అన్నది తేల్చేందుకు ఓటర్లు సిద్ధమవుతున్నారు. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, రాజకీయ నేతలు అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజేతపై తమదైన రీతిలో జోస్యాలు కూడా చెప్పేస్తున్నారు. ఇదే క్రమంలో ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక వేత్త క్రిస్టోఫ్ బరౌడ్ కూడా అమెరికా ఎన్నికల విజేతపై తన జోస్యం చెప్పేశారు.
ఈసారి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచి పగ్గాలు చేపట్టేది రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంపేనని ఆర్థిక వేత్త క్రిస్టోఫ్ బరౌడ్ జోస్యం చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ట్వీట్ చేశారు. బెట్టింగ్ మార్కెట్‌లు, పోల్స్, ఎన్నికల మోడలర్‌ల అంచనాలు, ఆర్థిక మార్కెట్‌లు వంటి విభిన్న కొలమానాలను పరిశీలిస్తే, ప్రస్తుతానికి ట్రంప్ విజయం ఖాయమని అనిపిస్తోందని ఆయన తేల్చిచెప్పేశారు.

# డేంజర్ బెల్స్!



- విద్య ఉద్యోగాలకోసం కెనడా వెళ్లే భారతీయులకు ఇక్కట్లే
- అమెరికా వీసా దక్కని వారంతా కెనడాకు పయనం
- కెనడాకు వెళ్తే అక్కడ నుంచి యుఎస్‌కు వెళ్లొచ్చని
- చాలా మంది విద్యార్థులు కెనడాకే వెళ్తున్నారు
- కెనడాలో రద్దీ పెరగడం,నివాసగృహాలకు డిమాండ్
- అద్దెలు పెరగడంతో భారతీయులపై భగ్గుమంటున్న కెనడియన్లు
- వలసలు తగ్గించేందుకు వీసా ఫీజులు పెంచిన కెనడా
- వలసలను తగ్గించడమే లక్ష్యంగా కొత్త ఇమ్మిగ్రేషన్ పాలసీ



**కెనడా-నవభూమిబ్యూరో:** అక్కడ భారతీయ విద్యార్థులకు డేంజర్ బెల్స్! కెనడా ఆహ్వానాన్ని అప్పట్లో అందరిలాగే భారతీయులు అందిపుచ్చుకున్నారు. భారీగా కెనడాకు వెళ్లారు. భారతీయులు గత కొన్నేళ్లుగా కెనడాకు ఎక్కువగా వెళ్తున్నారు. ముఖ్యంగా అమెరికాకు వెళ్లాలనుకునే వారికి త్వరగా వీసాలు లభించకపోవడంతో ప్రత్యామ్నాయంగా కెనడాను ఎంచుకుంటున్నారు. అమెరికా, కెనడా రెండూ సరిహద్దు దేశాలు. అంతేకాకుండా ప్రపంచంలోనే వైశాల్యం పరంగా రెండో పెద్ద దేశం కెనడా. అక్కడ వివిధ రంగాల్లో మానవ వనరుల కొరత విపరీతంగా ఉంది. కావాల్సినంత భూమి ఉన్నా అందుకు తగ్గ జనాభా లేరు. ఈ నేపథ్యంలో

# కార్‌రేస్..భారీ స్కామ్



- తెలంగాణలో వెలుగులోకి మరో స్కామ్..
- విదేశీ సంస్థకు కోట్లల్లో నిధులు బదిలీలు
- ఏసీబీకి మున్సిపల్ శాఖ ఫిర్యాదు
- ఫార్ములా ఈ రేసింగ్ సెషన్ -10 రద్దు
- బోర్డు, ఆర్థికశాఖ నుంచి ముందస్తు అనుమతి లేకుండానే రూ.55 కోట్లు విదేశీ సంస్థకు నిధు...

2

## బాలికపై సామూహిక
# అత్యాచారం

- ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికను లాక్కెళ్లి ముగ్గురు యువకులు అత్యాచారం
- అత్యాచారంపై తల్లికి చెప్పిన బాలిక
- పోలీసులకు ఫిర్యాదు..కేసు నమోదు
- నిందితుల గుర్తింపు..పరారీలో యువకులు



# ఐదు జిల్లాల్లో 54 కరవు మండలాలు

## జాబితా ప్రకటించిన ఏపీ సర్కారు 2

**అమరావతి-నవభూమిబ్యూరో:** 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కరవు మండలాల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఐదు జిల్లాల్లోని 54 మండలాలను కరవు ప్రభావిత మండలాలుగా పేర్కొంటూ రెవెన్యూ శాఖ నోటిఫికేషన్

# ముస్లింలను ముక్కలుగా నరికేస్తాం

- పశ్చిమ బెంగాల్‌లో ముస్లింలందరినీ ముక్కలుగా నరికి పాతిపెడతాం
- హోంమంత్రి అమిత్‌షా సమక్షంలోనే బాలీవుడ్ నటుడు మిథున్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ-నవభూమి:** పశ్చిమ బెంగాల్‌లో ముస్లిింలందరినీ ముక్కలు ముక్కలుగా నరికి పాతిపెడతామని అని నటుడు, బీజేపీ నేత మిథున్ మిగతా 2లో

## కేసీఆర్‌ను
# సర్వనాశనం చేస్తా

- రాజ్‌ను, కేటీఆర్‌ను ఎలా హ్యాండిల్ చేయాలో తెలుసు
- మూసీ ప్రక్షాళన విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు
- బావ బావమరిది బంధం త్వరలోనే ముగుస్తుంది
- త్వరలోనే హరీశ్‌రావును వాడుకుంటా..
- కేటీఆర్‌ని నామరూపాలు లేకుండా చేస్తాం
- భవిష్యత్తులో బీఆర్ఎస్‌ను ఉనికి కోల్పోయేలా చేస్తాం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
జన్వాడ ఫాంహౌస్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే కేసీఆర్ కనుమరుగు అవ్వనున్నారని.. ఆయన్ను సర్వనాశనం చేస్తానని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్ పాకాలను, కేటీఆర్‌ను ఎలా హ్యాండిల్ చేయాలో తనకి తెలుసన్నారు. దీంతో పాటుగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్‌పై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ విషయంలో తాను నిర్ణయం తీసుకున్నానని.. ఆ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. జాన్వాడ కేసుపై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. 'దీపావళి అంటే ఇప్పటి వరకు చిచ్చుబుడ్లు చూశాం కానీ.. ఇప్పుడు మాత్రం సారాబుడ్డీలు చూస్తున్నాం. దీపావళి పార్టీ అంటే ఇంట్లో విదేశీ మద్యం, క్యాసినో కాయిన్స్ ఉండాలా? బావ బావమరిది బంధం త్వరలోనే ముగుస్తుంది. కేసీఆర్ అనేది ఓ ఎక్స్‌పైరీ మెడిసిన్. కేటీఆర్ ముందుకు రావడంతో కేసీఆర్ ఎవరనేది త్వరలోనే ప్రజలు మరచిపోతారు. త్వరలోనే హరీశ్‌రావును వాడుకుంటా.. కేటీఆర్‌ని నామరూపాలు లేకుండా చేస్తాం. భవిష్యత్తులో బీఆర్ఎస్‌ను త్వరలోనే ఉనికి కోల్పోయేలా చేస్తాం' అంటూ

## కేబినెట్ విస్తరణపై సీఎం కీలక ప్రకటన

### మహారాష్ట్ర ఎన్నికల తర్వాతే రాష్ట్రంలో కేబినెట్ విస్తరణ

కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర ఎన్నికల తర్వాతే రాష్ట్రంలో కేబినెట్ విస్తరణ ఉంటుందని స్పష్టం చేశారు.తనకు ఏఐసీసీతో గ్యాప్ లేదన్నారు. కాంగ్రెస్ శ్రేణులను కన్ఫ్యూజ్ చేయడానికే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సినిమాల్లో రాజమౌళిది ఒక స్టైల్..రామ్ గోపాల్ వర్మది మరొక స్టైల్ అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనది రాజమౌళి స్టైల్ అని రామ్ గోపాల్ వర్మలాగా పనిచేయలేనన్నారు.

# ఇచ్చినట్లే ఇచ్చి..వెనక్కి లాక్కునే ప్రయత్నం

## బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు స్థల వివాదం

- స్టార్ పీవీ సింధు అకాడమీ, స్పోర్ట్స్ స్కూల్‌కు గత ప్రభుత్వం స్థలం కేటాయింపు
- అదే స్థలంలో జూనియర్ కళాశాల నిర్మించాలని పట్టుబడుతున్న స్థానికులు
- స్థానికులను రెచ్చగొట్టి,స్థలం స్వాధీనం చేసుకోకుండా గత సర్కార్ యత్నాలు
- కొత్త ప్రభుత్వం సింధు స్థల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోనుందో



**విశాఖపట్నం-నవభూమిబ్యూరో:** నగరంలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు కేటాయించిన స్థలం వ్యవహారంలో వివాదం చోటు చేసుకుంది. బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు అకాడమీ, స్పోర్ట్స్ స్కూల్‌కు గత ప్రభుత్వం స్థలం కేటాయించిన విషయం తెలిసిందే. విశాఖపట్నం జిల్లా తోటగురువులో స్థలాన్ని అకాడమీకి కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే ఆ స్థలంపై ప్రస్తుతం స్థానికులు ఆందోళనకు దిగారు. ఆ స్థలంలో జూనియర్ కాలేజ్ నిర్మించాలంటూ వారు నిరసనకు దిగారు. జూనియర్ కాలేజ్ కేటాయించాలంటూ ప్రభుత్వాన్ని ఇప్పటికే పలుమార్లు స్థానికులు కోరారు. ఖచ్చితంగా ఆ స్థలాన్ని జూనియర్ కాలేజ్‌కు కేటాయించాలని స్థానికులు పట్టుబడుతున్నారు. మరి ఈ వ్యవహారంపై ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం, ఇటు బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఎలా స్పందిస్తారో చూడాలి మరి.
2021, జూన్‌లో అప్పటి జగన్ ప్రభుత్వం పీవీ సింధుకు విశాఖలో రెండు ఎకరాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీ, స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు గాను పీవీ సింధుకు ప్రభుత్వం భూమిని కేటాయించింది. విశాఖ రూరల్

# డ్వాక్రా మహిళలకు శుభవార్త

## పారిశ్రామికవేత్తలుగా డ్వాక్రా మహిళలు 55 కోట్లతో 129 యూనిట్లు

**అమరావతి-నవభూమిబ్యూరో:** డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తొలివిడతలో రూ.55 కోట్లతో 129 ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.5 లక్షల నుంచి రూ.60 లక్షల మధ్య ఈ ప్రాజెక్టుల వ్యయం ఉండనుంది. నవంబర్ రెండో వారంలో వీటిని ప్రారంభించనుంది. మొత్తం వ్యయంలో 35 శాతం రాయితీ ఉండగా, 10 శాతం లబ్ధిదారుని వాటాగా చెల్లించాలి. మిగతా మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రుణం అందిస్తుంది. ఇందుకోసం కేంద్ర పథకాలైన పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీలను అనుసంధానించనుంది. ఈ 129 సూక్ష్మ, చిన్న తరహా ప్రాజెక్టులను సంఘాలుగా కాకుండా వ్యక్తిగతంగా ఏర్పాటు చేస్తామని ముందుకొచ్చిన వారికి కేటాయించారు.ఇందులో 64 మంది మహిళలు కొత్తగా పరిశ్రమలు నెలకొల్పుతుండగా.. మరో 65 మంది ఇప్పటికే ఉన్న వ్యాపారాన్ని మరింత విస్తృతపరుచుకోనున్నారు. వీటి అమలు తీరు పరిశీలించిన తర్వాత రెండో విడతలో మరో 13 వేల మందికి లబ్ధి చేకూరేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. త్వరలో ఏర్పాటు కానున్న ప్రాజెక్టుల్లో కొన్ని ఇక్కడ ఉన్నాయి. జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు, హైజిన్ ప్రొడక్ట్స్, బెల్లం ఉత్పత్తి, ఆయిల్ మిల్లు, మిల్లెట్ అండ్ హెర్బల్ యూనిట్, డెయిరీ ఫాం, బేకరీ, స్నాక్స్ యూనిట్, కిరాణా దుకాణాలు, పచ్చళ్ల తయారీ, సిమెంటు బ్రిక్స్ యూనిట్, ఎంబ్రాయిడరీ, ఐస్‌క్రీమ్ తయారీ, గార్మెంట్స్, కారంపొడి తయారీ, తేనె తయారీ

# నవంబరు 11న రాష్ట్ర బడ్జెట్

**విజయవాడ-నవభూమి:** గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌కు వెళ్లి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఇటీవల అస్వస్థతకు గురైన గవర్నర్ సతీమణి సమీరా నజీర్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు, భువనేశ్వరి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దాదాపు గంటా 45 నిమిషాల పాటు గవర్నర్‌తో సీఎం భేటీ కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన విధానాలను గవర్నర్‌కు వివరించినట్లు తెలుస్తోంది. నవంబరు 11న రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే అంశాన్ని చంద్రబాబు.. గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.

## నేడు తెలంగాణ వ్యాప్తంగా
# బీఆర్ఎస్ సంబరాలు

- కరెంట్ చార్జీలు పెంచాలని సర్కార్ కుట్ర
- ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ ఛార్జీల భారం
- కరెంట్ చార్జీలు పెంచాలని ప్రయత్నాన్ని ఆపినందుకు బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు
- రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరపాలని కేటీఆర్ పిలుపు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** రేపు తెలంగాణ వ్యాప్తంగా సంబురాలు జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కరెంట్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపాలనే ప్రయత్నాన్ని ఆపినందుకు జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో సంబరాలు చేయాలని శ్రేణులను కేటీఆర్ కోరారు.పది నెలల కాలంలోనే 18500 కోట్ల విద్యుత్ ఛార్జీల పెంపునకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసిందని కేటీఆర్

# టీడీపీ పార్టీలో చేరిన బాబు మోహన్



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** టీడీపీ పార్టీలో చేరారు మాజీ మంత్రి, నటుడు బాబు మోహన్. తాజాగా తెలుగు దేశం పార్టీ సభ్యత్వం బాబు మోహన్ తీసుకున్నాడు.మాజీ మంత్రి, నటుడు బాబు మోహన్ ఆందోల్ నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వం తీసుకున్నట్లు వెల్లడించారు.ఈ మేరకు బాబు మోహన్ ఓ ఫోటోను విడుదల చేశారు మాజీ మంత్రి, నటుడు బాబు మోహన్. ఇది ఇలా ఉండగా గతంలో సినీ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్టీలోని తాజాగా పరిస్థితుల్లో అసంతృప్తికి గురైన ఆయన పార్టీ నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు మీడియాకి వెల్లడించారు. కిషన్ రెడ్డి పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

## తల తాకట్టు పెట్టైనా
# రుణమాఫీ ఇస్తాం

- రైతులు తీసుకొచ్చిన పత్తిలో కోత విధిస్తే సహించబోం
- వే బ్రిడ్జి కాటాలో తేడా వస్తే మిల్లు సీజ్ చేయిస్తాం
- 9 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం
- మద్దతు ధరతో పాటు తేమ 12%ఉండేలా చూసుకోవాలి
- రైతుకు ఎక్కడ ఇబ్బంది కలగొద్దని విప్లవాత్మక మార్పులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

2



రైతులు తీసుకొచ్చిన పత్తిలో కోత విధిస్తే సహించబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. వేబ్రిడ్జి కాటాలో తేడా వస్తే మిల్లు సీజ్ చేయిస్తామన్నారు.ఈ సంవత్సరం అధిక వర్షాలతో పత్తి పంట నష్టపోయారని చెప్పారు. రెండు లక్షల ఎకరాల్లో 20 టన్నుల పంట ఉత్పత్తి అవుతుందని.. తొమ్మిది సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మద్దతు ధర ఇవ్వడంతో పాటు తేమ 12 శాతం ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఇది రైతుల పక్షపాత ప్రభుత్వమని అన్నారు. రైతుకు ఎక్కడ ఇబ్బంది కలగొద్దని విప్లవాత్మక మార్పులు చేశామని చెప్పారు.ఇప్పటికే 18వేల కోట్ల రుణమాఫీ చేశామన్న ఆయన.. రుణమాఫీపై ప్రతిపక్షాలు కారుకూతలు కూస్తున్నాయన్నారు. అర్హులైన రైతులందరికీ తల తాకట్టు పెట్టైనా రుణమాఫీ చేస్తామన్నారు. డిసెంబర్ లోపే 13 వేల కోట్ల రుణమాఫీ అమలు చేస్తామని చెప్పారు. అర్హులైన పేదలకు అందరికీ ఇందిరమ్మ ఇళ్ళు దీపావళి కానుకగా ఇవ్వబోతున్నామన్నారు. ఆనాడు రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు ఎలా ఇల్లు కట్టించారో ఇప్పుడు కూడా అలాగే ఇస్తామన్నారు. వరికి సన్నరకం వడ్లకు 500 బోనస్ ఇస్తామని చెప్పాము,

# ఆస్తుల పంపకాలు జరగలేదు

- దానికి నేనే ప్రత్యక్ష సాక్షిని:వైఎస్ విజయమ్మ
- వైఎస్సార్ ఆస్తులను పంచారన్నది అవాస్తవం
- పిల్లలకు ఆస్తులు సమానంగా ఉండాలి
- ఆడిటర్‌గా ఉన్న విజయసాయిరెడ్డికి అన్నీ తెలుసు
- ఇంటి బంధువుగా ఎంఓయూపై వైవీ సంతకం

2



**అమరావతి-నవభూమి:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులకు ఆయన సతీమణి విజయమ్మ బహిరంగ లేఖ రాశారు. "ఇంటి గుట్టు వ్యాధి రట్టు.. తెరిచిన పుస్తకం" అని వైఎస్ అనేవారని గుర్తుచేశారు. తాను అడ్డుకోవడానికి ఎంత ప్రయత్నించినా.. జరగకూడనివి అన్ని తన ముందే జరిగిపోతున్నాయని అన్నారు. అబద్ధాల పరంపర కొనసాగుతుందని చెప్పారు. వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి ఎన్నో అసత్యాలు చెప్పారని అన్నారు. వైఎస్ ఆస్తులు పంచారన్నది అవాస్తవమని వైఎస్ విజయమ్మ తేల్చిచెప్పారు.

**పిల్లలకు ఆస్తులు సమానంగా ఉండాలి..**

జగన్, షర్మిల పేరిట వైఎస్ కొన్ని ఆస్తులు పెట్టారని తేల్చిచెప్పారు. ఇది ముమ్మాటికీ ఆస్తులు పంపకం కాదని అన్నారు. "షర్మిలకు వైఎస్సార్ ఆస్తులు ఇచ్చారని లిస్టు చదివారు. అలాగే జగన్ పేరిట పెట్టిన ఆస్తుల జాబితా కూడా చదివి ఉండాల్సింది. ఆడిటర్‌గా ఉన్న విజయసాయిరెడ్డికి అన్నీ తెలుసు. ఇంటి బంధువుగా ఎంవోయూపై వైవీసుబ్బారెడ్డి సంతకం చేశారు. మీడియాలో అవాస్తవాలు మాట్లాడటం బాధ కలిగించింది. అబద్ధాల పరంపర కొనసాగకుండా ఉండేందుకే నిజం చెబుతున్నా. అమ్మగా నాకు ఇద్దరు సమానమే.. అలాగే వైఎస్సార్ మాట కూడా ముఖ్యమే. ఆస్తులు ఇద్దరు బిడ్డలకు సమానం అనేది నిజం. నలుగురు పిల్లలకు ఆస్తులు సమానంగా ఉండాలన్నది వైఎస్సార్ ఆజ్ఞ. బాధ్యత గల

# హైదరాబాద్‌లో విషాదం.. ఇంట్లో పేలిన దీపావళి టపాసులు.. దంపతులు మృతి



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ పాత బస్తీలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీపావళి టపాసులు పేలటంతో దంపతులు ప్రాణాలు కోల్పోయారు. యాకత్‌పురా రైల్వేస్టేషన్ దగ్గరలోనే రెయిన్‌బజార్‌లో ఘటన జరిగింది. ఓ ఇంట్లో టపాసులు అక్రమంగా నిల్వ ఉంచగా..ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. క్షణాల్లోనే మంటలు వ్యాపించి ఇంట్లో ఉన్న దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెయిన్ బజార్ ప్రాంతానికి చెందిన మోహన్ లాల్, ఉష దంపతులు దీపావళికి టపాసులు విక్రయించేందుకు ప్లాన్ చేసుకున్నారు. అందుకు భారీ ఎత్తున టపాసులు ఇంట్లో నిల్వ ఉంచారు. ప్రమాదవశాత్తు వాటికి నిప్పంటుకోవడంతో ఉన్నట్టుండి భారీ ఎత్తున మంటలు వ్యాపించాయి. ప్రమాద సమయంలో ఇంట్లో ఉన్న మోహన్‌లాల్, ఉష అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో బాలిక తీవ్రంగా గాయపడింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్ని ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.ఇక హైదరాబాద్ అబిడ్స్‌లోని ఓ బాణాసంచా దుఖాణంలోనూ భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో షాపులో కొందరు కస్టమర్లు టపాసులు కొనుగోలు చేస్తుండగా.. వేగంగా మంటలు వ్యాపించటంతో వారందరూ బయటకు పరుగులు తీశారు. దుకాణం నుంచి టపాసులు ఒకదానికొకటి అంటుకుని భారీ ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. బాణాసంచా దుకాణం నుంచి మంటలు భారీగా చెలరేగటంతో దుకాణం బయట ఉన్న దాదాపు 10కి పైగా బైక్‌లు అగ్నికి ఆహుతయ్యాయి.



## తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే.. ఫార్మాట్ ఇదే.. ఈ పత్రాలు రెడీ చేసుకోండి..!



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను రేవంత్ రెడ్డి సర్కార్ నిర్వహించ తలపెట్టిన సంగతి తెలిసిందే. ఈ సర్వేకు సంబంధించి ఇప్పటికే అసెంబ్లీ ఆమోదం దొరికిన సంగతి తెలిసిందే. అయితే.. నవంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ సర్వేకు సంబంధించిన ఓ ఫామ్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఓ కుటుంబానికి సబంధించిన వివరాలను రెండు పార్టులుగా సేకరించనున్నట్టుగా ఈ ఫామ్ ఫార్మాట్ ఉంది. అందులో చాలా వివరాలకు స్టార్ మార్క్ ఉండటం గమనార్హం.

తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ తలపెట్టిన సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించేందుకు కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఇప్పటికే కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై అసెంబ్లీలోనూ ఆమోదం లభించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం (అక్టోబర్ 29న) రోజున సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పేరుతో ఓ ఫామ్‌ను విడుదల చేసింది. ఈ సర్వేలో భాగంగా.. రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు సంబంధించిన.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులానికి సబంధించిన వివరాలను అధికారులు సేకరించనున్నారు. కుటుంబాల నుంచి అధికారులు సేకరించనున్న వివరాలకు సంబంధించిన ప్రశ్నలను ప్రభుత్వం విడుదల చేసిన ఫామ్‌లో పొందుపరిచారు.సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో రెండు పార్టులుగా కుటుంబాల నుంచి వివరాలు సేకరించనున్నట్టు ఈ ఫామ్ ద్వారా తెలుస్తోంది. పార్టు-1లో.. కుటుంబ యజమానికి సంబంధించిన వివరాలతో పాటు కుటుంబ సభ్యులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు నమోదు చేసుకోనున్నారు. కుటుంబ సభ్యుల పేర్లతో పాటు కుటుంబ యజమానితో ఉన్న రిలేషన్, మతం, కులం, సామాజిక వర్గం, మాతృభాష, ఆధార్ కార్డు వివరాలు సేకరించనున్నారు. వీటితో పాటుగా.. దివ్యాంగులు ఎవరైనా ఉంటే వారికి సంబంధించి సమాచారం, వైవాహిక స్థితి కూడా నమోదు చేసుకోనున్నారు.మరోవైపు.. విద్యాభ్యాసానికి సంబంధించిన వివరాలను కూడా ప్రభుత్వం సేకరించనుంది. ఇందులో ఎలాంటి పాఠశాలలో విద్యను అభ్యసించారు, విద్యార్హతలు, అత్యున్నత విద్య ఏ మాధ్యమంలో చదివారనే వివరాలతో పాటు.. పాఠశాలలో చేరిన నాటికి వయసు, బడి మానేసినట్టయితే అందుకు సంబంధించిన వివరాలను కూడా అధికారులు సేకరించనున్నారు.వీటితో పాటు కుటుంబ సభ్యులకు సంబంధించిన ఉద్యోగ, ఉపాధి వివరాలను కూడా ప్రభుత్వం నమోదు చేసుకోనుంది. ప్రస్తుతం చేస్తున్న పనికి సంబంధించి వివరాలు.. బిజినెస్ అయితే వార్షిక ఆదాయం, రోజువారి వేతన కార్మికులు అయితే ఆ రంగానికి సంబంధించి వివరాలను నమోదు చేసుకోనున్నారు. ఇక కుల వృత్తులు చేస్తున్నట్టయితే.. వాటికి సంబంధించిన వివరాలు కూడా సేకరించనున్నారు. వార్షిక ఆదాయం వివరాలు, పన్ను కడితే వాటికి సంబంధించిన సమాచారం, బ్యాంక్ అకౌంట్ డిటెయిల్స్ కూడా తీసుకోనున్నారు.వీటితో పాటు కుటుంబానికి ఉన్న భూముల వివరాలు కూడా ప్రభుత్వం సేకరించనుంది. ధరణి పాస్ బుక్ ఉన్నట్టయితే దాని నెంబర్, ఆ భూమిని ఏ రూపంలో పొందారు, భూమి ఏ రకం.. వ్యవసాయ భూమి అయితే దానికి సాగు నీటి వనరు ఏంటీ.. ఒకవేళ కౌలు భూమిలో పంట సాగు చేస్తున్నట్టయితే.. దానికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరించనున్నారు. దీంతో పాటు.. రిజర్వేషన్, దానికి సంబంధించిన ప్రయోజనాలు ఇతర వివరాలు కూడా సేకరించనున్నారు. మరోవైపు.. ఆ కుటుంబ సభ్యులు రాజకీయ నేపథ్యం గురించి కూడా ప్రభుత్వం సేకరించనుంది. ఒకేవేళ కుటుంబంలో ఎవరైనా వలస కార్మికులు ఉంటే వాళ్లకు సంబంధించిన వివరాలు కూడా అధికారులు నమోదు చేసుకోనున్నారు.ఇక పార్టు-2లో కుటుంబానికి ఉన్న అప్పులు, ఏ అవసరం నిమిత్తం తీసుకున్నారు.. ఎక్కడి నుంచి పొందారు.. లాంటి వివరాలతో పాటు వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల్లో పాల్గొన్నారా..? పశుసంపద వివరాలు, రేషన్ కార్డు నెంబర్, నివాస గృహానికి సంబంధించిన వివరాలు, తాగునీటి వనరులు, వంట కోసం ఉపయోగించే ప్రధాన ఇంధనం లాంటి వివరాలను అధికారులు సేకరించనున్నట్టుగా.. విడుదల చేసిన ఫామ్ ద్వారా తెలుస్తోంది.అయితే.. ఈ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే.. నవంబర్ 6వ తేదీ నుంచి మొదలు కానుంది. రాష్ట్ర ప్రణాళిక శాఖకు ఈ సర్వే బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు జీవో నెంబర్ 18ను ప్రభుత్వం ఇప్పటికే జారీ చేసిన విషయం తెలిసిందే. సమగ్ర కుటుంబ సర్వే చేయాలని ఫిబ్రవరి 4న కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని గతంలో అసెంబ్లీ ఆమోదించడంతో ఈ మేరకు అధికారులు సమగ్ర కుటుంబ సర్వే చేపట్టనున్నారు.

## బీసీలందరూ కుల గణనలో పాల్గొనేలా చూడాలి : బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



**నిజామాబాద్-నవభూమి:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల దామాషా ఖరారుకు సంబంధించిన అంశంపై తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌మంగళవారం బహిరంగ విచారణ చేపట్టింది. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్యక్రమం జరిగింది. ఈ విచారణలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ బీసీల అభ్యున్నతి, సంక్షేమంపై సమగ్ర నివేదికను బీసీ కమిషన్ కు అందించింది. రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు, బడ్జెట్ కేటాయించాలని విన్నవించింది. నిజామాబాద్ జిలాల్లో బీసీ భవన్ నిర్మించాలని, బీసీ స్టడీ సర్కిల్‌కు రెండెకరాల స్థలం కేటాయించి సొంత భవనం నిర్మాణం చేయాలని, కాలేజీ హాస్టళ్ల సీట్లను రెట్టింపు చేయాలని, మహాత్మ జ్యోతిబా పూలే, ఛత్రపతి శివాజీ జయంతులకు సెలవు దినం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది. సమగ్ర కుల గణన అనంతరం కులాల జనాభా లెక్కలు బహిరంగ పర్చాలని కోరింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ నివేదికను, సంఘం జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు అందించిన సలహాలు, సూచనలను బీసీ కమిషన్ పరిగణనలోకి తీసుకుంది.

# డేంజర్ బెల్స్!

**(1వపేజీ తరువాయి)** గత కొన్నేళ్లుగా పెద్ద సంఖ్యలో వలసలను ఆ దేశం ఆహ్వానించింది. దేశంలో బెస్ట్ కాలేజీలు, యూనివర్సిటీలు ఇవే! కెనడా ఆహ్వానాన్ని అప్పట్లో అందరిలాగే భారతీయులు అందిపుచ్చుకున్నారు. భారీగా కెనడాకు వెళ్లారు. ముఖ్యంగా ఉన్నత విద్య కోసం ఆ దేశానికి వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రపంచంలోనే టాప్ 200 విశ్వవిద్యాలయాల్లో కొన్ని కెనడాలో కూడా ఉన్నాయి. ఇంగ్లిష్ స్పీకింగ్ కంట్రీ కావడం, అమెరికా పక్కనే ఉండటం వంటి కారణాలతో ఇతర దేశాలతో పోలిస్తే కెనడాకు వెళ్లే భారతీయుల సంఖ్య భారీగా పెరిగింది. అందులోనూ అమెరికా వీసా దక్కనివారు ముందు కెనడాకు వెళ్తే అక్కడి నుంచి అమెరికా వెళ్లడం సులువుతుందని కెనడాను ఎంచుకుంటున్నారు. చదువుల కోసం మన పిల్లలు 108 దేశాల్లో ఉన్నారట అయితే ఈ వలసలు ఇటీవల కాలంలో ఎక్కువ కావడం, కొన్ని చోట్ల కెనడియన్ల కంటే ఎక్కువ సంఖ్యలో విదేశీయులు ఉండటం వంటివి తలెత్తాయి. ముఖ్యంగా వలసలు ఎక్కువ కావడంతో గృహాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో ఇళ్ల ఖర్చు భారీగా పెరిగిపోయింది. దీంతో స్థానిక కెనడియన్లు భగ్గుమన్నారు. వలసల వల్ల కెనడియన్లు వెనుకబడిపోతున్నారని, ఉద్యోగాల్లోనూ వలస వచ్చినవారికే ప్రాధాన్యత లభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇళ్ల కోసం గతంతో పోలిస్తే భారీగా వెచ్చించాల్సి వస్తోందని ధ్వజమెత్తారు. అమెరికా చదువులకు ఇండియాలో ఎందుకంత క్రేజ్.. కారణమేంటి? ఈ నేపథ్యంలో ఇటీవల కెనడా వలసలపై ఆంక్షలు విధించింది. విదేశీ విద్య కోసం విద్యార్థులకు వీసా ఫీజులను పెంచింది. అంతేకాకుండా వారి బ్యాంకు ఖాతాల్లో కనీసం ఉండాల్సిన ఆర్థిక నిల్వలను కూడా భారీగా పెంచింది. అలాగే వలసలను తగ్గించడమే లక్ష్యంగా కొత్త ఇమ్మిగ్రేషన్ పాలసీని తీసుకొచ్చింది. దీంతో కెనడాలో ఉంటున్న వివిధ దేశాల ప్రజలకు, విద్యార్థులకు కొత్త కష్టం వచ్చిపడింది. ముఖ్యంగా కెనడాలో ఉంటున్న విదేశీయుల్లో అత్యధికం భారతీయులే. అలాగే అక్కడ విద్యనభ్యసిస్తున్నవారిలో భారత విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నారు. వీరంతా ఇప్పుడు ఆ దేశాన్ని వీడాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. శాశ్వత పౌరసత్వం లభించనివారు, విద్య, ఉద్యోగాల కోసం వచ్చి తమ వీసా గడువు ముగిసినవారు కెనడాను విడిచిపెట్టాల్సి ఉంటుంది. %ూశ్రీంశీ =ఙుం% - ఇక అమెరికా భారత విద్యార్థులకు పీడకలేనా? ఈ నేపథ్యంలో భారతీయ విద్యార్థులు నిరసనకు దిగారు. కెనడా కొత్త ఇమ్మిగ్రేషన్ పాలసీ తమ అవకాశాలను దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం.. భారతీయ విద్యార్థులు వర్క్ పర్మిట్ పొందడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. అంతేకాకుండా శాశ్వత నివాసం పొందడానికి మరింత కష్టపడాల్సి వస్తోంది. కెనడా భారీగా వచ్చిన వలసలతో ప్రస్తుతం అధిక జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వలసల వల్లే ఈ పరిస్థితి సంభవించిందని ఆ దేశ గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ వలసలు ఆరోగ్య రంగం, గృహనిర్మాణం వంటి ప్రభుత్వ రంగాలను దెబ్బతీసింది. దీంతో ఇమ్మిగ్రేషన్ విధానంలో మార్పులు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. అయితే.. చాలా మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లి అక్కడ ఉద్యోగం సంపాదించడానికి, చదువుకోవడానికి రుణాలు తీసుకుంటారు. అందువల్ల, వారు గ్రాడ్యుయేషన్ అయిన వెంటనే తిరిగి భారతదేశానికి వెళ్లిపోవాల్సి వస్తే వారి నెత్తిన భారీగా అప్పుల భారం పడుతుంది. అందుకే ఇప్పటికే కెనడాలో చదువుతున్న వారికి కొత్త ఇమ్మిగ్రేషన్ విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని భారతీయ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే శాశ్వత పౌరసత్వం పొందడానికి ప్రభుత్వం అవకాశాలు కల్పించాలని, ఇతర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

# కేసీఆర్ కుటుంబంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్-నవభూమి:** మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబం బూతు పురాణం కుటుంబమని.. ఉదయం లేస్తే చాలు ఆ పార్టీ నేతలు అందరూ బూతులే మాట్లాడుతారన్నారు. వాళ్లు చేస్తే సంసారం మిగిలిన వాళ్ళు చేస్తే వ్యభిచారం అన్నట్టు మాట్లాడతారంటూ మండిపడ్డారు. కేసీఆర్ తిట్టినట్లు బూతులు ఎవరు తిట్టలేదని.. తండ్రి లాగే కొడుకు కేటీఆర్ ప్రవర్తిస్తున్నారని అన్నారు. "బూతులు తిట్టేవాడు నోటీసిస్తే దానికి విలువ ఉంటుందా. నేనెప్పుడూ తిట్టలేదు.. కేవలం విమర్శ మాత్రమే చేశాను. కేటీఆర్ పంపిన నోటీసుకు నేను సమాధానం కూడా ఇచ్చాను.. అంతేకాదు నోటీసుకు నోటీసు కూడా ఇచ్చాను" అని తెలిపారు. ఇప్పుడెవరైనా దావత్‌లు చేసుకుంటారా... అలాగే జన్వాడ ఫామ్ హౌస్ ఘటనకు సంబంధించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపైనా కేంద్రమంత్రి విమర్శలు గుప్పించారు. "ఫామ్ హౌస్‌లో దావతులు పెట్టడానికి సిగ్గుండాలి . దసరాకి దావతులు చేసుకుంటారు... దీపావళికి ఎవరైనా దావతులు చేసుకుంటారా. దీపావళికి దావతులు కాదు.. లక్ష్మీ పూజలు చేసుకోవాలి" అంటూ హితవుపలికారు.

**రేవంత్ సర్కార్‌పైనా**

అలాగే రేవంత్ సర్కార్‌పై బండి సంజయ్ నిప్పులు చెరిగారు. తెలంగాణలో ఆర్ కే హెచ్ సర్కార్ నడుస్తోంది (రేవంత్, కేటీఆర్, హరీష్ రావు) అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌లో బావా బామ్మర్దుల పంచాయతీ నడుస్తోందన్నారు. కేసీఆర్ కొడుకుకి ట్విట్టర్ టిల్లు అని పేరు పెట్టినట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటే అని అన్నారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ కొడుకు ఇద్దరూ ఒకటే అని.. తనకు భయపడి కేసీఆర్ కొడుకు నోటీసు ఇచ్చారన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏమైనా అయితే కేసీఆర్ మాట్లాడరని.. జైలుకు వెళ్లినా స్పందించరన్నారు. కానీ కేసీఆర్ కొడుకు బావమరిదికి ఏమైనా అయితే మాత్రం.. డీజీపీతో మాట్లాడతారా అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్‌ను, బీఆర్ఎస్‌ను ధీటుగా ఎదుర్కొనే పార్టీ కేవలం బీజేపీ మాత్రమే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే మెడలు వంచుతామన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని.. మూసీ పేరుతో పేదలు ఉసురు పోసుకుంటే ఊరుకోమని హెచ్చరించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీని వెంటాడుతాం.. వేటాడుతామన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని నామరూపాలు లేకుండా చేస్తామన్నారు. పోలీసులు దాడి చేసినప్పుడు రాజ్ పాకాల పోలీసులు పక్కనే ఉన్నారని.. తర్వాత మాయమైపోయాడన్నారు. ఫామ్ హౌస్‌లో కేసీఆర్ కొడుకు కుటుంబ సభ్యులను తప్పించింది ఎవరని ప్రశ్నించారు. చివరికి కొండను తవ్వి ఎలుకను కూడా రేవంత్ సర్కార్ పట్టలేకపోయిందంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

**విష్ణుకుమార్ రాజుకు పరామర్శ**

మంగళవారం విశాఖకు చేరుకున్న బండి సంజయ్ బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజును పరామర్శించారు. ఇటీవల విష్ణుకుమార్ రాజు మోకాలి ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ క్రమంలో ఉదయం ఆయన నివాసానికి చేరుకున్న బండి సంజయ్ ఆరోగ్య పరిస్థితిపై ఎలా ఉంది అని విష్ణు కుమార్ రాజును అడిగి తెలుసుకున్నారు.

# కార్‌రేస్..భారీ స్కామ్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** గత ఏడాది ఫిబ్రవరి-11న హైదరాబాద్‌లో హుస్సేన్‌సాగర్ చుట్టూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 2.8 కి.మీ. ట్రాక్‌లో మొదటి ఫార్ములా-ఈ కార్ల పోటీ జరిగింది. సీజన్-9 ఫార్ములా-ఈ రేస్ నిర్వహణకు రూ.200 కోట్లు ఖర్చయింది. ఇందులో ఈవెంట్ నిర్వాహక సంస్థలైన గ్రీన్‌కో రూ.150కోట్లు, హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్ రూ.30 కోట్లు ఖర్చుచేశాయి.

పార్ములా ఈ కార్ రేస్ నిర్వహణకు సంబంధించి నిధుల గోల్‌మాల్ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కోసం జరిపిన కేటాయింపులపై ఏసీబీకి మున్సిపల్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని మున్సిపల్ శాఖ కోరింది. కోట్లల్లో నిధులు బదిలీలు జరగడంపై మున్సిపల్ శాఖ విచారణ కోరింది. నిబంధనలు పాటించకుండా ఎమ్ఏయూడీ నిర్వహణ సంస్థ ఎఫ్ఈఓకు రూ. 55కోట్ల చెల్లింపులు జరిగాయి. ఒప్పందంలో పేర్కొన్న అంశాలు పాటించకపోవడంతో ఫార్ములా ఈ రేసింగ్ సెషన్ -10 రద్దు అయ్యింది. బోర్డు, ఆర్థికశాఖ నుంచి ముందస్తు అనుమతి లేకుండానే రూ.55 కోట్లు విదేశీ సంస్థకు నిధుల చెల్లింపులు జరిగాయి.

కాగా.. గత ఏడాది ఫిబ్రవరి-11న హైదరాబాద్‌లో హుస్సేన్‌సాగర్ చుట్టూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 2.8 కి.మీ. ట్రాక్‌లో మొదటి ఫార్ములా-ఈ కార్ల పోటీ జరిగింది. సీజన్-9 ఫార్ములా-ఈ రేస్ నిర్వహణకు రూ.200 కోట్లు ఖర్చయింది. ఇందులో ఈవెంట్ నిర్వాహక సంస్థలైన గ్రీన్‌కో రూ.150కోట్లు, హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్ రూ.30 కోట్లు ఖర్చుచేశాయి. రహదారులు, ఇతర మౌలిక వసతులకు హెచ్ఎండీఏ రూ.20 కోట్లు ఖర్చు చేసింది. ఇది విజయవంతం కావడంతో 2024 ఫిబ్రవరి 10న మరోసారి (సెషన్-10) నిర్వహించేందుకు ఫార్ములా-ఈ ఆపరేషన్(ఎఫ్ఈవో)తో ఎంఏయూడీ 2023 అక్టోబరులో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు హెచ్ఎండీఏ రూ.55 కోట్లు ఎఫ్ఈవోకు చెల్లించింది.

ఈవెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్‌గా ఉండి.. ఖర్చంతా ప్రైవేటు సంస్థలైన గ్రీన్కో, ఫార్ములా-ఈనే భరించాల్సి ఉంది. కానీ.. గత సీజన్‌లో ప్రధాన భాగస్వామిగా ఉన్న గ్రీన్కో సంస్థను తొలగించి దానిస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఉండేలా సీనియర్ ఐఏఎస్ ఒకరు సొంత నిర్ణయం తీసుకున్నారు. ఆ సమయంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. అటు ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా, ఎన్నికల సంఘం అనుమతి తీసుకోకుండా, కనీసం ఆర్థికశాఖ దృష్టికి తీసుకెళ్లకుండానే ఆ ఉన్నతాధికారి ఈవెంట్ నిర్వహణకు హెచ్ఎండీఏ నుంచి రూ. 55 కోట్లు ముందస్తు చెల్లింపులు చేశారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఒప్పందంలో పేర్కొన్న అంశాలను పాటించకపోవడంతో తాము హైదరాబాద్ రేస్ నుంచి తప్పుకొంటున్నట్లు అదే నెలలో ఎఫ్ఈవో ప్రకటించింది. అనంతరం 'సెషన్-10' రద్దయింది. ఫిబ్రవరి 10న ఈవెంట్ జరిగి ఉంటే హెచ్ఎండీఏపై రూ.200 కోట్ల భారం పడేది. కానీ, ఇంతలో విషయం బయటపడడంతో ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఫార్ములా-ఈ రేసుపై చట్టవిరుద్ధంగా నిర్ణయం తీసుకున్న అధికారికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోటీసులు కూడా జారీ చేశారు. ఇదిలాఉండగా.. ఈ రేసింగ్‌లో నిధుల గోల్‌మాల్ అంశంపై విచారణకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ఏసీబీ లేఖ రాసింది. మరి ప్రభుత్వం ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలి.

# కేసీఆర్‌ను సర్వనాశనం చేస్తా

**(1వపేజీ తరువాయి)** ఘాటు వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్ రెడ్డి.

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ఒక్క అడుగు ముందుకే, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు వెయ్యిసార్లు ఆలోచిస్తామని, కానీ ఒకసారి నిర్ణయిస్తే వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. నవంబర్ 1న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనుల శంకుస్థాపన జరుగునున్నట్లు సీఎం స్పష్టం చేశారు. మొదటిగా బాపూఘాట్ నుంచి పనులు ప్రారంభిస్తామని, నవంబర్ మొదటివారంలో ఈ ప్రాజెక్టు పనుల కోసం టెండర్లు పిలుస్తామన్నారు. మూసీ పనులపై ప్రతిపక్షాలతో చర్చలకు సిద్ధమని, త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'బాపూఘాట్ నుంచి వెనక్కి 21 కి.మీ మేర త్వరలోనే అభివృద్ధి చేస్తాం. మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీరు తరలిస్తాం. మల్లన్న సాగర్ నుంచి గోదావరి నీటి తరలింపునకు నవంబరులో చివరిలోపు టెండర్లు పిలుస్తాం. నగర ప్రజాప్రతినిధులకి మూసీ అభివృద్ధి అధ్యయనం కోసం సియోల్‌కు పంపుతాం. నగర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను కూడా పంపుతాం. మూసీ పునరుజ్జీవంపై చర్చ మొదలు పెట్టినందున ప్రజలకు ఈ ప్రాజెక్టుపై అవగాహన వచ్చింది. కేసీఆర్ కూడా తన అభిప్రాయాన్ని చెప్పవచ్చు. తనకు చెప్పడం ఇష్టం లేకపోతే.. మంత్రులకు చెప్పవచ్చు' అని వెల్లడించారు.

## బాలికపై సామూహిక అత్యాచారం

**హుస్నాబాద్-నవభూమి:** సిద్దిపేట జిల్లాలో దారుణం చోటుచేసు కుంది. హుస్నాబాద్ పట్టణంలో ఇంటి ముందు ఆడుకుంటున్న మైనర్ బాలికపై ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారం చేశారు.రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన గురించి బాలిక సోమవారం రాత్రి తన తల్లికి వివరించింది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. అత్యాచారం చేసిన ముగ్గురు యువకులు.. బాలిక ఉంటున్న కాలనీకి చెందినవారుగా గుర్తించినట్లు చెప్పారు. బాలికను వైద్య పరీక్షలకు పంపినట్లు సీఐ తెలిపారు.

## నేడు తెలంగాణ వ్యాప్తంగా

**(1వపేజీ తరువాయి)** అన్నారు. ప్రజలపై విద్యుత్ భారం మోపడాన్ని ప్రధాన ప్రతిపక్షంగా వ్యతిరేకించామని తెలిపారు. పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని దీనిపై ఈఆర్సీపి ఒప్పించలిగామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షంగా తమ వాదనలోని సహేతుకత, న్యాయాన్నిను ఈఆర్సీ గుర్తించి కరెంట్ బిల్లుల పెంపు ప్రతిపాదనను తిరస్కరించిందని అన్నారు.విద్యుత్ పెంపు ప్రతిపాదనలను తిరస్కరించినందుకు ఈఆర్సీ చైర్మన్ శ్రీ రంగారావు, సభ్యులు మనోహర్ రాజు, కృష్ణయ్యకు తెలంగాణ ప్రజల తరపున మాజీ మంత్రి కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. విద్యుత్ చార్జీల పేరిట రూ. 18,500 కోట్ల అదనపు భారం ప్రజలపై మోపడాన్ని హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్లలో నిర్వహించిన మూడు బహిరంగ విచారణలలో తాము తీవ్రంగా వ్యతిరేకించామని కేటీఆర్ తెలిపారు. ఇది తెలంగాణ ప్రజల విజయం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## తల తాకట్టు పెట్టైనా రుణమాఫీ ఇస్తాం

**(1వపేజీ తరువాయి)**ఇవ్వబోతున్నామని వెల్లడించారు. ధాన్యంలో తేమ శాతం కోసం ఎండబెట్టుకుని తీసుకుపోవాలన్నారు. సీసీఐ నామ్స్ ప్రకారం రైతులు పత్తిని తీసుకురావాలన్నారు. ఒక్క కేజీ తరుగు తీయొద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు ఫిర్యాదు చేస్తే అధికారుల మీద చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎక్కడ నష్టం కలుగకుండా చూడాలన్నారు. రైతుల అవసరం, కష్టాలు తీర్చాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

## ఐదు జిల్లాల్లో 54 కరవు మండలాలు

**(1వపేజీ తరువాయి)**జారీ చేసింది.కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కర్నూలు, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని 54 మండలాలు కరవుబారిన పడినట్టు వెల్లడించింది. మిగతా 21 జిల్లాల్లో కరవు పరిస్థితులు లేనట్టుగా నివేదికలు వచ్చాయని స్పష్టం చేసింది. ఈ మండలాల్లో 27 చోట్ల తీవ్రమైన, మరో 27 మండలాల్లో మధ్యస్థంగా కరవు పరిస్థితులు ఉన్నట్టు ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది. వీటిని నోటిఫై చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశాలు జారీ చేశారు.

## ముస్లింలను ముక్కలుగా నరికేస్తాం

**(1వపేజీ తరువాయి)**చక్రవర్తి తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) నేత హుమయూన్ కబీర్ హిందువులను భాగీరథి నదిలో ముంచేస్తానన్న వ్యాఖ్యలను గుర్తు చేస్తూ ఆయన ఈ మాటలు అన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో వచ్చే నెలలో 6 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ప్రచారంలో మిథున్ చక్రవర్తి పాల్గొన్నారు. "ఆ నేత (కబీర్) వ్యాఖ్యలపై సీఎం మమత స్పందిస్తారని చూశాను. కానీ, స్పందించలేదు. ఇప్పుడు నేను చెప్తున్నాను. వాళ్లను ముక్కలుగా నరికేస్తాం. భూమిలో పాతేస్తాం. భాగీరథి నది మాకు తల్లిలాంటిది. అందుకే వాళ్లను అందులో వేయం" అన్నారు. మిథున్ చక్రవర్తి ఈ వ్యాఖ్యలు చేసేప్పుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పక్కనే ఉన్నారు.

## ఇచ్చినట్లే ఇచ్చి..వెనక్కి లాక్కునే


**(1వపేజీ తరువాయి)**మండలం చినగదిలి మండలంలో 73/11,83/5, 6 సర్వే నెంబర్లలో పశుసంవర్ధక శాఖకు చెందిన మూడు ఎకరాల స్థలంలో రెండు ఎకరాలను క్రీడలు, యువజన వ్యవహారాల శాఖకు.. ఒక ఎకరాన్ని వైద్య ఆరోగ్యశాఖకు బదలాయిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు కూడా జారీ చేశారు. క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ ఆ రెండు ఎకరాలను పీవీ సింధు బ్యాడ్మింటన్ అకాడమీ కోసం కేటాయించింది. అకాడమీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, మూడేళ్ల కాలానికి ఐటీ రిటర్నులు సమర్పించడమే కాకుండా నిబంధనల ప్రకారం మిగతా షరతులన్నీ పూర్తి చేశాక ఆ భూమిని పీవీ సింధు బ్యాడ్మింటన్ అకాడమీకి బదలాయించాలని కూడా నిర్ణయించారు. అకాడమీ అవసరాల కోసమే ఆ భూమిని వినియోగించాలని, కమర్షియల్ అవసరాల కోసం వినియోగించకూడదని ఉత్తర్వుల్లో అప్పటి సర్కార్ స్పష్టంగా పేర్కొంది.ప్రభుత్వ నిర్ణయంపై పీవీ సింధు హర్షం వ్యక్తంచేశారు. అకాడమీకి స్థలం కేటాయించినందుకు గాను అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. విశాఖపట్నంలో బ్యాడ్మింటన్ అకాడమీ లేదని.. అందుకే అక్కడ అత్యున్నత స్థాయి మౌలిక వసతులతో అకాడమీ ఏర్పాటు చేయాలని భావించాని.. అందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని తెలిపారు. తొలి దశలో అకాడమీ నిర్మిస్తామని.. తర్వాతి దశలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు ప్రతిపాదన ఉందని చెప్పారు. తానింకా ఆడుతున్నందుకు.. రిటైర్మెంట్ అయ్యాక అకాడమీలో శిక్షణ బాధ్యతలు చేపట్టనున్నట్లు పీవీ సింధు వెల్లడించారు. అయితే ప్రస్తుతం పీవీ సింధుకు కేటాయించిన స్థలాన్ని జూనియర్ కాలేజీకి కేటాయించాలంటూ స్థానికులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.స్థానికులను గతంలో అధికారంలో ఉన్న పార్టీ నేతలు రెచ్చగొడుతున్నారని వినిపిస్తోంది.

## ఆస్తుల పంపకాలు జరగలేదు

**(1వపేజీ తరువాయి)**కొడుకుగా జగన్ ఆస్తులను సంరక్షించాలి. వైఎస్సార్ చివరి రోజుల్లో ఆయనకు జగన్ మాట ఇచ్చారు. నాన్న నీ తర్వాత పాప మేలు కోరే వారిలో నేనే మొదటివాడిని అని.. వైఎస్సార్‌కు జగన్ మాట ఇవ్వడం కూడా నిజం. ఈ విషయం 'నాలో నాతో వైఎస్సార్' పుస్తకంలో ఎప్పుడో రాశా" అని విజయమ్మ స్పష్టం చేశారు.

**వైఎస్సార్ ఆస్తులు పంచలేదు...**

"అమ్మగా నాకు ఇద్దరూ సమానమే. అలాగే ఆస్తులు ఇద్దరికీ సమానమనేది నిజం. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు బాధ కలిగిస్తున్నాయి. తల్లిగా అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండటం నా విధి, ధర్మం. ఇంట్లో ఒకబిడ్డకు ఇంకోబిడ్డ అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం కష్టం. హక్కు ఉంది కాబట్టే పాప షర్మిలకు రూ.200 కోట్ల డివిడెండ్లు ఇచ్చారు. పాపకు హక్కు ఉంది కాబట్టే ఎంవోయూ రాసుకున్నారు. ఎంవోయూలో ఉన్న సరస్వతి షేర్స్ వందశాతం.. ఎంవోయూలో లేని యలహంక ప్రాపర్టీ వందశాతం వెంటనే ఇస్తానని.. జగన్ అప్పుడే మాట ఇచ్చి సంతకం పెట్టాడు.




## అమితాబ్ వద్ద అప్పు తీసుకున్న రతన్ టాటా.. ఆ స్టోరీ ఏంటో



**ముంబై-నవభూమి:** టాటా సంస్థ అధినేత, దివంగత రతన్ టాటా గురించి కొన్ని ఆసక్తికర విషయాలను బాలీవుడ్ స్టార్ అమితాబ్ వెల్లడించారు. గొప్ప దాతగా పేరుగాంచిన వ్యాపారవేత్త రతన్ టాటా అక్టోబర్ 9వ తేదీన ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే కౌన్ బనేగా కరోడ్‌పతి 16వ సీజన్‌లో రతన్ టాటా గురించి అమితాబ్ బచ్చన్ మాట్లాడారు. రతన్ టాటా చాలా సాధారణ మనిషి అని, అలాంటి ఉన్నతమైన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిని చూడలేదన్నారు. ఆయన గొప్పతనాన్ని మాటల్లో చెప్పలేమన్నారు.ఓసారి తాను వెళ్తున్న ఫ్లైట్‌లో రతన్ టాటా ఉన్నారని, హీత్రూ విమానాశ్రయంలో దిగిన తర్వాత .. రతన్ టాటా తన వ్యక్తుల గురించి ఎదురుచూశారన్నారు. వాళ్లు రాకపోవడంతో ఆయన ఫోన్ చేసేందుకు ఫోన్‌బూత్ వెళ్లారని, ఆ సమయంలో తాను అక్కడే నిలబడినట్లు అమితాబ్ తెలిపారు. కొంత సమయం తర్వాత ఫోన్ బూత్ నుంచి బయటకు వచ్చిన రతన్ టాటా.. తన వద్దకు వచ్చి అమితాబ్.. కొంత డబ్బును అప్పు ఇస్తావా అని అడిగినట్లు బిగ్‌బీ గుర్తు చేశారు. ఫోన్ కాల్ చేసేందుకు తన వద్ద డబ్బులు లేవని రతన్ టాటా పేర్కొన్నట్లు అమితాబ్ వెల్లడించారు.

## కోర్టులో జడ్జి వర్సెస్ లాయర్.. అడ్వకేట్లను తరిమిన పోలీసులు



**ఘజియాబాద్-నవభూమి:** యూపీలోని ఘజియాబాద్ కోర్టు ఇవాళ రణరంగంగా మారింది. జిల్లా కోర్టులో ఓ బెయిల్ పిటీషన్ విషయంలో.. జడ్జీతో పాటు లాయర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ఆ తర్వాత జడ్జీ ఛాంబర్ వద్ద భారీ సంఖ్యలో లాయర్లు గుమ్మిగూడారు. ఆందోళన చేపట్టిన అడ్వకేట్లను తరిమేందుకు పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. లాయర్లను మరీ వెంటాడి తరిమేశారు. ఆ తర్వాత పారామిలిటరీ దళాలు కూడా కోర్టు ఆవరణకుచేరుకున్నాయి.
పోలీసుల దాడిలో అనేక మంది లాయర్లు గాయపడినట్లు తెలుస్తోంది. పరిస్థితిపై చర్చించేందుకు బార్ అసోసియేషన్ మీటింగ్‌ను నిర్వహిస్తున్నది. జడ్జీ ఛాంబర్ నుంచి వెళ్లగొట్టిన తర్వాత.. లాయర్లు అంతా ఒక్క దగ్గరకు చేరుకుని ధర్నా చేపట్టారు. భద్రతా దళాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బెయిల్ పిటీషన్‌పై జడ్జి, లాయర్ మధ్య జరిగిన వాగ్వాదం చివరకు గొడవకు దారితీసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

## జీషన్ సిద్ధిక్, సల్మాన్ ఖాన్‌కు బెదిరింపులు.. వ్యక్తి అరెస్ట్




**న్యూఢిల్లీ-నవభూమి:** మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిక్ హత్య తర్వాత ఆయన కుమారుడు, ఎన్సీపీ (అజిత్ పవార్) నేత జీషన్ సిద్ధిక్ కి, బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ కు బెదిరింపు కాల్స్ వచ్చిన విషయం తెలిసిందే. చంపేస్తామంటూ సదరు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ బెదిరింపు కాల్స్ అక్టోబర్ 25వ తేదీన వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ బెదిరింపులపై జీషన్ సిద్ధిక్ కార్యాలయ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. బెదిరింపులకు పాల్పడింది నోయిడాకు చెందిన 20 ఏళ్ల వ్యక్తి మహ్మద్ తయ్యబ్‌గా గుర్తించారు. తాజాగా అతడిని అరెస్ట్ చేశారు.ప్రాణాలతో ఉండాలన్నా, బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న వైరానికి ముగింపు పలకాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలంటూ సల్మాన్ ఖాన్‌ను హెచ్చరించారు. ఈ మేరకు ముంబై ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబర్‌కు అక్టోబర్ 17 రాత్రి మెసేజ్ చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ నంబర్ ఎవరిది, మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చిందని కనుక్కొనే పనిలో పడ్డారు. ఈ కేసులో జంషెడ్‌పూర్‌కు 24 ఏళ్ల కూరగాయల అమ్మకందారుడు షేక్ హుస్సేన్ షేక్ మౌసిన్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.జీషన్ సిద్ధిక అజిత్ పవార్‌కు చెందిన నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీలో ఇటీవలే చేరారు. కాంగ్రెస్ పార్టీ ఆగస్టులో జీషన్‌ను వెలివేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ నేపథ్యంలో ఆ చర్య తీసుకున్నది. ఇక త్వరలో జరగబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బాంద్రా ఈస్ట్ నుంచి జీషన్ ఎన్సీపీ టికెట్‌పై పోటీ చేయనున్నారు. 2019 ఎన్నికల్లో ఆ స్థానం నుంచి వరుణ్ సర్దేశాయ్‌పై పోటీ చేసి గెలిచారు. మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ థాక్రే మేనల్లుడు వరుణ్‌పై ఆయన విజయం సాధించారు.


## లగ్జరీ విల్లా కొంటే రూ.4 కోట్ల విలువైన లాంబోర్గినీ ఫ్రీ.. బంపర్ ఆఫర్ ప్రకటించిన రియల్ ఎస్టేట్ సంస్థ

**న్యూఢిల్లీ-నవభూమి:** నోయిడా కు చెందిన ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్



సంస్థ బంపర్ ఆఫర్ ప్రకటించింది. తమ లగ్జరీ విల్లాలను కొనుగోలు చేసిన వారికి ఇటలీకి చెందిన సూపర్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆటోమొబిలి లాంబోర్గిని కారును కాంప్లిమెంటరీ కింద అందజేయనున్నట్లు తెలిపింది.నోయిడాలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ అయిన జేపీ గ్రీన్స్ . గ్రేటర్ నోయిడాలో సహా పలు విల్లాలను నిర్మించింది. వీటి ధరలు రూ.51 లక్షల నుంచి రూ.30 కోట్ల వరకూ నిర్ణయించింది. కొనుగోలు దారులను ఆకర్షించేందుకు ఆఫర్‌ను కూడా ప్రకటించారు. ఈ మేరకు రియల్టర్ గౌరవ్ గుప్తా తమ సంస్థ నిర్మించిన అల్ట్రా ప్రీమియం విల్లాలను కొనుగోలు చేసే వారికి సోషల్ మీడియా వేదికగా బంపర్ ఆఫర్‌ను ప్రకటించారు. రూ.26 కోట్ల కంటే ఎక్కువ ధర కలిగిన విల్లాను కొంటే రూ.4 కోట్ల కంటే ఎక్కువ విలువైన కాంప్లిమెంటరీ లాంబోర్గినీ ఉరస్ ని ఇవ్వనున్నట్లు తెలిపారు.కాగా, రూ.26 కోట్లు కేవలం బేస్ విల్లాకు మాత్రమే లెక్క. అదనపు సౌకర్యాలతో కలిపి దీని ధర రూ.27 కోట్లకు పైనే ఉంటుంది. బేస్ విల్లా కోసం రూ.26 కోట్లు పెట్టగా.. పార్కింగ్ కోసం రూ.30 లక్షలు, పవర్ బ్యాకప్ కోసం రూ.7.5 లక్షలు, క్లబ్ మెంబర్‌షిప్ కోసం మరో రూ.7.4 లక్షలు కట్టాల్సి ఉంటుంది. ఇక మీరు గోల్ఫ్ కోర్ట్ వ్యూతో విల్లా కోరుకుంటే మాత్రం మరో రూ.50 లక్షలు అదనంగా పే చేయాల్సి ఉంటుంది. దీంతో ఒక్కో విల్లా ధర రూ.26.95 కోట్ల నుంచి రూ.27.45 కోట్ల వరకూ ఉంటుందన్న మాట. ఇంత ఖర్చు చేస్తే మనకు లాంబోర్గినీ కారు కాంప్లిమెంటరీ కింద ఇస్తారు. రియల్ ఎస్టేట్ సంస్థ ప్రకటించిన ఈ ఆఫర్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. రియల్టర్ పెట్టిన ట్వీట్స్‌పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

## 10 నిమిషాల్లో మీ ఇంటికే బంగారం.. ధనత్రయోదశికి బంపరాఫర్



**న్యూఢిల్లీ-నవభూమి:** ధన త్రయోదశి ఏటా దీపావళి ముందు వచ్చే ఈ ధన త్రయోదశిని దేశవ్యాప్తంగా హిందువులు భక్తిశ్రద్దలతో నిర్వహిస్తుంటారు. ధన త్రయోదశి లక్ష్మీదేవికి ఎంతో ప్రీతికరమైన రోజుగా భావిస్తారు. ఈ పండగ రోజున బంగారం కొనుగోలు చేయడం వలన ఇంటికి శుభం కలుగుతుందని, శ్రేయస్సు చేకూరుతుందని విశ్వాసం. అందుకే ప్రస్తుతం బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ ఒక్క గ్రామైనా సరే కొనేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తుంటారు. కుదరని వాళ్లు వెండి ఇతర వస్తువులను కొనుగోలు చేసి ఇంట్లో లక్ష్మీదేవికి వద్ద ఉంచి పూజ చేస్తారు.
అయితే, ఈ ధన త్రయోదశికి బంగారం దుకాణంకు వెళ్లకుండానే పది నిమిషాల్లో మనకు అవసరమైన బంగారు, వెండి నాణేలను ఇంటి వద్దకే తెప్పించుకోవచ్చు. అదెలా అంటారా.. క్విక్ కామర్స్ సంస్థలు బ్లింకిట్, బిగ్ బాస్కెట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో ద్వారా. ఇవి ఈ దీపావళికి బంగారు, వెండి నాణేలను ఇంటి వద్దకే.. అది కూడా మనం ఆర్డర్ చేసిన పది నిమిషాల్లోనే డెలివరీ చేసేందుకు ముందుకొచ్చాయి. ఇందుకోసం ఆయా సంస్థలు పలు జువెల్లరీ సంస్థలతో భాగస్వామ్యంతో డెలివరీ చేసేందుకు సిద్ధమయ్యాయి.బ్లింకిట్..బ్లింకిట్ .. మలబార్ గోల్డ్ అండ్ డైమంట్స్, జోయాలుక్కాస్ సంస్థల భాగస్వామ్యంతో వెండి, బంగారు నాణేలను పది నిమిషాల్లోనే డెలివరీ చేయనుంది. ఈ విషయాన్ని బ్లింకిట్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో అల్బిందర్ ధిండ్సా ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ మేరకు ధన త్రయోదశి శుభాకాంక్షలు తెలిపారు. మలబార్, జోయాలుక్కాస్, వంటి విశ్వసనీయ బ్రాండ్‌ల నుండి వెండి (10గ్రా), గోల్డ్ (1గ్రా, 0.5గ్రా) నాణేలను డెలివరీ చేయనున్నట్లు వెల్లడించారు.

**బిగ్ బాస్కెట్..**
టాటా బ్రాండ్ తనిష్క్ జువెల్లరీ భాగస్వామ్యంతో బిగ్ బాస్కెట్ పలు నగరాల్లో ఈ సేవలను అందిస్తోంది. గోల్డ్, సిల్వర్ కాయిన్స్‌ని ఈ పండగ సీజన్‌లో ఇంటికి డెలివరీ చేస్తోంది. దుకాణాలకు వెళ్లకుండానే 999.9 ప్యూరిటీతో లక్ష్మీ గణేశ్ వెండి నాణేలు, 22 క్యారెట్ల గ్రాము విలువైన గోల్డ్ కాయిన్‌తోపాటు లక్ష్మీ మోటిఫ్‌తో ఉన్న గ్రాము బంగారు నాణేన్ని కూడా డెలివరీ చేసేందుకు సిద్ధమైంది.

**స్విగ్గీ ఇన్‌స్టామార్ట్..**
స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ మలబార్ గోల్డ్ అండ్ డైమంట్స్, ముత్తూట్ ఎగ్జిమ్, జార్ భాగస్వామ్యంతో కస్టమర్లకు ఈ సేవలు అందిస్తోంది. స్విగ్గీ ద్వారా.. 0.1 గ్రా, 0.25 గ్రా, 0.5 గ్రా, 1 గ్రా బరువుతో జార్ 24 క్యారెట్ గోల్డ్ కాయిన్స్‌ను కస్టమర్లు కొనుగోలు చేయొచ్చు. ఇక ముత్తూట్ ఎగ్జిమ్ 24 క్యారెట్ల గ్రాము గోల్డ్ కాయిన్ అందిస్తోంది. మలబార్ నుంచి 24 క్యారెట్ల గోల్డ్ కాయిన్ (1 గ్రా), 5 గ్రా, 11.66 గ్రా, 20 గ్రాముల ఎంపికతో 999 స్వచ్ఛమైన వెండి నాణేలను స్విగ్గీ ద్వారా కొనుగోలు చేయొచ్చు.
జెప్టో..జెప్టో తన కస్టమర్లకు 24 క్యారెట్ల 999 ప్యూర్ సిల్వర్ కాయిన్ (10 గ్రా)తో పాటు 0.1 గ్రా, 0.5 గ్రా, 1 గ్రా బరువుతో 24 క్యారెట్ల బన్యన్ ట్రీ గోల్డ్ కాయిన్‌ను కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. ఇక మలబార్ 24 క్యారెట్ల రోజ్ గోల్డ్ కాయిన్ (0.5 గ్రా), 24 క్యారెట్ల లక్ష్మీ గోల్డ్ కాయిన్ (1 గ్రా), 999 ప్యూర్ లక్ష్మీ గణేష్ సిల్వర్ కాయిన్ (10 గ్రా)తో సహా మరికొన్నింటిని జెప్టో ద్వారా ఆన్‌లైన్ డెలివరీ చేస్తోంది. ఇంకెందుకు ఆలస్యం ఆయా సంస్థల ద్వారా మీరు కూడా ఈ ధనత్రయోదశికి గోల్డ్, సిల్వర్ కాయిన్స్‌ను ఇంటి వద్దకే తెప్పించుకోండి.

## విజయ్ మహానాడు సభలో ఫ్యాన్స్ బీభత్సం!




కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో, సొంతంగా 'తమిళగ వెట్రి కళగం' అనే పార్టీని స్థాపించారు.2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పార్టీ తొలి మహానాడు సభను నిర్వహించారు. విల్లుపురం జిల్లాలోని విక్రవాండి సలై గ్రామంలో జరిగిన ఈ బహిరంగ సభకి.. భారీ సంఖ్యలో మద్దతుదారులు అభిమానులు తరలివచ్చారు. విజయ్ పవర్ ఫుల్ పొలిటికల్ స్పీచ్ కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అదే సమయంలో మీటింగ్ తర్వాత వేదిక వద్ద అభిమానులు బీభత్సం సృష్టించిన దృశ్యాలు కూడా తెగ వైరల్ అవుతున్నాయి.విజయ్ మెగా పొలిటికల్ మీటింగ్ ముగిసిన తర్వాత, అక్కడ పరిస్థితులకు సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. సభా వేదిక వద్ద వేలాది విరిగిన కుర్చీలు, దెబ్బతిన్న బారికేడ్లు, చెల్లాచెదురుగా పడి ఉన్న ఇతర వ్యర్థాలను మనం ఈ వీడియోలలో చూడొచ్చు. ఏదైనా పెద్ద పబ్లిక్ ఈవెంట్ జరిగినప్పుడు, ఎంతో కొంత డామేజ్ జరగడం మామూలే. కానీ ఇక్కడ టీవీకే మీటింగ్‌లో జరిగిన డ్యామేజ్ చూస్తుంటే.. అక్కడ ఆయన అభిమానులు, పార్టీ మద్దతుదారులు బీభత్సం సృష్టించినట్లు అనిపిస్తోంది. నిర్వాహకులకు చాలా మొత్తంలో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.తమ అభిమాన హీరో తమిళనాడు రాష్ట్రానికి నాయకత్వం వహించాలని కోరుకుంటున్నప్పుడు అభిమానులు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి, ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో హీరో విజయ్ ముందడుగు వేస్తున్నప్పుడు.. ఆయన మద్దతుదారులు తమ నాయకుడికి రాజకీయంగా ఎలాంటి ఇబ్బంది కలగకుండా బాధ్యతాయుతంగా మెలగాలి. వారు చేసే పనులు ఆయన విలువను పెంచేలా కానీ, తగ్గించకూడదు. సినిమా ఈవెంట్లలో చేసినట్లు ఇలా కుర్చీలు బారికేడ్లు విరగ్గొట్టడం సరైంది కాదు. ఇలాంటివి మళ్ళీ జరిగితే విజయ్ మీద, ఆ పార్టీ మీద జనాల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉంది.ఇకపోతే విజయ్ మహా సభకు లక్ష మందికి పైగా హాజరయ్యారని అంచనా వేస్తున్నారు. ఈ మీటింగ్‌కు వస్తూ ఇద్దరు అభిమానులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. బైక్ ప్రమాదంలో ఒకరు చనిపోతే, కదులుతున్న రైలు నుంచి దూకి మరో వ్యక్తి మృతి చెందినట్లు వార్తలు వచ్చాయి.

## లారెన్స్ హిట్ లిస్ట్‌లో మరో రెండు పేర్లు... మొదలైన బెదిరింపులు!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఎన్సీపీ నేత, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్య దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో వినిపించిన కాల్పుల మోతతో ముంబై మహానగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ సమయంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరు మరోసారి తెరపైకి వచ్చింది. ఈ సమయంలో ఆ హిట్ లిస్ట్ లో మరో రెండు పేర్లు చేరినట్లు తెలుస్తోంది.బాబా సిద్ధికీ హత్యకు తామే కారణమని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించిన నేపథ్యంలో.. ముంబై మహానగరం మరోసారి అండర్ వరల్డ్ హస్తాల్లోకి వెళ్తుందా అనే చర్చా మొదలైంది. ఈ సందర్భంగా.. బాబా సిద్ధిఖీ కుమారుడు, ఎమ్మెల్యే జీశాన్ సిద్ధిఖీ హీట్ ఆ హిట్ లిస్ట్ ఉన్నాడని అంటున్నారు. తాజాగా జీశాన్ ఆఫీసుకు గుర్తు తెలియని నెంబర్ నుంచి కాల్ వచ్చింది.. ఆ కాలర్ పెద్దమొత్తంలో డబ్బు డిమాండ్ చేశాడని.. ఇవ్వకపోతే ఎమ్మెల్యేతో పాటు సల్మాన్ ఖాన్ ను చంపేస్తామని బెదిరించాడని అంటున్నారు. దీనిపై ఫిర్యాదు చేయగా.. దీనికి సంబంధించి నోయిడా ప్రాంతంలో 20 ఏళ్ల వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో... స్పిరిచ్యువల్ కంటెంట్ క్రియేటర్ అభినవ్ అరోరాకు కూడా బెదిరింపులు వస్తున్నాయని అంటున్నారు. ఇందులో భాగంగా.. తమ కుమారుడు అభినవ్ అరోరాను చంపేస్తామని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరిస్తుందని అతడి తల్లి జ్యోతి తెలిపారు. గత రాత్రి ఓ కాల్ ను మిస్ చేశామని, తర్వాత అదే నెంబర్ నుంచి మెసేజ్ వచ్చిందని వెల్లడించారు. కాగా... అక్టోబర్ 12న తన కుమారుడి కార్యాలయం పరిశరాల్లో ముగ్గురు దుండగులు, ఆరు రౌడ్లు కాల్పులు జరపడంతో బాబా సిద్ధిఖ్ మరణించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో... బాబా సిద్ధీఖీని తామే చంపామని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. ఈ కేసులో పలువురు నిందితులను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే... బాబా సిద్ధిఖీ తోపాటు కుమారుడు జీశాన్ సిద్ధిఖీ ని చంపేందుకు తమకు కాంట్రాక్ట్ ఇచ్చినట్లు నిందితులు పోలీసుల విచారణలో చెప్పినట్లు కథనాలొచ్చిన సంగతి తెలిసందే. ఈ నేపథ్యంలో జీశాన్ కు తాజాగా ఫోన్ బెదిరింపులు వస్తున్నాయని అంటున్నారు. ఇదే సమయంలో.. స్పిరిచ్యువల్ కంటెంట్ క్రియేటర్ అభినవ్ అరోరాకు కూడా బెదిరింపులు వస్తున్నాయని చెబుతున్నారు.

## నాడు ఉగ్రవాదంపై పుస్తకం.. నేడు విమానాలకు బెదిరింపులు..



**న్యూఢిల్లీ-నవభూమి:** గత రెండు వారాలకు పైగా దేశంలో పలు విమానయాన సంస్థలకు చెందిన విమానాలకు బాంబు బెదిరింపులు వస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ఈ 15 రోజుల్లోనూ సుమారు 410 డొమెస్టిక్, ఇంటర్నేషనల్ సర్వీసులకు బెదిరింపులు వచ్చాయని చెబుతున్నారు. ఈ సమయంలో... బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు గుర్తించారు. గత పక్షం రోజులుగా దేశంలోని విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తీవ్ర చర్చనీయాంశం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ బెదిరింపులకు పాల్పడే వారిని నో ఫ్లై జాబితాలో చేర్చుతామని.. వారికి జీవిత ఖైదు విధించే విషయంలోనూ చర్చిస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి ప్రకటించారు కూడా. అయినప్పటికీ ఈ బెదిరింపులు ఆగడం లేదు. సోమవారం కూడా సుమారు 62 విమానాలకు బెదిరింపులు వచ్చాయి. ఈ క్రమంలో బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని మహారాష్ట్ర పోలీసులు గుర్తించారు. అయితే.. అతడు గతంలో ఉగ్రవాదంపై ఓ పుస్తకాన్ని రచించాడని చెబుతున్న విషయం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశం అవుతుంది. ఈ విషయాలపై స్పందించిన పోలీసులు.. నాగ్ పూర్ లోని గోండియాకు చెందిన జగదీశ్ యూకీ అనే వ్యక్తి ఇ-మెయిల్ ద్వా రా పలు ఎయిర్ లైన్స్ లకు నకిలీ బాంబు బెదిరింపులు పంపించాడు. దీంతోపాటు ప్రధానమంత్రి, రైల్వే మంత్రి, పలు ఎయిర్ లైన్స్ ఆఫీసులు, మహారాష్ట్ర సీఎం, డీజీపి, ఆర్.పీ.ఎఫ్. లతో పాటు పలు ప్రభుత్వ సంస్థలకు బెదిరింపు మెసేజ్ లు పంపించాడు. ఇదే సమయంలో... మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ను బెదిరించడంతో.. ఆయన నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అయితే... నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని.. అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. 2021లో ఈ నిందితుడు ఓ కేసులో అరెస్టైనట్లు వెల్లడించారు!

## ఢిల్లీలో కాస్త మెరుగుపడిన గాలి నాణ్యత.. అయినా ప్రమాదకరంగానే ఏక్యూఐ



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశరాజధాని ఢిల్లీలో వరుసగా ఆరు రోజుల తర్వాత మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ కాస్త మెరుగుపడింది. అయినప్ప టికీ ప్రమాదకర స్థాయిలోనే కొనసాగుతోంది. కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. మంగళవారం ఉదయం 9 గంటలకు దేశరాజధాని ఢిల్లీలో ఏక్యూఐ 272గా నమోదైంది.అత్యధికంగా ముండకా ప్రాంతంలో ఏక్యూఐ 327 తో అధ్వాన స్థితికి చేరినట్లు తెలిపింది. ఇక ఆనంద్ విహార్‌లో 318, అయా నగర్‌లో 313, వజీర్‌పూర్‌లో 307, పట్‌పర్ గంజ్‌లో 296, ఆర్కేపురంలో 295, రోహిణి ప్రాంతంలో 287, ఓఖ్లాఫేజ్ - 2 లో 265, ఐటీవో ప్రాంతంలో 261, లోధీ రోడ్డులో 255, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతంలో 247, అరబిందో మార్గ్‌లో 240గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది.

## ఆక్నూర్ ఆపరేషన్‌లో ఇద్దరు మిలిటెంట్లు కాల్చివేత..



**ఆక్నూర్: -నవభూమి:** జమ్మూ ప్రాంతంలోని ఆక్నూర్ సెక్టార్‌లో ఓ గ్రామంలో దాచుకున్న ఉగ్రవాదులపై భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. మంగళవారం ఉదయం జరిగిన కాల్పుల్లో ఓ ఉగ్రవాది మృతిచెందాడు. ఆ ప్రాంతంలో మిలిటెంట్లు ఉన్నట్లు సమాచారం రావడంతో ఫైరింగ్ జరిపారు. ఇప్పటి వరకు ఆక్నూర్ ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చారు. మరో ఉగ్రవాదిని హతమార్చేందుకు భద్రతా దళాలు వేటాడుతున్నాయి. జోగ్వాన్ గ్రామంలో ఉన్న అసన్ ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆ ఉగ్రవాది దాచుకున్నట్లు తెలుస్తోంది. నియంత్రణ రేఖ వద్ద తిరుగుతున్న ఆర్మీ కాన్వాయ్‌పై సోమవారం ఉదయం ముగ్గురు ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడ్డారు. ఆ వెంటనే భద్రతా దళాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. భద్రతా దళాలు, ఎన్ఎస్జీ కమాండోలు చేపట్టిన ఆపరేషన్‌లో తొలుత ఓ ఉగ్రవాది మరణించాడు.

## కేరళ సీఎంకు తప్పిన ప్రమాదం.. కాన్వాయ్‌లోని వాహనాలు ఒకదానికొకటి ఢీ..



**న్యూఢిల్లీ-నవభూమి:** కేరళ ముఖ్యమంత్రిపినరయి విజయన్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఆయన కాన్వాయ్ లోని పలు వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి . ఈ ఘటన తిరువనంతపురంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రమాదంలో సీఎం సహా సిబ్బందికి ఎలాంటి గాయాలూ కాలేదు. వాహనాలకు మాత్రం స్వల్ప నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.సీఎం విజయన్ సోమవారం సాయంత్రం కొట్టాయం సందర్శనకు వెళ్లి తిరిగి రాజధానికి వస్తున్న సమయంలో వామనాపురం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ సడెన్‌గా రైట్ తీసుకోబోతుండగా.. అప్రమత్తమైన కాన్వాయ్‌లోని ముందు వెళ్తున్న పైలట్ వాహనం అకస్మాత్తుగా ఆగిపోయింది. దీంతో వెనుక ఉన్న సీఎం కారు, అంబులెన్స్ సహా ఆరు ఎస్కార్ట్ వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో సీఎం వాహనానికి స్వల్పంగా నష్టం వాటిల్లినట్లు సమాచారం. అయితే, అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో సీఎం, ఇతర సిబ్బందికి ఎలాంటి గాయాలూ కాలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
బుధవారం
30 । అక్టోబర్ । 2024





## కేరళ ఉత్సవంలో పేలిన బాణాసంచా.. 150 మందికి గాయాలు



తిరువనంతపురం: కేరళలోని అంజుతాంబలం వీరేర్కావు ఆలయంలో సోమవారం రాత్రి బాణాసంచా పేల్చిన సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో సుమారు 150 మంది గాయపడ్డారు. గాయపడ్డవారిని కాసర్‌గడ్, కన్నూర్, మంగళూరు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. నీలేశ్వరంలోని వీరేర్కావు ఆలయం వద్ద నిల్వ ఉంచిన బాణాసంచా వల్ల ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. కాసర్‌గడ్ జిల్లాలో జరిగిన ఈ ప్రమాదంలో ప్రస్తుతం 8 మంది పరిస్థితి విషమంగా ఉన్నది. తీయం ఉత్సవంలో భాగంగా జరుగుతున్న సంబరాల వేళ విషాద ఘటన చోటుచేసుకున్నది. అర్ధరాత్రి వేళ ఫైర్‌క్రాకర్స్ కాల్చారని, అయితే ఆ బాంబు నిప్పు.. సమీప షెడ్డులో ఉన్న బాణాసంచాపై పడి ఉంటుందని, దాని వల్ల ప్రమాదం భారీగా జరిగినట్లు అంచనా వేస్తున్నారు. షెడ్డు నుంచి భారీ స్థాయిలో మంటలు, పొగ రావడంతో.. ఉత్సవానికి వచ్చిన భక్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఉత్సవం వేళ కాల్చేందుకు చైనీస్ బాణాసంచా తీసుకువచ్చామని, క్రాకర్స్ పేల్చుతున్న సమయంలో ఓ నిప్పురవ్వ షెడ్డుపై పడి ఉంటుందని అంటున్నారు.

ఆలయ కమిటీ ప్రెసిడెంట్‌తో పాటు కార్యదర్శిని పోలీసులు అరెస్టు చేశారు. కులిచి తొట్టం వేడుక కోసం సుమారు 24వేల ఖరీదైన బాణాసంచా కొనుగోలు చేసినట్లు ఆలయ కమిటీ పోలీసులకు తెలియజేసింది.

## ప్రజల చైతన్యం..నేతల వైఫల్యం

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి అవకాశం వచ్చిన ప్రతిసారీ ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలకు అవకాశం ఇస్తూనే ఉన్నారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్, బిజెపిలపై ఆశలు నీరుగారిన సమయంలో మరోసారి దేశంలో నెలకొన్న దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యామ్నాయం అవసరమనే భావిస్తున్నారు. టిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్తున్నట్టుగా దేశ కనీస అవసరాల విషయంలో విప్లవాత్మక మార్పులు రావాలంటే విప్లవాత్మక నిర్ణయాలు అవసరమే.

మన దేశ ప్రజల గురించి ఎప్పుడూ ఎక్కువగా తక్కువ చేసే మాటలే వినిపిస్తుంటాయి. నిరక్ష్యరాస్యత అధికం. పేదరికం ఎక్కువ. దరిద్రుల సంఖ్యే మిక్కిలిగా ఉంటుంది. పరిశుభ్రతే తెలియదు... ఇలాంటి పనికి మాలిన మాటలే ఎక్కువగా వింటూ ఉంటాం. ఇవి ఎవరో విదేశీయులు అనేవే కాదు, మన దేశంలోని సోకాల్డ్ మేధావులు ఇటువంటి వాదనలు చేస్తుంటారు. కానీ ఎప్పుడైనా ఈ దేశ ప్రజలు ఎంత చైతన్యవంతంగా ఆలోచిస్తుంటారో గమనించారా ఎవరైనా. కాస్త మన దేశ ప్రజల మీద ప్రేమతో జాతి అంతరంగం లోనికి తొంగి చూస్తే ప్రజల చైతన్య స్ఫూర్తిని చూసి మనమే సిగ్గ పడాల్సి వస్తుంది. ప్రజల పట్ల ఎన్ని ఈసడింపులు, ఛీత్కారాలు వ్యక్త పరిచినా, ప్రజలు అద్భుతంగా ఆలోచించిన సందర్భాలున్నాయి. ప్రజలు అన్ని వేళలా ప్రగతిశీలంగానే ఆలోచించారు. అవకాశం వచ్చిన ప్రతిసారీ వివేకంతోనే ఆలోచించారు. కానీ వాటిని అంది పుచ్చుకొని దేశాన్ని ప్రగతి పథంలో నిలపడంలో రాజకీయ పక్షాలు ఘోరంగా విఫలమయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ప్రతి అంశంలోనూ ప్రజల స్పందన అద్భుతం. ఒకసారి అప్పటి పరిస్థితులను గమనిస్తే, మొదట్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన విషయం కూడా ఆ కోవలోనే చూడాల్సి ఉంటుంది. గాంధీ, నెహ్రూ జోడీతో పాటు, శాస్త్రీజీ వంటి అనేక మంది స్వాతంత్ర్యంలో పాల్గొన్న నేతలకు పట్టం కట్టి దేశం బాగుపడుతుందని ఆశించారు. అంతటి సానుకూలతలోనూ కమ్యూనిస్టులను విశ్వసించారు. దేశంలో మార్పు కోసం కమ్యూనిస్టులు చేసిన ప్రయత్నాలకు అండగా నిలిచారు. కానీ వారి విశ్వాసాన్ని పూర్తిగా మలుచుకోవడంలో విఫలమై ప్రతిపక్షాలకు పరిమితమయ్యారు. పిడివాదంతో చీలికలు, పీలికలై ప్రజల విశ్వసనీయత కోల్పోయారు. అందులో నుండి పుట్టిన అతివాద వామపక్ష పార్టీలకు మద్దతిచ్చి, ప్రాణాలు కోల్పోయారు, ఇంకా కోల్పోతున్నారు. నెహ్రూ తర్వాత ఇందిరా గాంధీని ఎంతగానో బలపరిచిన ప్రజలు, ఆమె ఎమెర్జెన్సీని నిరసించారు.

ఇందిర నిరంకుశ విధానాలను మట్టికరిపించి ప్రపంచ దేశాల ముందు ప్రజాస్వామ్య కాంక్షను చాటారు. ఇందిర పాలనకు ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామ్య, సోషలిస్టు విధానలతో కూడిన జనతా పార్టీనీ ఆదరించారు. నాడు ప్రజల ఆకాంక్షను విస్తృతం చేసి దేశాన్ని పురోగతి వైపు నడపలేక అధికార లాలసతో చతికిల పడిపోయారు. అయినా ఆ తర్వాత ప్రజలు అనేక సందర్భాల్లో మార్పుకు ప్రగతిశీలతను కోరుకుంటూనే ఉన్నారు. ఇందిరాగాంధీ హత్యను దేశ ప్రజలు ముక్త కంఠంతో ఖండించారు. దేశ విచ్ఛిన్న శక్తుల తీరును నిరసిస్తూ రాజీవ్‌కు మద్దతుగా తిరుగులేని తీర్పునిచ్చారు. భోఫోర్స్ కుంభకోణాన్ని బయటకు తీసుక వచ్చిన విపి సింగ్‌ను కూడా అక్కున చేర్చుకున్నారు ఈ దేశ ప్రజలు. మళ్లీ నాటి జనతా ప్రభుత్వాలు చేసిన తప్పులే పునరావృతం చేసారే తప్ప దేశాన్ని సుస్థిరత, అభివృద్ధి వైపు నడపలేక పోయారు. సోషలిస్టు భావాలున్న విపి సింగ్, చంద్ర శేఖర్ లిద్దరూ ప్రజల ఆలోచనలను పరిపుష్టం చేయలేక పోయారు.

రాజీవ్ మరణంతో మళ్లీ కాంగ్రెస్‌కు అవకాశం వచ్చినా అదే తీరు కన్పించింది. దీంతో మరోసారి ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూసారు. అయినా కాంగ్రెసేతర శక్తులు ప్రత్యామ్నాయంగా నిలవ లేకపోయాయి. తర్వాత అవకాశం దక్కిన వాజపేయి ఐదేళ్లు అధికారంలో ఉన్నా దేశ ప్రజల్లో కాంగ్రెస్‌ను మైమమరపించ లేకపోవడంతో ప్రజలు మళ్లీ కాంగ్రెస్ కూటమి వైపే మొగ్గు చూపారు. మన్మోహన్ సింగ్కు మొదటి ఐదేళ్ల పాలనతో రెండో అవకాశం దక్కినా కుంభకోణాలతో యుపిఏ కుప్పకూలింది. ఎంతగా అంటే కనీసం ప్రతిపక్ష స్థానం కూడా దక్కించుకోలేనంతగా క్షీణించి పోయింది. దేశ ప్రజలు 2014 ఎన్నికల్లో కూడా ప్రగతి శీల దృక్పథంతోనే మోదీకి అవకాశం ఇచ్చారు. ఎవ్వరూ ఊహించని విధంగా దాదాపు ముప్పై ఏళ్ల తర్వాత ఒక పార్టీకి పూర్తి స్థాయి మెజారిటీ ఇచ్చారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీకి వచ్చిన పేరు ప్రఖ్యాతులతో, ఆయనతోనైనా ప్రబలమైన మార్పు వస్తుందేమోనని నమ్మారు. ఇది కాషాయంపై ప్రేమతోనో, హిందూత్వ భావజాలంతోనో వచ్చిన గెలుపు కానే కాదు. కేవలం అభివృద్ధి కోణంలోనే ఎన్నికల్లో ఓటు వేసారు, మోదీ కూడా అభివృద్ధి మంత్రాన్నే ప్రచారం చేసుకున్నారు. దేశంలోనే కాదు, రాష్ట్ర ప్రభుత్వాల విషయంలోనూ చైతన్య స్ఫూర్తితో వ్యవహరించారు. అభివృద్ధి కాంక్షతో ప్రాంతీయ పార్టీలను కోరుకున్నారు. ఎన్టీఆర్కు ఎనిమిది నెలల కాలంలో తిరుగులేని మెజారిటీ ఇచ్చినా, ఎంజీఆర్, మహంత, పట్నాయక్, ములాయం, లాలూ, హెగ్డే ఎవ్వరి విషయంలోనైనా చాలా ప్రగతిశీలతతో ఆలోచించారు. చదువు రాకపోయినా, ప్రచార సాధనాలు అంతగా లేకపోయినా దావానలంలా మార్పు విస్తరించగలిగిందంటే ప్రజల ఆలోచనా పరిపక్వతే కారణం.

1969లో తెలంగాణ ప్రజాసమితి వైపు ఏకపక్షంగా తీర్పు ఇచ్చి పదకొండు పార్లమెంట్ స్థానాల్లో గెలిపించడం కూడా ప్రజల విచక్షణతోనే జరిగింది. ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అనిశ్చితి రాజ్యమేలుతుంది, చిన్న రాష్ట్రాల్లో సుస్థిర పాలన ఉండదన్న ప్రచారం జరిగింది. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టేలా 2014 ఎన్నికల్లో తెలంగాణలో వివేకంతో స్పష్టమైన తీర్పునిచ్చారు ప్రజలు. ఈ మధ్య కాలంలో ఢిల్లీ ప్రజలు కూడా ఆమ్ ఆద్మీ పార్టీని కూడా అక్కున చేర్చుకున్నారు.

# నేటి పిల్లలే రేపటి పౌరసమాజ నిర్మాతలు





ఈ రోజు పిల్లలే రేపటి పౌరసమాజ నిర్మాతలు. పిల్లల ఇష్టాలకు విలువివ్వకుండా తల్లిదండ్రులు ప్రవర్తిస్తున్నారు. ఉదాహరణకు డబ్బున్న తల్లిదండ్రులు వారి పిల్లలు ఐఐటిలలో ఇంజనీరింగ్ లేదా ఎయిమ్స్ లో వైద్యవిద్య అభ్యసించాలని కోరుకుంటున్నారు. చదువంటే కేవలం ఇంజనీరింగ్ లేదా డాక్టర్లేనా ? మరే రంగం లేదా ? ఇది ఒక కోణం. మరో కోణంలో ఎంతో మంది పిల్లలు అల్ప ఆదాయం కలిగిన కుటుంబాలలో ఉంటున్నారు. దయనీయమైన, అమానుషమైన పరిస్థితుల్లో బతుకుతున్న పిల్లలు లక్షల్లో ఉన్నారు. మగపిల్లల కన్నా ఆడపిల్లలు మరింతగా బాధలు ఎదుర్కొంటున్నారు. సరైన ఆహారం లేక, ఆశ్రయం లేక, వీదుల్లో బతుకుతూ, అనారోగ్యం పాలై అనేక రకాల లైంగిక హింసలకి గురవుతూ, వ్యభిచారం కోసం అక్రమ రవాణాకి గురవుతూ వారుపడే బాధలు అన్నీ ఇన్నీ కావు. బాల కార్మికులుగా పసితనంలోనే బాల్యం కోల్పోతున్న కొందరైతే, బాల్య వివాహం వల్ల బతుకునే కోల్పోతున్నవారు మరికొందరు. సుమారుగా నలభైకోట్ల మంది పిల్లలున్న మనదేశంలో సాంఘికంగా, ఆర్థికంగా ఎంతో ప్రగతి సాధించినా, ఇంకా చాలా మంది పిల్లలు ఇలాంటి ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి పిల్లలకి ప్రత్యేక రక్షణ, ఆదరణ కావాలి. వారు విద్యావంతులవ్వాలి. అకృత్యాల బారిన పడకుండా, ఎవరి దోపిడీకి గురి కాకుండా, సురక్షణతో, గౌరవంతో బతికే జీవితం వారికి కావాలి. పిల్లల స్థాయిలోనే శారీరకంగా మానసికంగా ఉన్నతంగా ఎదగడానికి అవసరమైన సదుపాయాలు సమకూర్చడమే కాకుండా వారి హక్కులను కూడా కాపాడవలసిన బాధ్యత మనమీద ఉంది. జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కులనేవి ప్రధానమైన బాలల హక్కులు. బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాలి.

**ప్రత్యేక శ్రద్ధ ఎందుకు అవసరం?**

పద్దెనిమిది ఏళ్ళ కంటే తక్కువ వయస్సు ఉన్న వారందరూ పిల్లలే. బాల్యం ప్రతి మనిషికి ఓ అమూల్యమైన వరం. బాల్యంలో పిల్లలకు భిన్నమైన అనుభూతులు ఉంటాయి. పెద్దలతో పోల్చితే పిల్లలు సామాజికంగా ఎక్కువ హానికి గురయ్యే అవకాశాలు అధికం. ప్రభుత్వాల, సమాజం చర్యల నిష్క్రియాత్మకత వల్ల ఇతర వయస్సుల కంటే ఎక్కువగా పిల్లలు ప్రభావితమవుతారు. పిల్లలకు వారి స్వంత మనస్సు వ్యక్తీకరించే దృక్పథం, ఎంపిక చేసుకొని నిర్ణయించే సామర్థ్యం ఉండదు. పెద్దలు మార్గదర్శకత్వంగా ఉండకుండా వారి జీవితాన్ని నిర్ణయిస్తారు. పిల్లలు రకరకాలుగా దోపిడీ, దుర్వినియోగానికి గురవుతారు. పిల్లలందరూ వీటినుండి రక్షించబడాలి. కులం, జాతి, వర్గం, భాష, మతం, తెగ, అంతస్తు, సామర్థ్యం, పుట్టుక మరే ఇతర హోదాలను బట్టి వివక్ష చూపకుండా బాలలందరూ సమానంగా పరిగణించబడాలి.

**ఎదుర్కొంటున్న సవాళ్లు :**

బాల్యవివాహాలు జరగడం, బాల కార్మికులుగా పనిచేయడం, లైంగిక వేదింపులకు గురవ్వడం, పిల్లలచే భిక్షాటన చేయించడం ప్రధాన సవాళ్లు. బాల్యవివాహాలు పిల్లల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తాయి. దీనికి గురైన పిల్లలు పాఠశాల విద్య పూర్తి చేయలేకపోవడం వల్ల ఉన్నత చదువులు అభ్యసించే అవకాశాలు మృగ్యం అవుతున్నాయి. అదనంగా లైంగిక, శారీరక, మానసిక దాడికి గురయ్యే ప్రమాదం ఉంది. బాల్య వివాహాలు శారీరక, మానసిక అభివృద్ధికి నిరోధకాలు. ఇక బాలకార్మికుల అవస్థలు చూస్తే, పద్నాలుగు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న కొంతమంది పిల్లలు షూలు, ఫుట్‌బాల్‌లు కుట్టడం, సిగరెట్‌లు, అగరబత్తులు చుట్టడం, హస్తకళలు చేయడం, ప్యాకేజింగ్ చేయడం, వివిధ ఉత్పత్తులను లేబుల్ చేయడం, బాణాసంచా తయారీలాంటి పనులను చేస్తున్నారు. దీనికి కారణం వారి కుటుంబ ఆర్థిక స్థితి. తల్లిదండ్రులు అల్ప ఆదాయం కలిగి ఉండడమో లేదా కుటుంబంలోని పెద్దల నిరుద్యోగం వలన ఇంటి అవసరాలకు సహకరించడానికి బలవంతంగా బాలకార్మికులుగా తయారవుతున్నారు. కొన్ని సంచార జాతులలో పిల్లలచేత భిక్షాటన చేయిస్తున్నారు.

**రాజ్యాంగ హక్కులు :**

చట్టం ముందు అందరూ సమానమని ఆర్టికల్ 14, వివక్షతా వ్యతిరేక హక్కుగా ఆర్టికల్ 15, వ్యక్తిగత స్వేచ్ఛ జీవించే హక్కుగా ఆర్టికల్ 21, ఆరు నుండి పద్నాలుగు యేళ్ళ లోపు పిల్లలందరికీ నిర్బంద ఉచిత విద్య ఏర్పాటు బాధ్యత ప్రభుత్వాలదేనని ఆర్టికల్ 21(ఎ) , శ్రమశక్తిని దోపిడీ చేయకూడదని ఆర్టికల్ 23, పరిశ్రమలు గనులు ఇతర ప్రమాదకర ఉత్పత్తి ప్రక్రియలలో పనిచేయించరాదని ఆర్టికల్ 24, పిల్లలు ఆరోగ్యంగా అభివృద్ధి చెందడానికి అవకాశాలు, సౌకర్యాలు ప్రభుత్వాలు కల్పించాలని ఆర్టికల్ 39(ఎఫ్ ), ఆరు సంవత్సరాల వయస్సు పూర్తయ్యే వరకు పిల్లలందరికీ బాల్య సంరక్షణతో పాటు 14 సంవత్సరాల వయస్సు వరకు నిర్బంధ విద్యహక్కు ప్రభుత్వాలు కల్పించాలని ఆర్టికల్ 45 ఉన్నాయి.

**బాలల్ని రక్షించే చట్టాలు:**

బాలికలు లైంగికవేదనకు, అత్యాచారాలకు గురవ్వకుండా పోక్సో చట్టం, బాలకార్మికుల నిషేధ చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, బాండెడ్ లేబర్ సిస్టమ్ చట్టం, అనాథలు ఇతర స్వచ్ఛంద గృహాల పర్యవేక్షణ నియంత్రణ చట్టం లాంటివి బాలల రక్షణకు మద్దతు ఇస్తున్నాయి.

**ఫిర్యాదులకు ఆన్లైన్:**

బాల కార్మికులు, వీధి బాలలు, వివక్షతకు గురైనవారు, లైంగిక వేధింపులకు గురైనవారు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడినవారు. బాల్యవివాహ బాధితులు, హెచ్ఐవి ఎయిడ్స్ బాధితుల కోసం 'చైల్డ్ లైన్' అనే ప్రత్యేక సహాయ కేంద్రం పని చేస్తుంది. దీని ఉచిత ఫోన్ నంబర్ 1098. వీరికి సమాచారమిస్తే తక్షణం హాజరై బాలల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిస్తారు. వీరు అవసరమైతే బాలలను పునరావాస కేంద్రాలకు పంపించి ఉచితంగా వసతి కల్పించి చదువు చెప్పిస్తారు. పిల్లల హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా ఫిర్యాదుల పరిష్కారం కోసం ఆన్‌లైన్ పోర్టల్ "ఇ బాల్ నిదాన్" ఉంది. ఎన్ని చట్టాలు ఉన్నా కూడా ప్రజలలో సామాజిక మార్పు అనేది అవసరం. అప్పుడే మెరుగైన రేపటి సమాజాన్ని నిర్మించగలం. సమాజంలోని అందరూ మరింత బాధ్యతగా కృషి చేస్తే త్వరితంగా ఎందరో పిల్లల బతుకులు మెరుగుపడతాయి.

కింజరాపు అమరావతి
9494588909

# సామాజిక మాధ్యమాలకు ముకుతాడు!




ఈస్టిండియా కంపెనీతో మన దేశానికి దాపురించిన దుస్థితిని ఎలా మరచిపోగలం? ప్రపంచ వాణిజ్యంలో మన దేశం వాటా కేవలం రెండు శతాబ్దాలలో 23 శాతం నుంచి 2 శాతానికి పడిపోవడం ఆ కంపెనీ పుణ్యమే కదా! ఆ యూరోపియన్ కంపెనీ చరిత్రను అలా ఉంచి ఇప్పుడు మన జాతి జీవనంలో అంతర్భాగమైపోయిన అమెరికన్ కంపెనీల విషయాన్ని చూద్దాం. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీలు అయిన గూగుల్, ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సాప్ మన వాణిజ్యంపై గుత్తాధిపత్యం చెలాయించడమేకాదు, మన మనస్సులను సైతం నియంత్రిస్తున్నాయి! ఇదంతా తమ వ్యాపార ప్రయోజనాలను సాధించుకోవడానికే సుమా! భారత ప్రభుత్వం తమ కార్యకలాపాలపై నియంత్రణలను విధిస్తే దేశంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం నిలిచిపోతుందనే తప్పుడు సమాచారాన్ని ఆ కంపెనీలు చురుగ్గా వ్యాపింపజేయడమే అందుకొక నిదర్శనం. చైనాలో తమ కార్యకలాపాలపై ఆ దేశ ప్రభుత్వం అమలుపరుస్తున్న ఆంక్షలు, భారత్‌లో నియంత్రణల కంటే చాలా కఠినమైనవి అయినప్పటికీ ఆ కమ్యూనిస్టు దేశం భారీ విదేశీ మదుపులకు ప్రధాన గమ్యంగా కొనసాగుతోందన్న వాస్తవాన్ని అమెరికా ఐటి కంపెనీలు ఉద్దేశపూర్వకంగా దాచిపెడుతున్నాయి. కొన్ని వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం ఆ కంపెనీలకు తప్పనిసరి అయింది. గత ఏడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా నాటి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖాతాను ట్విటర్ నిలిపివేసింది. అదేవిధంగా భారతీయ జనతాపార్టీ కథనాలు కొన్నిటిని కూడా నిలిపివేసింది. అవి కల్పిత కథలు అని ట్విటర్ పేర్కొంది. ఇలా నిలిపివేయడం సరైన విషయమేనా కాదా అన్నది ప్రశ్న కాదు. ట్విటర్ ఈ నిర్ణయాలను తన వ్యాపార ప్రయోజనాలను మెరుగుపరచుకోవడానికి తీసుకున్నదా లేక సత్యాన్ని కాపాడేందుకు తీసుకున్నదా అన్నదే అసలు ప్రశ్న. 'సరైన' లేదా 'తప్పుడు' నిర్ణయాన్ని వ్యాపారపరమైన ఉన్నతిని దృష్టిలో పెట్టుకుని తీసుకోవచ్చా? ఈ ప్రకారం సామాజిక మాధ్యమాల కంపెనీలను క్రమబద్ధీకరించేందుకు భారత ప్రభుత్వం నిర్దేశించిన నియమనిబంధనలు సరైన రీతిలోనే ఉన్నాయి. ఆ నియమాల ప్రకారం సదరు కంపెనీలు భారత ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండడం కోసం ఒక ఫిర్యాదుల అధికారిని, ఒక పాలనావ్యవహారాల అధికారిని, ఒక నోడల్ అధికారిని నియమించవలసి ఉంది. అయితే సామాజిక మాధ్యమాలపై నియంత్రణను పూర్తిగా ప్రభుత్వానికి అప్పగించడం శ్రేయస్కరం కాదు. అందులో ఒక కన్పించని ప్రమాదముంది. వూహాన్‌లోని ఒక ప్రభుత్వ ప్రయోగశాలలో కరోనా వైరస్‌ను సృష్టి ంచారనడానికి సంబంధించిన వార్తలేవీ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వెలువడకుండా చైనా ప్రభుత్వం అడ్డుకున్నది. ఇటువంటి పరిస్థితుల్లో సామాజిక మాధ్యమాలు ఒక నిజమైన పాత్ర నిర్వహించవలసి ఉంది. అవును, సమాచారాన్ని సత్యనిష్ఠతో అందజేయడంలో ఆ మాధ్యమాలు ఒక బృహత్తర సానుకూల పాత్ర నిర్వహిస్తున్నాయి. రెండు విరుద్ధ అంశాలు మన ముందున్నాయి. దేశ ప్రజలకు సామాజిక మాధ్యమాలు జవాబుదారీగా ఉండాలిబీ వాక్ స్వాతంత్ర్యం పేరుతో అవి వ్యాపార ప్రయోజనాల కోసం పాకులాడకూడదు. ప్రభుత్వాలు విధించే ఆంక్షలను అధిగమించి సమాచారాన్ని స్వేచ్ఛగా ప్రజలకు చేర్చాలి. ఇందుకు ఏం చేయాలి? దానికి సమాధానంగా మూడు చర్యలను సూచిస్తాను. ఒకటి-%--% సామాజిక మాధ్యమాల కంపెనీలన్నీ భారత్‌లో విధిగా తమ విభాగాన్ని నెలకొల్పి, తమ కార్యకలాపాలు అన్నిటినీ ఆ వేదిక నుంచే నిర్వహించాలి. ఈ కంపెనీల మేనేజ్‌మెంట్ బోర్డ్‌లలో ప్రభుత్వ ప్రతినిధిగా ఒక డైరెక్టర్‌ను నియమించే అధికారం ప్రభుత్వానికి ఉండాలి. భారీ రుణాలు తీసుకున్న కంపెనీల మేనేజ్‌మెంట్ బోర్డ్‌లలో బ్యాంకులు తమ ప్రతినిధిని నియమించిన విధంగానే ఈ నియామకం కూడా జరగాలి. సదరు కంపెనీలలో 'ఇండిపెండెంట్ డైరెక్టర్'లను నియమించే అధికారం కూడా ప్రభుత్వానికి ఉండాలి. ఈ ప్రతినిధుల ద్వారా సామాజిక మాధ్యమాల కార్యకలాపాలను భారత ప్రజలు పర్యవేక్షించడం సాధ్యమవుతుంది. రెండు-పెద్ద సామాజిక మాధ్యమాల కంపెనీలను ప్రభుత్వం విభజించి తీరాలి. వ్యక్తిగత గోపత్యకు సంబంధించిన నియమాల్లో వాట్సాప్ మార్పులు చేసిన తరువాత సిగ్నల్, టెలిగ్రామ్ మొదలైన మెసేజింగ్ వేదికలు ఇతోధిక పురోగతి సాధించడం గమనార్హం. ఒక్కో సామాజిక మాధ్యమ వేదికకు వినియోగదారులు ఎంత మంది ఉన్నారో పరిశీలించి, ఒక నిర్దిష్ట వేదికకు గరిష్ఠంగా ఎంత మంది వాడకందారులు ఉండాలో నిర్ణయించాలని కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియాను ప్రభుత్వం ఆదేశించాలి. ఉదాహరణకు రెండు కోట్ల మంది కంటే ఎక్కువ మంది సభ్యులు గల సామాజిక మాధ్యమ వేదికను రెండు లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యలో చిన్న, స్వతంత్ర కంపెనీలుగా విభజించేందుకు ప్రభుత్వం పూనుకోవాలి. మూడు-మనదేశంలో మన ఐ.టి. నిపుణులతో ప్రారంభమైన సామాజిక మాధ్యమాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల అండదండల నందించాలి. సిలికాన్ వ్యాలీలో భారతీయులు అగ్రేసరులుగా ఉన్నప్పటికీ విదేశీ కంపెనీలకు దీటుగా సొంత సామాజిక మాధ్యమాలను అభివృద్ధిపరచలేకపోవడం ఒక మహా విషాదం. పది లక్షల మందికి పైగా వినియోగదారులు ఉన్న దేశీయ సామాజిక మాధ్యమ వేదికలకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకాలను ఇవ్వాలి. ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందడం వల్ల బాధ్యతాయుతంగా వ్యవహరించే వివిధ దేశీయ సామాజిక మాధ్యమాల కంపెనీలు అభివృద్ధిచెందడానికి అవకాశాలు మెరుగవుతాయి. విదేశీ కంపెనీల పోటీని దీటుగా ఎదుర్కోవడంతోపాటు మనమే మన సొంత అంతర్జాతీయ వేదికలను కూడా అభివృద్ధిపరచుకోవడం సాధ్యమవుతుంది.

దేశ చట్టాలకు జవాబుదారీతనం వహించేలా విదేశీ సామాజిక మాధ్యమాల కంపెనీలను బలవంతం చేయడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ స్థానం బలహీనపడుతుందని, దేశంలోకి విదేశీ పెట్టుబడుల రాక తగ్గిపోతుందేమోననే భయాన్ని మనం విడనాడి తీరాలి.

**- సహాయ మీడియా**

# శరత్ పూర్ణిమ






విజయదశమి తరవాత వచ్చేది- శరత్ పూర్ణిమ. ఇది ఆశ్వయుజ శుద్ధ పూర్ణిమ. ఈ పర్వదినాన లక్ష్మీదేవిని విశేషంగా పూజిస్తారు. మహిళలు వ్రతం ఆచరిస్తారు. శారదాదేవిని ఆరాధిస్తారు కాబట్టి, దీన్ని 'శారదా పూర్ణిమ' అని పిలుస్తారు. ఇదే పూర్ణిమ నాటి రాత్రి లక్ష్మీదేవి భువిలోని ఇళ్లకు వెళ్తుందని, తలుపు తట్టి 'రాత్రివేళ కొబ్బరి నీరు మాత్రమే సేవించి మేలుకొన్నదెవరు' అని ప్రశ్నిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. 'కో జాగర్'- అంటే, 'మేలుకొన్నదెవరు' అని అర్థం. అటువంటి స్త్రీలు గల ఇంట్లోకి దేవి ప్రవేశించి, సకల సంపదలూ అనుగ్రహిస్తుందని భక్తకోటి నమ్ముతుంది.

లక్ష్మికి వాహనం- పైడికంటి పక్షి. ఆ చల్లని తల్లి చేతిలో గవ్వల భరిణ ఉంటుందట. బియ్యం ఆమెకు ఎంతో ఇష్టమని చెబుతారు. అందుకే బెల్లం పాయసాన్ని దేవికి నైవేద్యంగా సమర్పిస్తారు. గవ్వలు అంటే, దేవి చేతిలోని నాణేలు! సముద్రం నుంచి ఆవిర్భవించడం వల్ల, సహజంగానే ఆమె చేతిలో గవ్వలుంటాయి. అవి సిరిసంపదలకు సంకేతాలన్న భావన లోకంలో నెలకొని ఉంది.

దేవికి అటుకులు, కొబ్బరి అత్యంత ప్రీతికరమైనవి. అందువల్ల కొన్ని ప్రాంతాల్లో మహిళలు బియ్యపు పిండిని ముద్దలుగా చేసి, ఇంటి ద్వారాల వద్ద ఉంచుతారు. ఇంటి గోడల మీద ఆ తల్లి పాదముద్రలు, శంఖాల బొమ్మలు, పైడికంటి పిట్టల చిత్రాలు వేస్తారు. గవ్వలాడుతూ, పాటలు పాడుకుంటూ, లక్ష్మిని ఆహ్వానిస్తూ రాత్రంతా తదేక చిత్తంతో జాగారం చేస్తారు. భక్తులు కొబ్బరినీరు మాత్రమే తీసుకుంటారు. వారు సంధ్యాసమయం నుంచి శంఖనాదం చేస్తుంటారు. ఆశ్వయుజ పూర్ణిమ వ్రత కథ 'భవిష్యోత్తర పురాణం'లో వివరంగా ఉంది. నియమ నిష్ఠలు కలిగిన వ్రతం ఇది. పార్వతికి వనితలు షోడశోపచార పూజలు చేస్తారు. అరిసెలు, అప్పాలతో పాటు కూరలు, అన్నం సిద్ధపరుస్తారు. ఆ తల్లితో పాటు నందికేశ్వర ప్రతిమలు ఉంచుతారు. ధర్మ అర్థ కామ మోక్షాలకు సంకేతంలా 'చతుర్భుజ'గా మహేశ్వరిని భావించి అర్చిస్తారు. నైవేద్యం, తాంబూలం, హారతి, ప్రదక్షిణ ముగిసిన అనంతరం- విగ్రహాన్ని జలంలో నిమజ్జనం చేయడం తరతరాల సంప్రదాయం.

వ్రత విధానాన్ని సాక్షాత్తు పరమేశ్వరే ఉపదేశించిందని పురాణ గాథలు చెబుతాయి. మగధ రాజ్య నివాసి వలితుడు భాగ్యవంతుడు కావడానికి, భార్యాసమేతంగా నిశ్చింతగా కాలం గడపడానికి అపార భక్తిశ్రద్ధలే కారణమని అవి వివరిస్తాయి. శ్రీమహాలక్ష్మి కృపా కిరణాలు సదా తమపై ప్రసరించాలని భక్తజనులు త్రికరణ శుద్ధిగా కోరుకుంటారు. ఆమె నామ శబ్దాన్ని వేదవిహితంగా, అనంత సంపదకు పర్యాయ పదంగా వారు సర్వదా తలచుకుంటారు. ఈ పండుగను మహారాష్ట్ర మహిళలు మహోత్సాహంగా జరుపుతారు. వెన్నెల రాత్రి ఆహారంగా పాలలో నానబెట్టిన అటుకుల్ని స్వీకరిస్తారు. పంచదార, కుంకుమ పువ్వు వేసి క్షీరాన్నం వండుతారు. ఆ పాయస పాత్రను బయట వెన్నెలలో ఉంచడం వల్ల, సహజసిద్ధంగానే చంద్రకిరణాల అమృత శక్తి ప్రసరిస్తుందని అనేకులు నమ్ముతారు. ఈ వ్రతాచరణ విధానం కాలక్రమంలో మహారాష్ట్ర నుంచి అన్ని రాష్ట్రాలకూ విస్తరించింది. ఇంటింటా సిరులు కురిపించే నిండైన పున్నమి వెన్నెల వేళగా దీన్ని తెలుగువారు పరిగణిస్తారు. సాయంకాలం ప్రారంభమయ్యే పండుగ సందర్భంగా, తల్లి తన బిడ్డలకు కొత్త వస్త్రాలిస్తుంది. దేవ వైద్యులైన అశ్వని పరిరక్షణలో పిల్లలందరూ చల్లగా ఉండాలని మాతృమూర్తి ఆశిస్తుంది. అలాగే, ఈ శుభసమయంలో నారదీయ పురాణ గ్రంథాన్ని దానం చేస్తే మరెన్నో ఉత్తమ ఫలితాలు కలుగుతాయన్నది భక్తజనుల ప్రగాఢ విశ్వాసం!

## ఇంటి గార్డెన్ కోసం ఇలా...



ఇంటి చుట్టూ మొక్కలు పెంచుకోవాలనే కోరిక అందరికీ ఉంటుంది. కానీ కొంతమంది మాత్రమే ఆ కలను సాకారం చేసుకుంటారు. నిజానికి ఇంటిని పచ్చని పొదరిల్లుగా మార్చుకోవాలంటే కొద్దిగా ఆసక్తి, కొంచెం ప్రణాళిక ఉంటే సరిపోతుంది. గార్డెనింగ్ ఏర్పాటు విషయంలో నిపుణులు సూచిస్తున్న సలహాలు ఇవి..ముందుగా స్థలం ఎంపిక చేసుకోవాలి. ఐదారు గంటల పాటు సూర్యరశ్మి నేరుగా పడే స్థలానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇండోర్‌లో అయితే గాలి బలంగా వీచే ప్రదేశాలను వీలైనంత వరకు ఎంచుకోకూడదు. స్థలం ఎంపిక చేసుకున్న తరువాత మొక్కల ఎంపిక చేపట్టాలి. పూల మొక్కలు కావాలా? హెర్బ్సు పెంచుకుంటారా? కూరగాయల మొక్కలకు ప్రాధాన్యం ఇస్తారా? అన్నది ముందుగా నిర్ణయించుకోవాలి. తరువాత పనిముట్లను సమకూర్చుకోవాలి.నల్లరేగడి మట్టి మొక్కల పెంపకానికి అనువైనది. ఎర్రనేలలు తేమను నిలుపుకోవు. కాబట్టి ఈ నేల రకాలు అంత అనువైనవి కావు. అయితే ఈ నేలలో సారవంతమైన మట్టిని తెచ్చిపోయడం ద్వారా మొక్కలకు అనువైనదిగా మార్చుకోవచ్చు. వర్మీ కంపోస్ట్, ఎరువులు కలుపుకోవడం ద్వారా నేలలో మొక్కలకు కావలసినంత పోషకాలు లభించేలా చేయవచ్చు.మొక్కలు ఎంపిక చేసుకునే ముందు మొక్కలు పెరిగే ఎత్తును దృష్టిలో ఉంచుకోవాలి. వాతావరణ పరిస్థితులనుకూడా దృష్టిలో పెట్టుకోవాలి. పూలమొక్కలు, పొదల్లా పెరిగే మొక్కలు, తీగలతో అల్లుకుపోయే మొక్కల్లో మీ స్థలం, అభిరుచిని బట్టి ఎంచుకోవాలి. పూల మొక్కలు గార్డెన్‌ను ఆకర్షణీయంగా మారుస్తాయి.

పూల మొక్కలు పెంచుకోవడానికి కుండీలు ఎంపిక చేసుకోవాలి.

# నిద్ర తగ్గితే కష్టమే!



రాత్రిళ్లు ఆలస్యంగా పడుకొని ఉదయం ఆలస్యంగా నిద్రలేవటం ఎక్కువ కాలం కొనసాగితే పగటిపూట నిద్రమత్తు వదలదు.

రోజూ 6 గంటలు నిద్రపోతున్నారా, 10 గంటలు నిద్రపోతున్నారా అనేది సమస్య కాదు. ఆలస్యంగా పడుకుంటే జీవ గడియారం దెబ్బతింటుంది కాబట్టి వేళకు నిద్రపోవాలి.

**మంచి నిద్ర పట్టాలంటే..!**

కెఫిన్‌కు దూరం- సాయంత్రం 4 తరువాత టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్ తీసుకోవద్దు.

ఆహారం- మానసికంగా ఆరోగ్యంగా ఉంటే పేగుల పనితీరు బాగుంటుంది. శుచిగా ఉండే ఆహారమే తినాలి.

దీర్ఘశ్వాస- పడుకునేముందు దీర్ఘశ్వాస తీసుకోవడం వల్ల ఆందోళన తగ్గి త్వరగా నిద్రపడుతుంది.

చురుగ్గా ఉండండి- డ్యాన్స్, నడక, వ్యాయామం లాంటివి రోజూ 30 నిమిషాల పాటు చేయాలి.

ఫోన్‌కు దూరం - నిద్రకు రెండు గంటల ముందుగానే ఫోను పక్కన పెట్టేయాలి, సోషల్ మీడియాకు దూరం ఉండాలి.



# టపాసులతో టెన్షన్ లేకుండా...



ఎల్లుండే దీపావళి. టపాసుల షాపింగ్ ఇప్పటికే జోరుగా, హుషారుగా మొదలైపోయింది. అయితే పేల్చే టపాసులతో దుష్టశక్తులతో పాటు ఆరోగ్యం కూడా పరారైపోకుండా చూసుకోవాలి. అందుకోసం కళ్లు, ఒళ్లు గాయపడకుండా కాపాడుకోవాలి.

**కంటి పాపలు పదిలంగా...**

టపాసులు పేలుతూనే నిప్పు రవ్వలను విరజిమ్ముతాయి. అవి చిన్నవైతే గాల్లోకి లేచి నేలను తాకేలోపే ఆరిపోతాయి. అవే పెద్దవైతే మాత్రం జాగ్రత్తగా ఉండాల్సిందే! పెద్ద శబ్దంతో పేలే టపాసుల రవ్వలు ఒంటితోపాటు, కళ్లలో కూడా ఎగిరొచ్చి పడతాయి. కనుగుడ్డుకు రవ్వలు తగిలి గాయాలవుతాయి కూడా! ఇలాంటప్పుడు కనుగుడ్డులోని కార్నియాకు నష్టం జరగొచ్చు. ఈ నష్టం వల్ల కంటిలో 'ట్రామాటిక్ కాటరాక్ట్' ఏర్పవచ్చు. గాయం తీవ్రతను బట్టి రెటీనా నరం దెబ్బతినొచ్చు. ఒకవేళ కాటరాక్ట్ ఏర్పడితే దాన్ని తొలగించి కుట్లు వేసి సరిచేయొచ్చు. దెబ్బ తీవ్రతను బట్టి రెటీనా డిటాచ్‌మెంట్ సర్జరీ చేసి, సరి చేయొచ్చు. కంట్లో దెబ్బ తగిలిన భాగాన్ని బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. అసలీ సమస్యలేవీ రాకుండా ఉండాలంటే టపాసులు కాల్చేటప్పుడు ఈ జాగ్రత్తలు పాటించాలి.

వీలైనంత దూరంగా ఉండి టపాసులు పేల్చాలి.

కళ్లకు కళ్లద్దాలు పెట్టుకుంటే నిప్పు రవ్వలు, టపాసుల్లో ఉండే రాళ్లు కనుగుడ్డుకు తగలకుండా ఉంటాయి.

టపాసులు వెలిగించటానికి పొడవాటి అగర్‌బత్తీ, పుల్లల్లాంటివి వాడాలి.

పేలే టపాసులకు కనీసం 5 మీటర్ల దూరంలో ఉండాలి.

కంట్లో నిప్పురవ్వ పడినా, రాళ్లు తగిలినా కన్ను కడిగేసి వదిలేయకుండా వెంటనే కంటి వైద్యుల్ని సంప్రదించాలి.

కంటికి తగిలే గాయాలకు ఎంత త్వరగా చికిత్స చేయగలిగితే కంటి చూపును అంత మెరుగ్గా కాపాడుకోవచ్చు.

కార్నియాకు తగిలిన దెబ్బలను నిర్లక్ష్యం చేస్తే ఏకంగా కంటి చూపు పోయే ప్రమాదం ఉంటుంది.

కంటికి దెబ్బ తగిలితే వేళ్లతో రుద్దడం, నీళ్లతో కడగటం, ఆయింట్‌మెంట్ పెట్టడం లాంటివి చేయకూడదు.

టపాసుల పొగ వల్ల కళ్ల మంటలు సహజం. ఈ మంటల నుంచి ఉపశమాన్నిచ్చే లూబ్రికెంట్స్ ఉంటాయి. వీటి కోసం పండగ ముందే వైద్యులను కలవాలి.

కాంటాక్ట్ లెన్స్‌లు వేసుకునేవాళ్లు టపాసులు కాల్చేటప్పుడు సాధారణ కళ్లజోడు వాడటం అవసరం. కాంటాక్ట్ లెన్స్‌ల మీద వేడి ప్రభావం ఎక్కువ. కొన్ని సందర్భాల్లో కార్నియా కాలే ప్రమాదం కూడా ఉంటుంది.

చిచ్చుబుడ్లు, రాకెట్ల వల్లే కళ్లకు గాయాలయ్యే అవకాశాలు ఎక్కువ. మరీ ముఖ్యంగా కంటికయ్యే గాయాల్లో కళ్ల మంటలు మొదలుకుని కార్నియా లేచిపోవటం, పాక్షిక అంధత్వం, పూర్తి అంధత్వం వరకూ ఎన్నో రకాల సమస్యలు చోటు చేసుకుంటూ ఉంటాయి. టపాసులు పేలేటప్పుడు వెలువడే వేడి 1200 డిగ్రీల వరకూ ఉంటుంది. ఇది మరిగే నీళ్ల 1000 డిగ్రీల ఉష్ణోగ్రత కంటే ఎక్కువ. గాజును కరిగించేంతగా, థర్డ్ డిగ్రీ గాయాలు చేసేంత ప్రమాదకరంగా ఉంటుంది. కాబట్టి టపాసులు పేల్చేటప్పుడు నిర్లక్ష్యం వద్దే వద్దు!





# సుస్వర నిధి

**రాగయుక్తంగా పాడితే... గొంతు మగాడిలా ఉందన్నారు. అందుకు ఆమె చిన్నబుచ్చుకోలేదు. ఆ విమర్శను ఒక ప్రశంసగా తీసుకుని... ఆ గొంతునే తన ప్రత్యేకతగా మలుచుకుంది. ఆపై... 'ధూమ్ మచాలే' లాంటి దుమ్ము లేపే బీటైనా... 'డ్యాన్స్ పే చాన్స్' అంటూ హుషారెత్తించినా... '**

రాగయుక్తంగా పాడితే... గొంతు మగాడిలా ఉందన్నారు. అందుకు ఆమె చిన్నబుచ్చుకోలేదు. ఆ విమర్శను ఒక ప్రశంసగా తీసుకుని... ఆ గొంతునే తన ప్రత్యేకతగా మలుచుకుంది. ఆపై... 'ధూమ్ మచాలే' లాంటి దుమ్ము లేపే బీటైనా... 'డ్యాన్స్ పే చాన్స్' అంటూ హుషారెత్తించి నా... 'షీలా కీ జవానీ'తో 'ఫిలిమ్‌ఫేర్ అవార్డు' పట్టినా... ఆమెకే చెల్లింది. గమకాల గమ్మత్తుల 'నిధి'... ఎంతటి క్లిష్టమైన బాణీ అయినా అలవోకగా ఆలపించగల గాయని... సునిధి చౌహాన్ జర్నీ ఇది.పాట ఏదైనా సునిధి చౌహాన్ గొంతులో పడితే... సుస్వరాల సంగమంలా వీనుల విందు చేస్తుంది. నాలుగేళ్లకే వేదికలెక్కి తన గాత్రాన్ని వినిపించిన ఆమె... ఆ తరువాత ఎన్నో మరపురాని గీతాలకు గొంతుగా మారింది. ప్రసిద్ధ గాయని, దివంగత లతామంగేష్కర్ మాటల్లో చెప్పాలంటే... 'సునిధి ఏ పాటనైనా అలవోకగా పాడగలదు. తన గాత్రం, శైలిలో సంగీతాభిమానులను మెప్పించగల హంగులన్నీ ఉన్నాయి. నేటి తర అత్యుత్తమ గాయని సునిధి'. ప్రముఖ సంగీత దర్శకుడు అనూ మాలిక్‌దీ అదే మాట. దాదాపు మూడు దశాబ్దాల ఆమె కెరీర్‌లో జనరంజకమైన మధుర గీతాలు ఎన్నో. ఢిల్లీలో పుట్టి పెరిగిన సునిధి... అసలు పేరు నిధి. అక్కడి 'గ్రీన్‌వే మోడ్రన్ స్కూల్'లో చదివింది. ఆమె తండ్రి దుష్యంత్ కుమార్ చౌహాన్‌ది ఉత్తరప్రదేశ్. రంగస్థల కళాకారుడు. తల్లి గృహిణి. ఆమె ప్రోద్బలం, ప్రోత్సాహంతోనే సునిధి సంగీత సాధన మొదలుపెట్టింది. నాలుగేళ్ల వయసులో స్థానిక పాటల పోటీల్లో పాల్గొంది. తండ్రి స్నేహితుల సలహాతో కాలక్షేపంగా కాకుండా సంగీతానికి ప్రత్యేకంగా సమయం కేటాయించింది సునిధి. ఎంతగా అంటే... దాని కోసం పాఠశాల విద్య పూర్తవగానే చదువుకు స్వస్తి చెప్పింది. ఒక పక్క లైవ్ షోలు చేస్తూనే... మరోవైపు తన గాత్రానికి మెరుగులు అద్దుకుంది. లతామంగేష్కర్‌కు వీరాభిమాని. ఆమె పాటలే సునిధికి ప్రేరణ. ఖాళీ సమయాల్లో ఇంట్లో ప్రముఖ గాయకుల పాటల కేసెట్లు, సీడీలు పెట్టుకొని వినడం, వాటిని సాధన చేయడం ఆమెకు బాల్యంలో అతి పెద్ద వ్యాపకం. అదే ఇప్పుడు ఆమెను విభిన్న గాయనిగా నిలబెట్టింది. ఓ వేదికపై సునిధి పాట విని ముగ్ధురాలైన నటి తబుస్సుమ్... తన షో 'తబుస్సుమ్ హిట్ పరేడ్'లో అవకాశం కల్పించారు. తనకు మంచి భవిష్యత్తు ఉందని, ముంబయిలో ఉంటే మరిన్ని అవకాశాలు వస్తాయని సునిధి తల్లితండ్రులకు తబుస్సుమ్ సూచించారు. దాంతో ఆమె కుటుంబం





ముంబయికి వచ్చి స్థిరపడింది. అప్పుడు సునిధి వయసు పదొకండేళ్లు.

**తొలి అవకాశం అలా...**

సునిధికి తన షోలో అవకాశం ఇవ్వడంతోనే తబుస్సుమ్ ఆగిపోలేదు. సంగీత దర్శకులు కల్యాణ్‌జీ, ఆనంద్‌జీలకు ఆమెను పరిచయం చేశారు. సునిధి గాత్రానికి ఫిదా అయిన కల్యాణ్‌జీ... ఆమెకు మంచి భవిష్యత్తు ఉందంటూ అభినందించారు. 'నిధి' పేరును సునిధిగా మార్చింది ఆయనే. ఆ పేరు తనకు అదృష్టాన్ని తీసుకువచ్చిందని అంటుంది సునిధి. ముంబయి వచ్చిన తొలి రోజుల్లో ఆమె కుటుంబం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. ఎప్పుడైతే కల్యాణ్‌జీ అకాడమీలో సభ్యురాలైందో... అప్పటి నుంచి సునిధి కెరీర్ పుంజుకుంది. కల్యాణ్‌జీ బృందం 'లిటిల్ వండర్స్'లో ప్రధాన గాయనిగా కొన్నేళ్లపాటు అనేక ప్రదర్శనలు ఇచ్చింది. అయితే తన కూతురు ఎక్కడ స్టేజీ షోలతోనే ఆగిపోతుందోననే ఆందోళన ఆమె తండ్రిని వేధించింది. కానీ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంపైనే సునిధి దృష్టి పెట్టింది. అదే ఆమెకు కలిసివచ్చింది. 1995 ఫిలిమ్‌ఫేర్ అవార్డ్స్ వేడుకలో 'లిటిల్ వండర్స్' ట్రూపు తరుపున గీతాలు ఆలపించింది. అది అక్కడే ఉన్న సంగీత దర్శకుడు ఆదేశ్ శ్రీవాస్తవకు ఎంతో నచ్చింది. వెంటనే పిలిచి తన చిత్రం 'శాస్త్రా'లో పాడించారు. పదకొండేళ్ల వయసులో 'లడకీ దివానీ దేఖో' అంటూ ఉదిత్ నారాయణ్‌తో కలిసి ఆ చిత్రంలో ఆలపించిన గీతంతో సునిధి పాటల ప్రయాణం ప్రారంభమైంది.

**దశ తిరిగింది...**

అదే సంవత్సరం డీడీ నేషనల్ చానల్ మొట్టమొదటి సింగింగ్ రియాలిటీ షో 'మేరీ ఆవాజ్ సునో' విజేతగా నిలిచి, లతామంగేష్కర్ ట్రోఫీ గెలుచుకుంది సునిధి. దాంతోపాటు తొలి సోలో ఆల్బమ్ 'అయిరా గెయిరా నాతు కైరా' విడుదలైంది. అయితే అది చిల్డ్రన్స్ ఆల్బమ్‌గా ప్రాచుర్యం పొందడంతో సునిధి ఆలోచనలో పడింది. తన ప్రతిభకు మెరుగులు అద్దుకోవాలన్న ఉద్దేశంతో గౌతమ్ ముఖర్జీ వద్ద శాస్త్రీయ సంగీతం అభ్యసించింది. రెండేళ్లపాటు బ్యాగ్రౌండ్ వోకలిస్ట్‌గా పని చేసింది. ఈ క్రమంలోనే గాయకుడు సోనూ నిగమ్... ఆమెను సంగీత దర్శకుడు సందీప్ చౌతాకు పరిచయం చేశాడు. ఆయన అప్పుడు రామ్‌గోపాల్‌వర్మ 'మస్త్' చిత్రానికి బాణీలు సమకూర్చే పనిలో ఉన్నారు. రెండు వారాల్లో సునిధితో టైటిల్ ట్రాక్‌తో పాటు 'రుకి రుకిసీ జిందగీ', 'సునా థా' పాటలు పాడించారు. 'రుకి రుకిసీ జిందగీ' పాటకు ఆమెకు 'ఆర్డీ బర్మన్' ఫిలిమ్‌ఫేర్ అవార్డు దక్కింది. ఉత్తమ గాయనిగా నామినేట్ అయింది. దాంతో సునిధి దశ తిరిగిపోయింది. ఆ ఏడాది చివరలో ఆనంద్‌మిలింద్ 'జాన్వర్', శ్రీవాస్తవ 'దహేక్', 'బడే దిల్‌వాలే'లో అవకాశాలు వచ్చాయి. మరుసటి ఏడాది, అంటే 2000లో అనూమాలిక్ స్వరకల్పనలో విడుదలైన 'ఫిజా'లో 'మెహబూబ్ మేరే' విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆ నాటి నుంచి నేటి వరకు ఆమె పాటల ప్రవాహం కొనసాగుతూనే ఉంది.

వందల గీతాలు...రెండు ఫిలిమ్‌ఫేర్ అవార్డులు గెలుచుకున్న సునిధి... ఇప్పటివరకు పధ్నాలుగు వందలకు పైగా సినీ గీతాలు ఆలపించింది. వాటిల్లో పదుల సంఖ్యలో సూపర్‌హిట్ తెలుగు పాటలు కూడా ఉన్నాయి. ఒక్క హిందీలోనే కాకుండా తమిళం, కన్నడ, మళయాళం, అస్సామీ, బెంగాలీ, భోజ్‌పురీ తదితర భాషల్లో తన గాత్ర మాధుర్యంతో అలరించింది. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్‌చేంజర్'లో 'జరగండి జరగండి' పాటతో తెలుగు ప్రేక్షకులను మరోసారి పలుకరించింది సునిధి.

సవాళ్లను అధిగమించి...పాటల ప్రపంచంలో అప్రతిహతంగా సాగిపోతున్న సునిధి... వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంది. సవాళ్లను అధిగమించింది. కెరీర్ ఆరంభంలో కొందరు మగాడి గొంతులా ఉందని తనను విమర్శించినా దాన్ని ఆమె ఒక అభినందనగా తీసుకుంది. 'అందుకు నేను బాధపడలేదు. ఈ గొంతు నాకు భగవంతుడు ఇచ్చిన వరంగా భావించాను. దానికి తగిన పాటలు ఇచ్చి సంగీత దర్శకులు నన్ను ప్రోత్సహించారు' అంటూ ఓ సందర్భంలో చెప్పింది ఈ గాయని. అయితే క్లిష్ట సమయంలో తనపై నమ్మకం ఉంచి, తనకు మద్దతుగా నిలిచిన అనూమాలిక్‌ను ఎప్పటికీ మర్చిపోనంటుంది. "అజ్‌నబీ' చిత్రం కోసం నాతో 'మేరీ జిందగీ మే' పాట పాడించాలని అనూమాలిక్ అనుకున్నారు. అప్పటివరకు ఐటెమ్ సాంగ్స్ పాడిన నాతో రొమాంటిక్ సాంగ్ పాడించడానికి చిత్ర దర్శకులు అబ్బాస్-మస్తాన్ ఒప్పుకోలేదు. కానీ అనూమాలిక్ పట్టు విడవలేదు. 'సునిధి మాత్రమే ఈ పాటు పాడుతుంది' అని వారికి తెగేసి చెప్పారు. చివరకు ఆయన మాటే గెలిచింది. ఆ పాట సూపర్‌హిట్ అయింది. వాస్తవానికి ఓ పేరున్న గాయకునితో పాడించాలనుకున్న గీతం అది. ఇక అక్కడి నుంచి నాకు వరుసపెట్టి రొమాంటిక్ సాంగ్స్ కూడా వచ్చాయి" అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది సునిధి.

పెళ్లి... విడాకులు... పెళ్లి...పద్దెనిమిదేళ్లకే బాబీ ఖాన్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్న సునిధి... ఏడాది తరువాత అతడి నుంచి విడిపోయింది. అది తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పుగా అభివర్ణించింది. 'అయితే ఆ అనుభవం నాలో ఎంతో పరిణతి తీసుకువచ్చింది. అయితే ఇలాంటి విషయాల్లో సమాజం ఎప్పుడూ మహిళలనే తప్పు పడుతుంది. పెళ్లయ్యాక మా ఇద్దరి దారులు వేరని తెలిసింది. ఒకరికి ఒకరం సరిపోమని అర్థమైంది. దాంతో విడిపోవాలనుకున్నాం. అంతకుమించి మా వైవాహిక బంధంలో ఎలాంటి గొడవలు, గందరగోళాలూ లేవు. మేం విడిపోయాక కొందరు నన్ను కించపరిచేలా మాట్లాడారు. కాలం మారుతోంది. కానీ దాంతో పోటీపడలేక ఆగిపోయినవారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు. వాటికి నేను విలువ ఇవ్వను' అంటూ నాటి రోజులు గుర్తు చేసుకున్న సునిధి... 2012లో సంగీత దర్శకుడు హితేష్ సోనిక్‌తో కలిసి ఏడడుగులు వేసింది. వారికి ఒక కుమారుడు.




## ప్రారంభ నష్టాల నుంచి రికవరీ.. స్వల్ప లాభాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ప్రారంభ నష్టాల నుంచి కోలుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 369.99 పాయింట్ల లబ్ధితో 80,369.03 పాయింట్ల వద్ద ముగిసింది. మరోవైపు, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 127.70 పాయింట్లు పుంజుకుని 24,466.85 పాయింట్ల వద్ద స్థిర పడింది. ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్బీఐ షేర్ ఐదు శాతం పుంజుకున్నది. మారుతి సుజుకి ద్వితీయ త్రైమాసికం ఆర్థిక ఫలితాలు ఇన్వెస్టర్లు, మార్కెట్ల అంచనాలను మిస్ కావడంతో మంగళవారం 6.42 శాతం నష్టపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ-50లో 31 షేర్లు లాభాలు గడించాయి. భారతీయ స్టేట్ బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్బీఐ లైఫ్, ఐచర్ మోటార్స్ 0.5 శాతం లాభ పడ్డాయి. మరోవైపు మారుతి సుజుకి, టాటా మోటార్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, హీరో మోటో కార్ప్, సన్ ఫార్మా సహా 19 స్టాక్స్ 4.16 శాతం వరకూ నష్టపోయాయి.నిఫ్టీ మిడ్ క్యాప్ 0.92 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.76 శాతం పుంజుకున్నాయి. స్టాక్ మార్కెట్లు పుంజుకోవడానికి బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ స్టాక్స్ దన్నుగా నిలిచాయి. నిఫ్టీ ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌యూ) ఇండెక్స్ 3.64 శాతం, నిఫ్టీ బ్యాంక్ 2.07, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ 1.53 శాతం, నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్ 2.08 శాతం లాభ పడ్డాయి. మరోవైపు ఆటో, ఫార్మా, ఐటీ, ఎఫ్ఎంసీజీ, హెల్త్ కేర్ ఇండెక్సులు మంగళవారం నష్టపోయాయి.సోమవారం సైతం దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 602.75 పాయింట్లు పుంజుకుని 80,005.04 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 158.35 పాయింట్ల లబ్ధితో 24,380.80 పాయింట్ల వద్ద స్థిర పడ్డాయి.

## మారుతి సుజుకి అంచనాలు మిస్.. ఆరు శాతం స్టాక్ పతనం

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికం ఆర్థిక ఫలితాలు ఇన్వెస్టర్లు, మార్కెట్ వర్గాల అంచనాలను మిస్ అయింది. ఫలితంగా మంగళవారం మారుతి సుజుకి షేర్ 6.42 శాతం నష్టంతో ఇంట్రాడే ట్రేడింగ్ లో రూ.10,744.10 అతి కనిష్ట స్థాయి నమోదు చేసుకుంది. 2023-24తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికం ఆర్థిక ఫలితాల్లో 17.4 శాతం తగ్గాయి. గతేడాదితో పోలిస్తే మారుతి సుజుకి స్టాండలోన్ నికర లాభాలు రూ.3,716.5 కోట్ల నుండి రూ.3,069.2 కోట్లకు పడిపోయాయి.మారుతి సుజుకి ఆపరేషన్స్ ద్వారా సంపాదించిన ఆదాయం 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్వల్పంగా 0.4 శాతం పుంజుకుని రూ.37,062.1 కోట్ల నుంచి రూ.37,202.8 కోట్లకు చేరింది. ఆపరేటింగ్ లాభాలు 7.7 శాతం తగ్గి రూ.4,784.20 కోట్లు (2023-24) నుంచి రూ.4,416.6 కోట్లకు పడిపోయాయి. గత మూడు నెలల్లో వాహనాల విక్రయాలు 3.9 శాతం తగ్గితే, ఎగుమతులు 12.1 శాతం పెరిగాయి. జూలై- సెప్టెంబర్ మధ్య కాలంలో 5,41,550 కార్లు విక్రయించింది మారుతి సుజుకి. వాటిలో దేశీయ మార్కెట్లో 4,63,834 యూనిట్లు విక్రయిస్తే, 77,716 యూనిట్ల కార్లు ఎగుమతి చేసింది.

## కన్ఫ్యూజ్ అవకండి.. దీపావళి సందర్భంగా బ్యాంక్ హాలిడే ఎప్పుడంటే..




**న్యూఢిల్లీ-నవభూమి:** వైవిధ్యమైన సాంస్కృతిక, సంప్రదాయాలకు నెలవైన మన దేశంలో దీపావళి పండగకు వివిధ ప్రాంతాల్లో విశేష ప్రాధాన్యత, విభిన్న రీతుల్లో వేడుకలు జరుగుతాయి. అందుకే దీపావళి పర్వదినాన దేశవ్యాప్తంగా బ్యాంక్ హాలిడే ఒకటే రోజున ఉండదు. రాష్ట్రాలను బట్టి మారుతుంది. అయితే బ్యాంక్ హాలిడే ఏ రోజున ఉంటుందో తెలిస్తే ముఖ్యమైన లావాదేవీలు నిర్వహించాల్సిన సాధారణ పౌరులు, కంపెనీలు, ఇతర వర్గాలవారు అప్రమత్తంగా ఉండే అవకాశం ఉంటుంది. తదనుగుణంగా ప్రణాళికల్లో మార్పులు చేసుకునేందుకు వీలుంటుంది. అయితే ఈ ఏడాది దీపావళి పండగ అక్టోబర్ 31నా? లేక నవంబర్ 1నా? అనే చిన్న కన్ఫ్యూజన్ ఉంది. దీపావళితో ముడిపడిన బ్యాంక్ హాలిడే విషయంలో కూడా ఈ గందరగోళం కొనసాగుతోంది.

ఆర్బీఐ హాలిడే క్యాలెండర్ ప్రకారం అక్టోబర్ 31న (గురువారం) పలు రాష్ట్రాల్లోని బ్యాంకులకు దీపావళి సెలవు ఉంది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లు ఉన్నాయి. కాబట్టి ఈ రాష్ట్రాల్లోని బ్యాంకులు గురువారం మూసి ఉంటాయి.

ఇక నవంబర్ 1న (శుక్రవారం) మరికొన్ని రాష్ట్రాల్లో బ్యాంకులకు దీపావళి సెలవు ఉంది. దీపావళి, కుత్ ఫెస్టివల్, కన్నడ రాజ్యోత్సవాల సందర్భంగా త్రిపుర, కర్ణాటక, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్, మహారాష్ట్ర, మేఘాలయ, సిక్కిం, మణిపూర్ రాష్ట్రాలలో బ్యాంకులు మూసి ఉంటాయి.ఇక నవంబర్ 2న దీపావళి (బలి ప్రతిపద), బలిపాడ్యమి/లక్ష్మీ పూజ, గోవర్ధన్ పూజ, విక్రమ్ సంవంత్ ఇలా వేర్వేరు విశేష పూజల కారణంగా గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరాఖండ్, సిక్కిం, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలోని బ్యాంకులు మూసి ఉంటాయి. దీపావళితో పాటు రాష్ట్రంలోని ప్రత్యేక పండగల కారణంగా కర్ణాటక, మహారాష్ట్రలో బ్యాంకులకు వరుసగా నాలుగు రోజులు సెలవులు వచ్చాయి. ఈ రాష్ట్రాల్లో అక్టోబరు 31 నుంచి నవంబర్ 3 వరకు బ్యాంకుల సేవలు అందుబాటులో ఉండవు.

## దాతృత్వ కార్యకలాపాల కోసం రూ.20,000 కోట్లు

**న్యూఢిల్లీ-నవభూమి:** స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపార దిగ్గజం అభిషేక్ లోధా, ఆయన కుటుంబం కీలక నిర్ణయం తీసుకుంది. తమ నిర్వహణలోని రియల్టీ కంపెనీ మాక్రోటెక్ డెవలపర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) ఈక్విటీలో తమకు ఉన్న 72.11 శాతం వాటాలో 18 నుంచి 19 శాతం వాటాను కుటుంబ నిర్వహణలోని స్వచ్ఛంద సేవా సంస్థ 'లో?థా ఫిలాంత్రఫీ ఫౌండేషన్' (ఎల్‌పీఎఫ)కు బదలాయించాలని నిర్ణయించింది. సోమవారం నాటి బీఎసఈ క్లోజింగ్ ధర ప్రకారం చూస్తే ఈ షేర్ల విలువ రూ.20,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఏటా ఈ షేర్లపై వచ్చే డివిడెండ్, ఇతర ఆదాయాన్ని ఎల్‌పీఎఫ్ విద్య, మహిళా సాధికారిత, స్థిరమైన పట్టణాభివృద్ధి వంటి కార్యకలాపాల కోసం ఖర్చు చేస్తుంది.కాగా ఈ విషయంలో తమకు టాటాలే ఆదర్శమని ఎండీఎల్ ఎండీ అండ్ సీఈఓ అభిషేక్ లోధా చెప్పారు. 'టాటా కుటుంబం వందేళ్ల కిత్రం తమ నిర్వహణలోని కంపెనీల్లో తమకు ఉన్న వాటా నుంచి పెద్ద మొత్తాన్ని టాటా ట్రస్టులకు బదిలీ చేసింది. ఈ కంపెనీల నుంచి వచ్చే ఆదాయాన్ని టాటా ట్రస్టులు అనేక సత్కార్యాలకు వినియోగిస్తూ దేశాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈ విషయంలో టాటాలే నాకు ఆదర్శం, ప్రేరణ' అన్నారు. వచ్చే ఏడాది జనవరి కల్లా ఎల్‌పీఎఫకు ఒక సలహా బోర్డును ఏర్పాటు చేసి వివిధ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలిపారు.

## రెండు ప్రపంచాల మధ్య: తల్లిదండ్రులు, పిల్లలకు ఆర్థిక ప్రణాళికను సమతుల్యం చేయడం

**న్యూఢిల్లీ-నవభూమి:** 40లలో నా జీవిత ప్రయాణము అనేక మెలికలు మరియు మలుపుతో సాగింది. నా కెరీర్, వ్యక్తిగత లక్ష్యాలు మరియు కుటుంబము అన్నీ క్రమబద్ధంగా ఉన్నాయని నేను అనుకునేంతలో కొత్త సవాళ్ళు ఎదురయ్యేవి. నా పిల్లలు మరియు వృద్ధులవుతున్న నా తల్లిదండ్రులకు ఒక సురక్షితమైన భవిష్యత్తును నిర్ధారించడం వీటిన్నటిలోకి చాలా పెద్దది.వృద్ధులవుతున్న తల్లిదండ్రుల సహకరించడం మరియు పెరుగుతున్న పిల్లల డిమాండ్స్ మధ్య నలిగిపోయే ఈ 'శాండ్విచ్ జనరేషన్' లో చాలామందికి ఇది తెలిసిన సత్యం. ఈ వాస్తవంలో జీవిస్తూ, ఇది అంత సులభమైనది కాదని నేను చెప్పగలను. మన పొదుపులను మించిపోయే ప్రమాదం అతి పెద్ద ఆందోళన. స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక బాధ్యతలను సమతుల్యం చేసుకుంటూ పెరుగుతున్న జీవన ఖర్చులను ఎదుర్కోవాలి, ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో. ఈ సమతుల్యం చేయడం అనే చర్యకు కేవలం పెట్టుబడులే కాకుండా అంతకుమించిన సమగ్ర ప్రణాళిక అవసరం ఉంటుంది.

**మీ ఆర్థిక సంతులనాన్ని కనుగొనండి**

ఈ సంతులనములో మీకు మార్గదర్శకంగా ఉండే ఒక హేతుబద్ధమైన వ్యూహము ఇక్కడ ఇవ్వబడింది:

ఫ్యామిలీ-ఫస్ట్ ఫండింగ్: ఇతర ఖర్చుల కంటే ముందు మీ కుటుంబ అవసరాల కోసం మీ ఆదాయములో కొంత భాగాన్ని పక్కన పెట్టడానికి ప్రాధాన్యత ఇవ్వండి. అంటే మీ ఆర్థిక ప్రణాళికలో మొదటి చర్యగా ఆవశ్యక కుటుంబ-సంబంధ ఆర్థిక లక్ష్యాల కొరకు నిధులు కేటాయించడం, ఉదా-తల్లిదండ్రుల ఆరోగ్యసంరక్షణకు మరియు పిల్లల చదువు కోసం.

**ఇన్‌కమ్ స్ట్రీమ్:** అదనపు ఆర్థిక భద్రతను అందించుటకు, ఆస్తిపై అద్దెలు లేదా ఇతర వ్యాపారాల వంటి అదనపు ఆదాయ వనరులను వృద్ధి చేసుకోండి. దీనిని భవిష్యత్ అవసరాలు లేదా అనుకోని ఖర్చుల కొరకు కేటాయించవచ్చు. ఇది మీరు మీ బాధ్యతలను నిర్వహించుటలో సహాయపడుతుంది.

నావిగేట్ ఇన్వెస్ట్మెంట్స్: వివిధ ఆర్థిక లక్ష్యాలను నెరవేర్చుకొనుటకు మీ పెట్టుబడులను ఈక్విటీలు, డెట్ మరియు రక్షణ ఉత్పత్తులలో విభజించండి. దీని వలన మీరు మీ డబ్బును అంతటిని ఒకేచోట పెట్టుబడి పెట్టకుండా మరియు రిస్క్?లను నిర్వహించుకుంటూ రిటర్న్ ఆప్టిమైజ్ చేయగలుగుతారు డెయిలీ రివ్యూ: కొత్తగా ఏర్పడే అవసరాలకు అనుగుణంగా ఉండేలా ఎప్పటికప్పుడు అంచనావేసుకోండి మరియు మీ ఆర్థిక వ్యూహాన్ని సరిచేయండి. జీవితం అనూహ్యమైనది మరియు ఒక ఫ్లెక్సిబుల్ ప్లాన్ మీ ఆర్థిక లక్ష్యాలు పట్టాలు తప్పకుండా మార్పులకు అనుగుణంగా ఉండేందుకు సహాయపడుతుంది.

# హైదరాబాద్ రియల్టీ



**న్యూఢిల్లీ-నవభూమి:** హైదరాబాద్ నిర్మాణ రంగం నత్తనడకన సాగుతున్నది. క్రయవిక్రయాల్లో మునుపెన్నడూ చూడని స్తబ్ధత నెలకొన్నది. అటు ఆఫీస్.. ఇటు హౌసింగ్ మార్కెట్ రెండూ వెలవెలబోతుండగా, ఈ పరిస్థితులపై వస్తున్న విశ్లేషణలు మరింత ఆందోళనకరంగా నిలుస్తున్నాయిప్పుడు. ఈ క్రమంలోనే ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ ప్రాప్‌టైగర్.. హైదరాబాద్‌సహా దేశంలోని 8 ప్రధాన నగరాల్లో సగటున పెరిగిన ఇండ్ల ధరలపై తాజాగా ఓ నివేదికను విడుదల చేసింది. ఇందులో హైదరాబాద్ అట్టడుగు స్థానానికి పడిపోయింది. గత ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంతో పోల్చితే ఈ ఏడాది ఇదే వ్యవధిలో చదరపు అడుగు ధర సగటు పెరుగుదల సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. కేవలం 7 శాతం పెరిగినట్టు ప్రాప్‌టైగర్ రిపోర్టు స్పష్టం చేసింది. హైదరాబాద్ మినహా మిగతా ఏడు నగరాల్లో ధరల పెరుగుదల గడిచిన ఏడాది కాలంలో సగటున రెండంకెల స్థాయిలో ఎగబాకడం గమనార్హం. గరిష్ఠంగా ఢిల్లీ-ఎన్సీఆర్‌లో 57 శాతం పెరుగుల కనిపించడం విశేషం.

**మంద గమనంలోకి..**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రధానంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో జోరు కనిపించింది. దాదాపు పదేండ్లపాటు ఈ ఉత్సాహం కొనసాగింది. అయితే గత ఏడాది చివర్లో రాష్ట్రంలో అధికారం మారడం, ఆ తర్వాత కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ఇతరత్రా పరిస్థితులతో ఒక్కసారిగా నిర్మాణ రంగంలో మందగమనం ఆవరించిందని రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీ నిపుణులు గట్టిగా చెప్తున్నారు. నిజానికి ఇప్పుడు ఢిల్లీ-ఎన్సీఆర్‌లో కనిపిస్తున్న జోష్ కంటే గతంలో హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలకున్న క్రేజే ఎక్కువ. గత ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతో వ్యాపార, పారిశ్రామిక రంగాలు హైదరాబాద్‌కు క్యూ కట్టాయి. దీంతో ఉద్యోగ-ఉపాధి అవకాశాలూ పెరిగాయి. ఇది నిర్మాణ రంగ పరిశ్రమ బలోపేతానికి దోహదం చేసింది. కానీ ఇప్పుడు మార్కెట్‌లో వ్యాపార కార్యకలాపాలు తగ్గిపోవడం, పెట్టుబడులు కూడా అంతంతమాత్రంగానే ఉండటం, ద్రవ్యోల్బణం, అధిక వడ్డీరేట్లు.. ఈ ప్రభావాలకుతోడు రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు సైతం రియల్ ఎస్టేట్ వృద్ధిని చిదిమేస్తున్నాయన్న అభిప్రాయాలు సంబంధిత వర్గాల నుంచి బలంగా వ్యక్తమవుతున్నాయి.

**కానరాని పండుగ కళ**

వినాయక చవితి మొదలు 5 నెలలపాటు ఏటా రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పండుగ కళ సంతరించుకుంటుంది. దాంతో నిర్మాణ రంగ అనుబంధ రంగాలూ కళకళలాడుతూంటాయి. ముఖ్యంగా దసరా, దీపావళికి ఇండ్ల అమ్మకాలు భారీగానే నమోదవుతాయని, కానీ ఈసారి ఆ పరిస్థితులు కనిపించట్లేదని రియల్టర్లు అంటున్నారు. దీంతో ఈ అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలోనూ రియల్ మార్కెట్ లేవకపోవచ్చనే అనుమానాల్ని వెలిబుచ్చుతున్నారు. ఇదే జరిగితే పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోతామని, ఇప్పటికే కట్టిన ఇండ్లు, ఫ్లాట్లు అలాగే ఉండిపోతున్నాయని, వాటిని అమ్ముకోలేక నానా అవస్థలు పడుతున్నామని తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మొత్తానికి హైదరాబాద్ రియల్టీకి ఇంకొంత కాలం గడ్డుకాలమేనని చెప్పక తప్పని పరిస్థితి ఉందంటున్నారు.

**హైడ్రా ఎఫెక్ట్**

కొనుగోలుదారుల్లో ముఖ్యంగా హైడ్రా భయాలు బాగా పెరిగిపోతున్నాయని, అందుకే అంతా వెనకడుగు వేస్తున్నారని నగరంలోని మెజారిటీ రియల్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారిప్పుడు. ప్రధానంగా ఎగువ మధ్యతరగతి కస్టమర్లు ఇండ్ల కొనుగోళ్లను వాయిదా వేసుకున్నట్టు చెప్తున్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో సొంతింటి కల అనేది సగటు మనిషికి జీవితకాల స్వప్నమని, ఇంటి కోసం ఉన్నదంతా అమ్ముకొనైనా, జీవితాంతం కష్టపడటానికైనా సిద్ధపడుతారని ఇండస్ట్రీ గుర్తుచేస్తున్నది. హైడ్రా ఎఫెక్ట్‌తో మార్కెట్‌పై అపనమ్మకాలు ఏర్పడ్డాయని, ఎక్కడ ఏది కొంటే.. ఎవరొచ్చి కూలగొడుతారేమోనన్న భయాందోళనల్లో ఇప్పుడు కొనుగోలుదారులు పడ్డారని రియల్టర్లు వాపోతున్నారు. అందుకే ఇండ్ల కొనుగోళ్లకే దూరం జరుగుతున్నట్టు వారంతా చెప్తున్నారు.

## మూడింతలైన ఎయిర్‌టెల్ లాభం

**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీ ఎయిర్‌టెల్ లాభాలు వాయువేగంతో దూసుకుపోయాయి. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ. 3,593 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,341 కోట్ల లాభంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 12 శాతం ఎగబాకి రూ.41,473 కోట్లకు చేరుకున్నది.మరోవైపు, కంపెనీ యాజమాన్యంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. గడిచిన 12 ఏండ్లుగా కంపెనీ ఎండీ, సీఈవోగా విధులు నిర్వహిస్తున్న గోపాల్ విఠల్‌కు ప్రమోషన్ లభించింది. జనవరి 1, 2026 నుంచి ఆయన ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. అలాగే ప్రస్తుతం సీవోవోగా విధులు నిర్వహిస్తున్న శశ్వాత్ శర్మను కంపెనీ ఎండీ, సీఈవోగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## లాభాల్లోకి భెల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 28: విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థ భెల్ ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చింది. సెప్టెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.106.15 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అధిక ఆదాయం సమకూరడం వల్లనే లాభాల్లోకి వచ్చినట్లు కంపెనీ పేర్కొంది.క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.63.01 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. ఏడాది క్రితం రూ.5,305.38 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.6,695.37 కోట్లకు ఎగబాకింది.

# హైబ్రిడ్ వాహనాలకే గిరాకీ




**న్యూఢిల్లీ-నవభూమి:** వాహన వినియోగదారులు పూర్తిగా విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ) కంటే బహుళ ఇంధన వినియోగ సామర్థ్యం వున్న హైబ్రిడ్ వాహనాల కొనుగోళ్లకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నట్టు ఓ తాజా సర్వేలో తేలింది. 'షిఫ్టింగ్ గేర్స్: అండర్‌స్టాండింగ్ ప్యాసింజర్ వెహికిల్ మార్కెట్ ట్రెండ్స్' పేరిట గ్రాంట్ థోంటన్ భారత్ నిర్వహించిన ఈ సర్వేలో 40 శాతం మంది హైబ్రిడ్ వాహనాలపట్ల ఇష్టాన్ని కనబరిస్తే, 17 శాతం మంది మాత్రమే ఈవీలపట్ల ఆసక్తిని ప్రదర్శించడం గమనార్హం. ఇక ప్రీమియం మోడళ్లకు 85 శాతం మంది మోజు చూపడం విశేషం. దేశవ్యాప్తంగా 3,500 మంది ఈ సర్వేలో పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోగా.. ప్రస్తుత ఈవీ ట్రెండ్‌కు భిన్నంగా ఫలితాలు రావడం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. మరోవైపు ఇప్పటికీ 34 శాతం మంది పెట్రోల్ ఆధారిత వాహనాలనే కావాలంటుండటం గుర్తించదగిన అంశంగానే నిలుస్తున్నది. కాగా, దేశవ్యాప్తంగా ఈవీల వినియోగానికి సరిపడా మౌలిక సదుపాయాల కల్పన లేకపోవడం, చార్జింగ్ స్టేషన్లు అక్కడక్కడానే కనిపిస్తుండటం, ప్రోత్సాహకాలు కూడా పెద్దగా ఉండకపోవడం వల్లే ఎక్కువ మంది ఈవీలను కొనేందుకు ముందుకు రావడం లేదన్న అభిప్రాయాలు సర్వేలో వ్యక్తమయ్యాయి. రెండు అంతకంటే ఎక్కువ ఇంధన వనరుల (పెట్రోల్, డీజిల్, గ్యాస్, సీఎన్‌జీ, బ్యాటరీ) వాడకం ద్వారా నడిచే వాహనాలనే హైబ్రిడ్ వెహికిల్స్‌గా పేర్కొంటున్న విషయం తెలిసిందే.

## 4.21 లక్షల కోట్లు పెరిగిన సంపద



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు దేశీయ మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో వరుసగా ఐదు రోజులుగా నష్టాల్లో కదలాడిన సూచీలు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 602.75 పాయింట్ల లాభంతో తిరిగి 80 వేల మైలురాయిని అధిగమించింది.

మార్కెట్ ముగిసే సమయానికి 80,005 వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ సైతం 158.35 పాయింట్లు అందుకొని 24,338.15 వద్దకు చేరుకున్నది. క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గడంతో మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో దీపావళి కంటే ముందుగానే బ్లూచిప్ సంస్థల షేర్లు రాకెట్‌లా పేలాయి. దీంతో గత ఐదు రోజులుగా నష్టాలే చవిచూస్తున్న దేశీయ మదుపరులకు లాభాల రుచి తగిలింది. సోమవారం రూ.4 లక్షల కోట్లకు పైగా సంపదను పెంచుకున్నారు. దీంతో బీఎస్‌ఈలో లిట్కస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.4,21,138.2 కోట్లు పెరిగి రూ.4,41,20,059.86 కోట్లు(5.25 ట్రిలియన్ డాలర్లు)గా నమోదైంది.ఐసీఐసీఐ బ్యాంక్ 3 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్‌ఫార్మా, టాటా మోటర్స్, ఎస్బీఐ, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, రిలయన్స్, ఐటీసీ, ఎల్‌అండ్‌టీలు లాభాల్లో ముగిశాయి.

కానీ, ఎయిర్‌టెల్, మారుతి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, కొటక్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టాల్లో ముగిశాయి.

## రూ. 10లకే బంగారం.. రిలయన్స్ జియో బంపర్ ఆఫర్..



**న్యూఢిల్లీ-నవభూమి:** ధన్‌తేరస్ సందర్భంగా ముఖేష్ అంబానీకి చెందిన జియో ఫైనాన్స్ బంపర్ ఆఫర్ ప్రకటించారు. కేవలం 10 రూపాయలకే బంగారాన్ని అందిస్తోంది. అయితే, ఇది ఫిజికల్ గోల్డ్ కాదండోయ్.. డిజిటల్ గోల్డ్. ధన్‌తేరాస్ సందర్భంగా జియో ఫైనాన్స్ ప్రకటించిన ఈ ఆఫర్‌ను ఎలా అందిపుచ్చుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. ధన్‌తేరాస్ సందర్భంగా మీరు బంగారం కొనుగోలు చేయాలని ప్లాన్ చేస్తున్నట్లయితే.. ఈ ఆఫర్‌లో కేవలం రూ. 10లకే బంగారాన్ని కొనుగోలు చేయొచ్చు. దీని కోసం మీరు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లో కూర్చొనే బంగారాన్ని కొనుగోలు చేయొచ్చు.

**స్మార్ట్ గోల్డ్‌తో ధన్‌తేరస్ సెలబ్రేషన్స్..**

ధన్‌తేరస్ సందర్భంగా ముఖేష్ అంబానీ కంపెనీ జియో ఫైనాన్స్ సర్వీసెస్ లిమిటెడ్ కొత్త స్కీమ్ ప్రకటించింది. స్మార్ట్ గోల్డ్ స్కీమ్‌ను ప్రారంభించింది. ఈ పథకం ద్వారా బంగారాన్ని డిజిటల్ రూపంలో కొనుగోలు చేయొచ్చు. స్మార్ట్ గోల్డ్ పథకం కింద వినియోగదారులు బంగారంపై తమ పెట్టుబడిని ఎప్పుడైనా నగదు, బంగారు నాణేలు, అభరణాల రూపంలో తీసుకోవచ్చు. ఈ స్కీమ్‌లో మీరు వేలు, లక్షల రూపాయాలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. కేవలం రూ. 10 కే బంగారం కొనుగోలు చేయొచ్చు.

**ఇలా బంగారం కొనుగోలు చేయండి..**

జియో ఫైనాన్స్ యాప్ ద్వారా స్మార్ట్ గోల్డ్ స్కీమ్‌లో రెండు విధాలుగా ఇన్వెస్ట్ చేయొచ్చు. కస్టమర్లు తమ వద్దనున్న డబ్బు ఆధారంగా గోల్డ్ కొనుగోలు చేయొచ్చు. లేదంటే బంగారం బరువును బట్టి కూడా కొనుగోలు చేయొచ్చు. బరువు ఆధారంగా 0.5 గ్రాములు, 1 గ్రాము, 2 గ్రాములు, 5 గ్రాములు, 10 గ్రాములు చొప్పున డిజిటల్ గోల్డ్ ఉంటుంది. అంతేకాదు.. నేరుగా బంగారు నాణేలను కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంది. హోమ్ డెలివరీ ఆప్షన్ కూడా ఉంది.





## క్యాన్సర్ ఔషధాలపై కీలక ఆదేశాలు జారీ చేసిన కేంద్రం..

**న్యూఢిల్లీ– నవభూమి:** క్యాన్సర్ రోగుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యాధితో బాధపడుతున్న వారికి ఊరట నిచ్చేలా కీలక ఆదేశాలు జారీ చేసింది. క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే మూడు ప్రధాన ఔషధాల ఎంఆర్పీ ధరలను తగ్గించింది. ఈ మేరకు నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ మూడు క్యాన్సర్ నిరోధక ఔషధాల ధరలు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చికిత్సలో వాడే ట్రాస్టూజుమాబ్, ఒసిమెర్టినిబ్, దుర్వాలుమాబ్ అనే మందుల ధరలు తగ్గనున్నాయి.
ఈ వ్యాధి నిరోధానికి వినియోగించే మందులు బాగా ఖరీదైనవి. సామాన్య ప్రజలకు సైతం వాటిని సరసమైన ధరలకు అందించాలనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని మోదీ సర్కార్ తెలిపింది. ఇటీవల ప్రకటించిన కేంద్ర బడ్జెట్ 2024-25లోనే వీటికి కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన రెవెన్యూ విభాగం ఈ మూడు మందులపై కస్టమ్స్ డ్యూటీని రద్దు చేసింది. అలాగే జీఎస్టీ రేటు 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. ఈ మేరకు ఎంఆర్పీని తగ్గించాలని తయారీదారులను ఎన్పీపీఏ ఆదేశించింది. ధరల మార్పు గురించి డీలర్లు, రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్లు, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలని సూచించింది.

## డ్రగ్స్ తయారీ ల్యాబ్ గుట్టురట్టు.. 95 కిలోల మాదకద్రవ్యాల పట్టివేత



**న్యూఢిల్లీ– నవభూమి:** రహస్యంగా డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టయింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు గౌతమ్‌బుధ్ నగర్ జిల్లా కాసన ఇండస్ట్రియల్ ఏరియాలో మంగళవారం దాడులు జరిపి మెథాంఫెటమైన్ డ్రగ్ ను రహస్యంగా తయారు చేస్తున్న ల్యాబ్‌ను గుర్తించారు. 95 కిలోల మెథాంపెటమైన్ డ్రగ్‌ను ఘన, ద్రవరూపంలో పట్టుకున్నారు. నలుగురు వ్యక్తులను ఎన్సీబీ అరెస్టు చేసినట్టు డీడీజీ (ఆపరేషన్స్) జ్ఞానేశ్వర్ సింగ్ తెలిపారు.
ప్రాథమిక సమాచారం ప్రకారం, రెయిడ్స్ సమయంలో ఫ్యాక్టరీలో ఉన్న ఢిల్లీకి చెంది ఒక వ్యాపారి తీహార్ జైల్ వార్డెన్‌తో కలిసి ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. అనధికారికంగా గత కొన్నేళ్లుగా ఈ ఫ్యాక్టరీ నడుపుతున్నట్టు గుర్తించారు. గతంలో డ్రగ్స్ సరఫరా కేసులో ఢిల్లీ వ్యాపారి అరెస్టయ్యాడని, తీహార్ జైలులో అతను ఉన్నప్పుడు జైలు వార్డెన్‌తో కలిసి ఒప్పందం చేసుకుని డ్రగ్స్ తయారీ ల్యాబ్‌ను రహస్యంగా ఏర్పాటు చేసినట్టు చెబుతున్నారు. ముంబైకి చెందిన కెమికల్ ఇంజినీరుతో కలిసి ఈ డ్రగ్స్ తయారు చేస్తున్నట్టు తెలుస్తోంది. దేశీయంగానే కాకుండానే, అంతర్జాతీయంగా కూడా డ్రగ్స్‌ను సరఫరా చేసినట్టు కూడా అధికారులు గుర్తించారు.
మెథాంఫెటమైన్ డ్రగ్ తయారీకి అవసరమైన కెమికల్స్‌ను వివిధ మార్గాల ద్వారా ల్యాబ్ సేకరించి, మెషనరీని దిగుమతి చేసుకున్నట్టు కూడా అధికారులు గుర్తించారు. కాగా, పట్టుబడిన 95 కిలోల డ్రగ్స్ విలువ వందల కోట్లలో ఉంటుందని చెబుతున్నారు.

## దీపావళి పండగ వేళ ఇండియన్ రైల్వేస్ గుడ్‌న్యూస్



**న్యూఢిల్లీ– నవభూమి:** పండగ వేళ దేశవ్యాప్తంగా ప్రజలు తమ స్వస్థలాలకు వెళ్తుంటారు. ఈ సమయంలో ఉండే రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేస్ ఈ కీలక ప్రకటన చేసింది. ప్రయాణీకులను సురక్షితంగా, సకాలంలో వారి గమ్య స్థానాలకు చేర్చేందుకు ఈ రైళ్లను ప్రవేశపెట్టింది. దేశంలోని అన్ని ప్రాంతాలకు ఈ ట్రైన్స్ నడపనున్నట్టు పేర్కొందిదీపావళి పండగకు ముందు రైల్వే ప్రయాణీకులకు ఇండియన్ రైల్వేస్ గుడ్‌న్యూస్ చెప్పింది. దీపావళి పండుగ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో 200 కొత్త రైళ్లను ప్రకటించింది. పండగ వేళ దేశవ్యాప్తంగా ప్రజలు తమ స్వస్థలాలకు వెళ్తుంటారు. ఈ సమయంలో ఉండే రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేస్ ఈ కీలక ప్రకటన చేసింది. ప్రయాణీకులను సురక్షితంగా, సకాలంలో వారి గమ్య స్థానాలకు చేర్చేందుకు ఈ రైళ్లను ప్రవేశపెట్టింది. దేశంలోని అన్ని ప్రాంతాలకు ఈ ట్రైన్స్ నడపనున్నట్టు పేర్కొంది. న్యూఢిల్లీ, పాట్నా, అహ్మదాబాద్, లక్నో, రోహ్‌తక్, పూణే, ముంబైతో పాటు ఇతర ప్రధాన స్టేషన్లను అనుసంధానిస్తూ ఈ సర్వీసులను నడపనున్నట్టు పేర్కొంది. ఈ కొత్త రైళ్లకు తోడు పండుగ సీజన్‌లో మరింత మంది ప్రయాణీకుల సౌకర్యార్థం అక్టోబర్ 29, 30 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు పేర్కొంది. రైళ్లకు సంబంధించిన సమాచారాన్ని ఎక్స్ ద్వారా వెల్లడించింది. దీపావళి, ఛత్ పూజ సమయంలో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం 7,000 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ రైళ్ల ద్వారా రోజుకు అదనంగా రెండు లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**ప్లాట్‌ఫారమ్ రద్దీ నివారణకు చర్యలు**

దీపావళి నేపథ్యంలో స్టేషన్లలో రద్దీని నియంత్రించేందుకు గత ఆదివారం ఇండియన్ రైల్వేస్ కీలక ప్రకటన చేసింది. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, దాదర్, లోకమాన్య తిలక్ టెర్మినస్, థానే, కళ్యాణ్, పూణే, నాగ్‌పూర్‌తో సహా ఎంపిక చేసిన ప్రధాన స్టేషన్లలో ప్లాట్‌ఫారమ్ టిక్కెట్ల అమ్మకాలపై తాత్కాలిక ఆంక్షలు విధించింది. దీంతో ప్లాట్‌ఫామ్ టికెట్లను పరిమిత సంఖ్యలోనే విక్రయించనున్నారు. ఆదివారం ఉదయం ముంబైలోని బాంద్రా రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట నేపథ్యంలో రైల్వేస్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ తొక్కిసలాట ఘటనలో పలువురు ప్రయాణీకులు గాయపడ్డారు.

## ఎన్నికల్లో ఓటమి భయంతో ప్రతిపక్షాలపై పోలీసుల ప్రయోగం : సంజయ్ రౌత్

**న్యూఢిల్లీ–నవభూమి:** మహారాష్ట్రలోని అధికార మహాయుతి ప్రభుత్వంపై ప్రతిపక్షాలపై పోలీస్ యంత్రాంగాన్ని ఉపయోగిస్తోందని శివసేన నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. డీజీపీ రష్మీ శుక్లాను ఆ పదవి నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన మహా వికాస్ అఘాడి కూటమి అభ్యర్థులపై దాడులకు పాల్పడుతోందని.. ఎన్నికల్లో ఓటమి భయంతోనే పోలీసుతో ఒత్తిడి పెంచుతుందని మండిపడ్డారు. శివసేన యూబీటీ అభ్యర్థి అద్వయ్ హిరాయ్ పాటిల్‌పై శివసేన మంత్రి దాదాజీ బూసే గూండాలు నాసిక్‌లోని మాలెగావ్ ఔటర్ నియోజకవర్గంలో దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. పోలీసులు దాడి చేసిన వారిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇది మాలేగావ్‌కి మాత్రమే పరిమితం కాదన్నారు. డీజీపీ రష్మీ శుక్లాను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేయడానికి కారణం అదేనన్నారు. ఇదిలా ఉండగా.. సీట్ల సర్దుబాటుపై ఆయన స్పందిస్తూ.. మిత్రపక్షాల భిన్నవాదనల మధ్య మిరాజ్, షోలాపూర్ సౌత్ స్థానాల్లో శివసేన (యూబీటీ) పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని పార్టీతో పాటు ఎంవీఏలో కాంగ్రెస్, ఎన్సీపీ (శరద్ పవార్) ఉన్నాయన్నారు.

# ఎన్నికల్లో రష్యా వేలు?



**అమెరికా– నవభూమి:** 'ఒక పెద్ద దేశం.. తమ పక్కనున్న దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటుంది' అనే ఆరోపణలు ఎప్పుడూ ఉండేవే.. అమెరికా, రష్యాలాంటి ప్రపంచ శక్తుల విషయంలో అయితే ఇది మరీ ఎక్కువ.. సుదూరంగా ఉన్న దేశాల అంతర్గత విషయాల్లోకి చొచ్చుకెళ్లే తీరు వీటిది. అంతెందుకు..? 2016 అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ నకు అనుకూలంగా రష్యా పనిచేసిందనే ఆరోపణలున్నాయి. ఇప్పుడు మరో దేశ ఎన్నికల విషయంలోనూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆ దేశం ఏదో కాదు.. ఒకప్పుడు తమ నుంచి విడిపోయినదే కావడం ఇక్కడ గమనార్హం. అసలేమిటీ గోల..? జార్జియా.. మనందరికీ బాగా తెలిసిన పేరే.. చాలా తెలుగు సినిమాలు ఇక్కడ షూటింగ్ జరుపుకొన్నాయి. భారతీయ విద్యార్థులు ఈ దేశంలో మెడిసిన్ చదివేందుకు వెళుతుంటారు. కాగా, ఒకప్పుడు యునైటెడ్ సోషలిస్ట్ సోవియట్ యూనియన్ (యూఎస్ఎస్ఆర్)లో జార్జియా కూడా ఒక భాగం. అయితే, 1990 తర్వాత యూఎస్ఎస్ఆర్ నుంచి విడిపోయిన 15 దేశాల్లో ఇదీ ఒకటి. తాజాగా జార్జియాలో ఎన్నికలు జరిగాయి. కానీ.. ఫలితాలపై మాత్రం తీవ్ర వివాదం నెలకొంది. దానికి కారణం రష్యా అనే ఆరోపణలు వస్తున్నాయి. గెలుపు డ్రీమ్ చెల్లదంటూ.. రష్యాకు పక్కనే ఉండే జార్జియాలో ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. వీటిలో ప్రస్తుతం అధికారంలో ఉన్న జార్జియా డ్రీమ్ పార్టీ 54.8 శాతం ఓట్లతో విజయం సాధించింది. ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది కూడా. అయితే, డ్రీమ్ పార్టీని స్థాపించింది బిడ్జినా ఇవానిష్విలి. రష్యాలో రూ.వేల కోట్లు సంపాదించిన వ్యక్తి ఇతడు. అయితే, డ్రీమ్ పార్టీ విజయాన్ని జార్జియా అధ్యక్షురాలు సలోమీ జౌరాబిచ్విలి అంగీకరించడం లేదు. అంతేకాక ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ ప్రతిపక్షాలతో కలిసి జార్జియా రాజధాని టిబిలిసి వీధుల్లోకి వచ్చి ఆందోళనల్లో పాల్గొన్నారు. తమ దేశ ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందంటూ ప్రతిపక్షాలు, అమెరికా, ఐరోపా సమాఖ్య (ఈయూ) తమకు మద్దతు ఇవ్వాలని పిలుపునివ్వడం గమనార్హం. ఎన్నికల ప్రచారంలో జార్జియా డ్రీమ్ పార్టీ పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా ప్రజలు రెచ్చగొట్టిందని.. రష్యా కూడా నిరంకుశంగా ఓటర్లను బెదిరించిందనీ ఈయూ పార్లమెంటు ప్రతినిధి ఆరోపిస్తున్నారు. వీటిని రష్యా కొట్టిపారేస్తోంది. కాగా, ఈయూలో చేరతామని, రష్యాతో సంబంధాలను పునరుద్ధరిస్తామని జార్జియా డ్రీమ్ పార్టీ ప్రచారం చేయడం గమనార్హం. జనాభా 40 లక్షల్లోపే.. కానీ చాలా కీలకం జార్జియా జనాభా 37 లక్షలు మాత్రమే. కానీ, రష్యాకు వ్యూహాత్మకంగా ఇది చాలా కీలక దేశం. ప్రధానంగా తుర్కియేతో సరిహద్దును కలిగి ఉంది. రష్యా, అర్మేనియా, అజర్ బైజాన్, నల్ల సముద్రం కూడా సరిహద్దులుగా ఉన్నాయి. ఒకప్పటి సోవియట్ యూనియన్ లో ఉన్న ఈ దేశం.. తమ మదర్ కంట్రీ అయిన రష్యాతో 2008లో యుద్ధానికి దిగి ఓడిపోవడం గమనార్హం.

## ఆ రెండు రాష్ట్రాల వయోవృద్ధులకు మోదీ క్షమాపణ



**న్యూఢిల్లీ–నవభూమి:** రాజకీయ ప్రయోజనాలను ఆశించే "ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్" ను ఢిల్లీ , పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తప్పుపట్టారు. ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌ను 70 ఏళ్ల వయోపరిమితికి తాము విస్తరించినప్పటికీ ఉచిత చికిత్స అందనందుకు ఢిల్లీ, బెంగాల్ వయోవృద్ధులకు ప్రధాని క్షమాపణలు తెలిపారు. 70 ఏళ్లు పైబడిన వారిందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సదుపాయాన్ని ధన్వంతరి జయంతి, తొమ్మిదో ఆయుర్వేద డే సందర్భంగా మంగళవారంనాడిక్కడ ప్రధాని ప్రారంభించారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆరోగ్యానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యాక్రమాలను, చిన్నారుల వ్యాక్సినేషన్‌కు ఉద్దేశించిన యూ–విన్ పోర్టల్‌ను మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, ఢిల్లీ, పశ్చిమబెంగాల్‌లో 70 ఏళ్లు దాటిన వారికి సేవలందించ లేకపోతున్నందుకు వారికి తాను క్షమాపణలు చెప్పుకుంటున్నానని అన్నారు. ఆయుష్మాన్ యోజనలో ఆ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చేరలేదనీ, రాజకీయ వృత్తికి సంబంధించిన అడ్డుగోడల కారణంగా ఆ రాష్ట్రాల్లో అనారోగ్యంతో ఉన్న వారికి తాను సేవ చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ప్రజల ప్రయోజనాలను రాజకీయాల కోసం పణంగా పెట్టడం మానవత్వం అనిపించుకోదని హితవు పలికారు. వైద్య చికిత్స కోసం ఇళ్లు, భూములు, నగలు అమ్ముకున్న సందర్భాలు గతంలో చాలానే ఉండేవని, తీవ్రమైన వ్యాధుల విషయంలో అయితే చికిత్సకు అయ్యే ఖర్చు వింటేనే పేద ప్రజలు వణికిపోయే పరిస్థితి ఉండేదని ప్రధాని అన్నారు. పేద ప్రజలను వైద్యం చేయించుకోలేని నిస్సహాయత నుంచి బయటకు తీసుకురావాలనే ఆలోచన నుంచే ఆయుష్మాన్ భారత్ పథకం పుట్టిందని చెప్పారు. ఈ పథకం ద్వారా పేదలకు 5 లక్షల వరకూ ఉచిత వైద్యం అందుతుందని, నాలుగు కోట్లకు పైగా దేశ ప్రజలు ప్రయోజనం పొందుతారని వివరించారు.

**ఆ రెండు రాష్ట్రాలు ఎందుకు అమలు చేయలేదు?**

ఆయుష్మాన్ భారత్ పథకంలో తమ ప్రభుత్వంలో చేరడం లేదని 2019లో ఆరోగ్య శాఖ మంత్రిగా కూడా ఉన్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. రాష్ట్రాలు 40 శాతం ఖర్చులు భరించాల్సి ఉండగా మొత్తం క్రెడిట్ కేంద్రం కొట్టేయాలనుకుంటోందన్నారు. ఢిల్లీ ప్రభుత్వం కూడా ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరడం లేదని అప్పట్లో ప్రకటించింది. చాలినంత మంది ప్రజలను పథకంలోకి తీసుకురావడం లేదని, అందుకు ప్రతిగా తాము సొంత ఆరోగ్య బీమా పథకాన్ని అమలుకు కసరత్తు చేస్తున్నట్టు పేర్కొంది.

## మాజీ సీఎం మిత్రుడికి ఐటీ షాక్



**చెన్నై: నవభూమి:** అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి స్నేహితుడికి ఐటీ షాక్ ఇచ్చింది. ఈపీఎస్ మిత్రుడు ఇలంగోవన్ వియ్యంకుడు బాలసుబ్రమణ్యం అనే వ్యాపారి నివాసంలో రూ.42 కోట్ల మేర నగదును ఆదాయపన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఈయన తన వ్యాపార కంపెనీలకు సంబంధించి రూ.100 కోట్ల మేర పన్ను ఎగవేతకు పాల్పడినట్టు ఐటీ అధికారులు గుర్తించారు. ఎన్డీయే కూటమి నుంచి అన్నాడీఎంకే బయటకు వచ్చిన తర్వాత అన్నాడీఎంకే నేతల గృహాల్లో ఈడీ, ఐటీ సోదాలు జరుగుతాయని ప్రతి ఒక్కరూ ఊహించారు.
అందరూ అనుకున్నట్టుగానే గుట్కా కేసులో మాజీ మంత్రి విజయభాస్కర్‌పై చార్జిషీటు దాఖలు చేసేందుకు గవర్నర్ ఆర్ఎన్ రవి అనుమతిచ్చారు. అదేవిధంగా పలువురు మాజీ మంత్రులపై కేసు నమోదుకు కూడా గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎడప్పాడి పళనిస్వామికి సన్నిహితుడైన ఇళంగోవన్ వియ్యంకుడు బాలసుబ్రమణ్యం అనే వ్యాపారవేత్త కోయంబత్తూరులో నివశిస్తున్నారు. ఈయనకు అశ్విని పేపర్ మిల్స్‌తో పాటు పలు వ్యాపారాలున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన 15 మంది ఐటీ అధికారులు బాలసుబ్రమణ్యంకు చెందిన కంపెనీలు, పేపర్ మిల్స్‌లో తనిఖీలు ప్రారంభించి ఆదివారం సాయంత్రంతో పూర్తిచేశారు.
అయితే, ఈ తనిఖీల సంబంధించిన వివరాలను ఐటీ అధికారులు ఎంతో గోప్యంగా ఉంచారు. సోమవారం ఈ తనిఖీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 22వ తేదీ నుంచి నిర్వహించిన తనిఖీల్లో రూ.100 కోట్ల మేరకు పన్ను ఎగవేతకు పాల్పడినట్టు తేల్చారు. అలాగే, బాలసుబ్రమణ్యంకు నివాసంలో రూ.42 కోట్ల మేర నగదు స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించారు. ఈ సోదాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే, ముమ్ముందు కూడా అన్నాడీఎంకేకు చెందిన మాజీ మంత్రుల నివాసాల్లో ఈడీ, ఐటీ సోదాలు కొనసాగవచ్చని భావిస్తున్నారు.

## కేరళలో భారీ బాణాసంచా ప్రమాదం...



**తిరువనంతపురం– నవభూమి:** సోమవారం అర్ధరాత్రి కేరళలో భారీ బాణా సంచా ప్రమాదం జరిగింది. కాసర్‌గోడ్ జిల్లాలో తెయ్యం ఉత్సవాల ప్రారంభ వేడుకల సందర్భంగా అంజోతంబలం వీరేకావులో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో 150 మందికిపైగా గాయపడ్డారు. 8 మంది పరిస్థితి సీరియస్‌గా ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.
కేరళలోని కాసర్‌గోడ్ జిల్లాలో భారీ బాణాసంచా ప్రమాదం జరిగింది. ఓ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి బాణాసంచా కాల్చుతుండగా జరిగిన ఈ ప్రమాదంలో ఏకంగా150 మందికి పైగా గాయపడ్డారు. వారిలో ఎనిమిది మంది తీవ్ర గాయాలపాలయ్యారు. టపాసులు పేలుతున్న సమయంలో ఒక్కసారిగా భారీగా మంటలు ఎగసిపడ్డాయి. మంటలతో పాటు పొగ ఆవరించడంతో అప్పటిదాకా చుట్టూ నిలబడి చూసినవారంతా ఒక్కసారి దూరంగా పరిగెత్తారు. దీంతో తొక్కిసలాట తరహా పరిస్థితి కనిపించింది.
తెయ్యం ఉత్సవాల ప్రారంభ వేడుకల సందర్భంగా అంజోతంబలం వీరేకావులో ఈ ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అర్ధరాత్రి సమయంలో టపాసుల వేడుక జరిగిందని, అయితే క్రాకర్లలో ఒకటి సమీపంలోని మరిన్ని టపాసులు నిల్వ చేసిన షెడ్‌లో పడి ఉండవచ్చని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. షెడ్‌లో ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు, పొగలు వ్యాపించడంతో జనాలు భయానికి గురై పరుగులు పెట్టినట్టు దృశ్యాలను బట్టి అర్థమవుతోంది. కాగా మంటలు ఎగసిపడిన షెడ్ పక్కనే చాలా మంది ఉన్నారని, అందుకే ఒక్కసారిగా పరుగులు తీశారని స్థానిక మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. పెద్ద పేలుడు తర్వాత ఈ మంటలు వ్యాపించాయని, నిప్పు రవ్వలు దూసుకురావడం చూశామని, అందుకే జనాలు భయాందోళనలకు గురయ్యారని పేర్కొన్నారు. కాగా గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఆలయానికి సంబంధించిన శ్రీరాగ్ అనే వ్యక్తి మాట్లాడుతూ.. పేలుడు శబ్దం విన్న తర్వాత పరుగులు తీస్తున్న జనాలను అదుపు ప్రయత్నించానని, కానీ రద్దీ సాధారణం కంటే ఎక్కువగా ఉండడంతో సాధ్యపడలేదని పేర్కొన్నాడు. పండుగ రెండవ రోజున తమ అంచనా కంటే ఎక్కువ మంది వచ్చారని, సోమవారం రాత్రి అసాధారణ రద్దీ నెలకొందని అతడు పేర్కొన్నాడు. షెడ్‌లో చైనీస్ టపాసులు భద్రపరిచారని, ఉత్సవాల్లో కాల్చిన ఒక క్రాకర్ వచ్చి షెడ్‌లో పడి ఉండవచ్చని అన్నారు. కాగా పంచాయతీ ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక్కడ భారీగా క్రాకర్లు పేల్చలేదు. అయితే షెడ్‌కు, క్రాకర్లు పేలిన ప్రదేశానికి మధ్య దూరం విషయంలో ముందే జాగ్రత్త తీసుకొని ఉండాల్సిందని పేర్కొన్నారు.

## ఉగ్రవాదుల చేతుల్లో ఆర్మీ శునకం ఫాంటమ్ మృతి.. ఎలా జరిగిందంటే



**అఖ్నూర్–నవభూమి:** జమ్మూ కాశ్మీర్‌లోని అఖ్నూర్‌లో ఉన్న సుందర్‌బందీ సెక్టార్‌లో నిన్న (సోమవారం) ఆర్మీ వాహనం లక్ష్యంగా ఉగ్రవాదులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దాడి తర్వాత ఉగ్రవాదుల ఆచూకీ కోసం చేపట్టిన భారీ సెర్చ్ ఆపరేషన్‌లో విషాదం ఎదురైంది. దాక్కున్న ఉగ్రవాదుల కోసం సైన్యం ముమ్మరంగా అన్వేషించిన ఈ ఆపరేషన్‌లో 'ఫాంటమ్' అనే ఆర్మీ శునకం కూడా పాల్గొంది. అయితే ఉగ్రవాదులతో ఎదురుకాల్పుల్లో ఫాంటమ్‌కు బుల్లెట్లు తగిలాయి. తీవ్రమైన గాయాలతో 'ఫాంటమ్' వీర మరణం పొందింది. ఫాంటమ్ మృతిపై ఆర్మీ ఒక ప్రకటన విడుదల చేసింది.
" మన నిజమైన హీరో, వీర భారత ఆర్మీ డాగ్ ఫాంటమ్ అత్యున్నత త్యాగానికి మేము వందనం సమర్పిస్తున్నాం. ఫాంటమ్ ధైర్యం, విధేయత, అంకితభావం ఎప్పటికీ మరచిపోలేము" అని వైట్ నైట్ కార్ప్స్ అని పిలిచే 16 కార్ప్స్ సోషల్ మీడియాలో వెల్లడించింది.
కాగా ఫాంటమ్ వయసు నాలుగేళ్లు. మే 25, 2020న జన్మించింది. ఇది బెల్జియం మాలినోయిస్ జాతికి చెందినది. ఫాంటమ్ 9 యూనిట్‌లో దాడి కుక్క భాగం, ఉగ్రవాద వ్యతిరేక, తిరుగుబాటు నియంత్రణ కార్యకలాపాలలో పాల్గొనే కే9 యూనిట్‌లో భాగంగా ఉంది. మీరట్‌లోని రీమౌంట్ వెటర్నరీ కార్ప్స్ ఈ శునకాన్ని ఇష్యూ చేయగా.. ఆగస్టు 12, 2022న ఆర్మీలో నియమించారు. కాగా ఈ సెర్చ్–కార్డన్ ఆపరేషన్‌లో ఒక ఉగ్రవాదిని మట్టుబెట్టినట్టు ఆర్మీ పేర్కొంది. ఇక గతేడాది జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక సైనికుడి ప్రాణాలను కాపాడుతూ 'కెంట్' అనే ఆరేళ్ల ఆర్మీ డాగ్ కన్నుమూసింది. ఈ శునకం మొత్తం తొమ్మిది ఆపరేషన్లలో పాల్గొంది. కెంట్ కళేబరంపై త్రివర్ణ పతాకం కప్పి, పుష్ప గుచ్ఛం ఉంచి ఆర్మీ సిబ్బంది తుది నివాళులు అర్పించారు.

## కొత్త గ్రహాన్ని కనుగొన్న భారత శాస్త్రవేత్తలు



**తిరువనంతపురం–నవభూమి:** విశ్వంలో మరో కొత్త గ్రహాన్ని భారత శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అధునాతన స్పెక్ట్రోగ్రాఫను ఉపయోగించి ఆ గ్రహాన్ని గుర్తించామని.. ఇదో అద్భుత ఆవిష్కరణ అని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (పీఆర్ఎల్) కి చెందిన పరిశోధకులు పేర్కొన్నారు. ఈ గ్రహాన్ని టీఓఐ–6651బీగా పిలుస్తున్నామని తెలిపారు. శని గ్రహం పరిణామంలో ఉన్న ఈ ప్రత్యేక గ్రహం.. సూర్యుడిని పోలిన నక్షత్రం చుట్టూ తిరుగుతోందని వెల్లడించారు. దీని కక్ష్య కొద్దిగా అండాకారంలో ఉందన్నారు. ఇక భూమితో పోలిస్తే ఈ గ్రహం బరువు 60 రెట్లు అధికంగా ఉంటుందని, పరిమాణంలో 5 రెట్లు పెద్దదని వివరించారు. ఈ గ్రహం అధిక సాంద్రతను బట్టి 87న రాతి, ఇనుము పదార్థాలను సూచిస్తుందన్నారు. హైడ్రోజన్, హీలియం వంటి తేలిక వాయువులు గ్రహంపై వ్యాపించి ఉండే అవకాశముందన్నారు.

## వాయు కాలుష్యంతో పెరుగుతున్న ఆస్తమా



**తిరువనంతపురం–నవభూమి:** కేరళలో వాయు కాలుష్యం కారణంగా పిల్లలు, పెద్దల్లో ఆస్మా వ్యాధి పెరుగుతున్నట్టు ప్రపంచస్థాయి అధ్యయనంలో వెల్లడయింది. 2019-23 మధ్య 22 దేశాల్లో 68 చోట్ల జరిపిన అధ్యయనంలో ఈ విషయం రుజువయింది. మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఈ సర్వే జరిగింది. దీనిపై విశ్లేషించిన శాస్త్రవేత్త రూయిజింగ్ నీ 'వన్ ఎర్త్' మ్యాగజైన్‌లో వ్యాసం రాశారు. వాయు కాలుష్యాన్ని 'ఫైన్ పర్టిక్యులర్ మ్యాటర్ (పీఎం 2.5)గా లెక్కిస్తారు. గాలిలో కాలుష్యకారక సూక్ష్మ రేణువులు ఎన్ని ఉన్నాయన్నది దీని ద్వారా తెలుస్తుంది. ప్రతి ఘనపు మీటరు గాలిలో 10 మైక్రోగ్రాముల మేర పీఎం2.5 పెరిగితే ఆస్మా వచ్చే ముప్పు 21% మేర

# ఓ సగటు మనిషి జీవితం లక్కీభాస్కర్



"లక్కీ భాస్కర్' ఓ కొత్త ప్రయత్నం. వెంకీ చూడ్డానికి చిన్నాకుర్రాడిలా ఉంటాడు. కానీ తను రాసిన సన్నివేశాలు హృదయాలను తాకుతాయి. మీనాక్షి చౌదరి అద్భుతమైన పాత్ర చేసింది. తనతో నటించిన సన్నివేశాలు ఇంకా మనసులో మెదులుతూనే ఉన్నాయి. ఇదొక సగటు మనిషి జీవితం. అందరికీ నచ్చుతుంది' అని దుల్కర్ సల్మాన్ అన్నారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం లక్కీభాస్కర్. మీనాక్షి చౌదరి కథా నాయిక. వెంకీ అట్లూరి దర్శకుడు. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ జరిగింది. అతిథుల్లో ఒకరైన దేవరకొండ విజయ్ మాట్లాడుతూ 'యాక్టర్ అవ్వకముందు దుల్కర్ సినిమాలు చూస్తూ ఉండేవాడ్ని. దుల్కర్‌తో మహానటి, కల్కి సినిమాలు చేశా. కానీ కలిసి స్క్రీన్ షేర్ చేసుకోలేదు. త్వరలో ఆ కోరిక తీరుతుందనుకుంటున్నా. 'లక్కీభాస్కర్' పెద్ద హిట్ అవ్వాలి' అని ఆకాంక్షించారు. మరో అతిథి త్రివిక్రమ్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూశాను. వెంకీ ఈ కథను డిజైన్ చేసిన తీరు వండర్. ఇందులోని ప్రతి పాత్రా ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది. ఇక దుల్కర్ వేరే లెవల్. ఇప్పటివరకూ చూసిన దుల్కర్ వేరు. ఇందులోని దుల్కర్ వేరు.' అన్నారు. ఇంకా దర్శకుడు వెంకీ అట్లూరి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ, రాంకీ, మానసా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నవచిత్ర





సమంత

# సమంత యువరాణి శాసనం..

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన ఫోకస్ అంతా బాలీవుడ్ పైన పెట్టినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా హిందీలో వెబ్ సిరీస్ చేస్తూ తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ ని క్రియేట్ చేసుకునే దిశగా అడుగులేస్తోంది. యాక్షన్ బ్యాక్ డ్రాప్ కథలతో సిరీస్ లు చేస్తూ వస్తోన్న సమంత అలాంటి కథలని తానే కేరాఫ్ అనేలా ప్రూవ్ చేసుకోబోతోంది.

ఆమె నటించిన 'సిటాడెల్: హాన్నీ బన్నీ' వెబ్ సిరీస్ నవంబర్ 7న అమెజాన్ ప్రైమ్ లో రిలీజ్ కాబోతోంది. తాజాగా ఈ సిరీస్ నుంచి సెకండ్ ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో సమంత అదిరిపోయే రేంజ్ లో పవర్ ఫుల్ యాక్షన్ సీక్వెన్స్ ని చాలా సునాయాసంగా చేసేసింది. ఈ యాక్షన్ షాట్స్ చూసిన తర్వాత ఇండియన్ లేడీ యాక్షన్ హీరోగా సమంత మారిపోతుందని చాలా మంది అంటున్నారు. ముఖ్యంగా ఆమె అభిమానులు అయితే సమంత స్పీడ్ ని ఇప్పట్లో ఎవరూ ఆపలేరని కామెంట్స్ చేస్తున్నారు. 'సిటాడెల్' రిలీజ్ కి రెడీ కాగా రాజ్ అండ్ డీకే నిర్మాణంలోనే మరో వెబ్ సిరీస్ లో సమంత నటిస్తోంది. 'రక్త్ బ్రహ్మాండ్' టైటిల్‌తో ఈ వెబ్ సిరీస్ తెరకెక్కుతోంది. హిస్టారికల్ బ్యాక్ డ్రాప్‌లో నడిచే ఫిక్షనల్ యాక్షన్ డ్రామాగా ఈ సిరీస్ ఉండబోతోందంట. ఆదిత్య రాయ్ కపూర్ ఈ సిరీస్ లో మేల్ లీడ్ గా నటిస్తున్నాడు. సమంత యువరాణి పాత్రలో కనిపించబోతోందని టాక్ వినిపిస్తోంది. ఒక శాసనం కాన్సెప్ట్ లో ఆమె క్యారెక్టర్ ఉంటుందట. పవర్ఫుల్ హావభావాలతో సామ్ సరికొత్తగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఒక రాజ్యంలో అధికారం కోసం జరిగే రాజకీయం నేపథ్యంలో ఈ సిరీస్ కథ ఉంటుందంట. నెట్ ఫ్లిక్స్ ఒరిజినల్ గా రక్త్ బ్రహ్మాండ్ తెరకెక్కుతోంది. వామిక గొబ్బి ఈ సిరీస్ లో ఒక కీలక పాత్ర చేస్తోంది. 'తుంబాడ్' ఫేమ్ రాహి అనిల్ బార్వే దర్శకత్వంలో ఈ సిరీస్ సిద్ధమవుతోంది. 'మీర్జాపూర్' ఫేమ్ అలీ ఫజల్ ఇందులో ముఖ్యమైన పాత్ర చేస్తున్నట్లు తెలుస్తోంది. 'సిటాడెల్' సిరీస్ సక్సెస్ అయితే బాలీవుడ్ లో సమంత క్రేజ్ మరింత పెరుగుతుంది. అది కచ్చితంగా 'రక్త్ బ్రహ్మాండ్' కి హెల్ప్ అవుతుంది. అలాగే డిజిటల్ స్పేస్ లో యాక్షన్ సిరీస్ లకి కేరాఫ్ గా సమంత మారే అవకాశం కనిపిస్తోంది. అయితే ఆమె మంచి తెలుగు మూవీ ఒకటి చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. సమంత కూడా తెలుగు సినిమాలు చేయడానికి సిద్ధంగానే ఉంది. అయితే దర్శకులు ఎవరూ ఆమెని సంప్రదించడం లేదని టాక్. సరైన క్యారెక్టర్ పడితే మూవీ చేసే అవకాశం కనిపిస్తోంది.

# ఫ్రెండ్స్ గ్యాంగ్‌తో పాండే బ్యూటీ షికార్లు!




ఫ్రెండ్స్ గ్యాంగ్ తో పార్టీలు ఆస్వాదించడంలో అనన్యా పాండే ముందుటుందని చెప్పాల్సిన పనిలేదు. వీకెండ్ వస్తే? అమ్మడు పబ్ లో చిల్ అవుతుంటుంది. స్నేహితుల్ని వెంటేసుకుని పార్టీలు..వెకేషన్లు ఆస్వాదిస్తుంటుంది. అమ్మడి కెరీర్ లో ఇదో దినచర్య లాంటి కార్యక్రమం. ఆ మూవ్ మెంట్స్ ని అవసరమైనప్పుడు అభిమానుల తో సోషల్ మీడియా వేదికగా పంచుకుంటుంది. తాజాగా అమ్మడు మరో బర్త్ డే ట్రీట్ పిక్ వదిలింది. నటీనటులతో కలిసి దిగిన ఫోటోను షేర్ చేసి కోస్టార్ గుర్ఫతే పిర్జాదా కి బర్త్ డే విషెస్ తెలియజేసింది. కాల్ మీ బే సిరిస్ లో ఇతడు నీల్ నాయర్ అనే పాత్రతో ప్రేక్షకుల్ని అలరించాడు. అతడికి తనదైన శైలిలో విషెస్ తెలియజేసింది. బేస్ నీల్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఇది అతడికి ఉత్తమ సంవత్సరంగా నిలివాలిఅని కోరుకుంది. కాల్ మీ బే టీమ్ కొందరు కారులో కలిసి దిగిన పిక్ ని షేర్ చేసింది. కారులో అనన్య ఫ్రంట్ సీట్ లో కూర్చుని గ్యాంగ్ సభ్యులందర్నీ ఎంటర్ టైన్ చేస్తోంది. ! వెనుక సీట్లో కూర్చున్న వారంతా సెల్ఫీ లో తొంగి తొంగి చూడటం గమనించొచ్చు. అనన్యా స్నాప్‌షాట్‌లో స్టైలిష్ బ్లాక్ కోట్‌తో జతగా సిజ్లింగ్ ఎరుపు దుస్తులను ధరించింది. టీమ్ అంతా ఇలా కనిపించడంతో ?కాలీ బీ బే సీజన్-2%పై ఆసక్తి అంతకంతకు రెట్టింపు అవుతుంది. సీజన్-2ని ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. తొలి భాగం గ్రాండ్ సక్సెస్ అయిన నేపథ్యంలో సీజన్-2 ఎప్పుడు ప్రారంభమవుతుందని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ లోనే అధికారికంగా ప్రకటించారు. %శూశ్రీంశీ =ముం% - చిరు, అమితాబ్ లివింగ్ లెజెండ్స్.. నాగ్ ట్వీట్ వైరల్.. ప్రస్తుతం మేకర్స్ సీజన్ -2 పనుల్లోనే బిజీగా ఉన్నారు. కాల్ మి బే ని ఇషితా మోయిత్రా, రోహిత్ నాయర్ - సమీనా మోట్లేకర్ చేత సృష్టించబడిన శక్తివంతమైన కామెడీ-డ్రామా . దీనికి కోలిన్ డి'కున్హా దర్శకత్వం వహించారు. ఇందులో ముస్కాన్ జాఫేరి, వరుణ్ సూద్, నిహారిక లైరా దత్, విహాన్ సమత్, వీర్ దాస్, రియా సేన్, మినీ మాథుర్, సుచిత్రా పిళ్లై, కరిష్మా తన్నా, సయానీ గుప్తా కీలక పాత్రల్లో నటించారు. కరణ్ జోహార్- అపూర్వ మెహతా - సోమెన్ మిశ్రా సంయుక్తంగా నిర్మించారు.

# మహేశ్ -రాజమౌళి సినిమా..

# ఫస్ట్ అప్‌డేట్ ఇదే

దర్శకధీరుడు రాజమౌళి తన తాజా చిత్రం గురించి అప్డేట్ ఇచ్చారు. మహేశ్‌బాబుహీరోగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ సినిమా పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే.

దర్శకధీరుడు రాజమౌళితన తాజా చిత్రం గురించి అప్డేట్ ఇచ్చారు. మహేశ్‌బాబు హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ సినిమా పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం చిత్రబృందం దృష్టి అంతా ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులపైనే ఉంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని టాక్. అయితే ఈ చిత్రం గురించి ఇప్పటిదాకా ఏ విషయం అఫీషియల్‌గా బయటకు రాలేదు.



తాజాగా దర్శకుడు రాజమౌళి ఓ అప్‌డేట్ ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా ఎడారి ప్రాంతంలో తిరుగుతున్న ఫొటో షేర్ చేసి 'కనుగొనడం కోసం తిరుగుతున్నా' అని క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆయన మహేశ్ సినిమా కోసం లొకేషన్స్ సెర్చ్ చేస్తున్నట్లు అర్థమవుతోంది. త్వరలోనే అప్‌డేట్ షేర్ చేయాలని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. అయితే ఈ చిత్రంలో జంతువులు ఎక్కువగా కనిపిస్తాయి అని ఇటీవల జక్కన్న హింట్ ఇచ్చారు. తాజాగా ఆయన పోస్ట్ చేసిన ఫొటోలో జంతువుల గుంపు కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. కనీసం ఇలాగైనా అప్‌డేట్ ఇచ్చారంటూ అభిమానులు ఆనందిస్తున్నారు.

ఎస్ఎస్ఎంబీ 29 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రంలో మహేశ్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఆ పాత్ర ఇప్పటికే సన్నద్ధమయ్యారు. ఈ ప్రాజెక్ట్ కోసం రాజమౌళి ఏఐ టెక్నాలజీని వినియోగించనున్నట్లు వార్త?ని వినిపించాయి. దీనికోసం ఆయన ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు తెగ వైరలైంది. సినిమాలోని కొన్ని పాత్రలు, జంతువుల కోసం ఆయన ఏఐ టెక్నాలజీని ఉపయోగించనున్నారని తెలుస్తోంది. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు.

# విడుదలకు సిద్ధమైన రాంగోపాల్ వర్మ 'శారీ'



ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ డెన్ నుంచి వస్తున్న 'శారీ' చిత్రం డిసెంబరు 20న థియేటర్‌లో విడుదలకానుంది. ఈ మేరకు మేకర్స్ అధికారికంగా రిలీజ్ డేట్ వెల్లడించారు. ఇందులో యువనటి ఆరాధ్య దేవి హీరోయిన్‌గా నటించగా, సత్య యాదు హీరో. పలు వాస్తవిక సంఘటనల ఆధారంగా ఈ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగా రూపొందించారు.తమిళం, తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ చిత్రానికి గిరి కృష్ణ కమల్ దర్శకుడు. ఆర్జీవీ ఆర్వీ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమైంది. అతి ప్రేమ భయంకరంగా ఉంటుందనేది ఈ సినిమా మూల కథ.సోషల్ మీడియాలో జరిగే కొన్ని ఊహించని విషయాల వల్ల సమాజంతో పాటు వ్యక్తిగత జీవితంలో జరిగే మార్పులు ఇందులో ప్రధానంగా ప్రస్తావించారు. ఇందులో భయపెట్టే ప్రేమికుడి పాత్రలో సత్య యాదు నటించారు.కాగా.. ఈ చిత్రంలో నటించిన ఆరాధ్య దేవి కేరళకు చెందిన వర్ధమాన నటి. గతంలో శ్రీలక్ష్మి అనే పేరుతో పరిశ్రమకు పరిచయమైంది. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఎవరో తనకు ఫార్వార్డ్ చేసిన ఆరాధ్య రీల్స్ చూసి ఈమెను కనిపెట్టి కొత్త పేరు పెట్టి మరీ ఈ 'శారీ' చిత్రంలో హీరోయిన్‌గా రాంగోపాల్ వర్మ ఎంపిక చేయడం గమనార్హం. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం పోస్టర్లు ప్రేక్షకులను అమితంగా ఆకర్షించిన విషయం తెల్సిందే.

# శక్తి పంప్స్ లాభం 101 కోట్లు




**ఇండోర్-నవభూమి:** శక్తి పంప్స్(ఇండియా) లిమిటెడ్(ఎస్‌పీఐఎల్) అంచనాలకు మించి రాణించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగా సంస్థ రూ.101.4 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6 కోట్ల లాభంతో పోలిస్తే ఎన్నో రెట్ల వృద్ధిని కనబరిచింది. 2023-24 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.152.8 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం ఈసారికిగాను నాలుగు రెట్లు ఎగబాకి రూ.634.6 కోట్లకు చేరుకున్నది.

గత త్రైమాసికానికిగాను రూ.1,800 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని ఎస్‌పీఐఎల్ చైర్మన్ దినేశ్ పటిదర్ తెలిపారు. మరోవైపు కంపెనీ 5:1 రేషియోలో బోనస్ షేరును షేరు హోల్డర్లకు అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలానికిగాను రూ.1,202 కోట్ల ఆదాయంపై రూ.194.10 కోట్ల లాభాన్ని గడించింది. ప్రస్తుతం సంస్థ సోలార్ పంపులు, ఎనర్జీ-ఎఫిసెంటర్ స్టేయిన్‌లెస్-స్టీల్ సబ్‌మెర్షిబుల్ పంపులు, ప్రెషర్ బూస్టర్ పంపులు, పంప్-మోటర్, ఇతర ఉత్పత్తులను తయారు చేస్తున్నది. కంపెనీకి ఉన్న రెండు ప్లాంట్లలో ప్రతియేటా 5 లక్షల పంపులు, మోటార్లు తయారుచేస్తున్నది.

# రిటైర్మెంట్ ప్రకటించిన మాథ్యూ వేడ్



**మెల్‌బోర్న్-నవభూమి:** ఆస్ట్రేలియా క్రికెటర్ మాథ్యూ వేడ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. 2021 టీ20 వరల్డ్‌కప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టులో అతను సభ్యుడిగా ఉన్నాడు. ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టాడతను. అయితే ఆట నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్లు మంగళవారం ప్రకటించాడు. కానీ కోచింగ్ బాధ్యతలను తీసుకోనున్నట్లు చెప్పాడు. 36 ఏళ్ల మాథ్యూ వేడ్ ఆస్ట్రేలియా తరపున 36 టెస్టులు, 97 వన్డేలు, 92 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. టాస్మానియా, బిగ్‌బాష్ లీగ్‌లో హెూబర్ట్ తరపున దేశవాళీ క్రికెట్‌లో ఆడనున్నాడు. ఇటీవల జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో మాథ్యూ వేడ్ చివరిసారి ఆస్ట్రేలియా తరపున అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. కోచింగ్ గురించి చాన్నాళ్లుగా ఆలోచిస్తున్నట్లు వేడ్ తెలిపాడు.

క్రికెట్ ఆస్ట్రేలియా తన ఎక్స్ అకౌంట్‌లో వేడ్ రిటైర్మెంట్ ప్రకటన రిలీజ్ చేసింది.

## నవక్రీడ

# మూడో టెస్టుకూ కేన్ విలియమ్‌సన్ దూరం



**న్యూఢిల్లీ-నవభూమి:** న్యూజిలాండ్ సీనియర్ క్రికెటర్, మాజీ కెప్టెన్ కేన్ విలియమ్‌సన్. భారత్‌తో జరగనున్న మూడవ టెస్టు కూడా దూరం కానున్నాడు. ముంబైలో జరిగే ఆ మ్యాచ్‌కు విలియమ్‌సన్ అందుబాటులో ఉండరని కివీస్ తెలిపింది. గజ్జల నొప్పితో బాధపడుతున్న విలియమ్‌సన్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. భారత్‌తో జరిగిన తొలి రెండు టెస్టులకు కూడా కివీస్ మాజీ కెప్టెన్ దూరంగా ఉన్నాడు. ప్రస్తుతం మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ 2-0 ఆధిక్యంతో ఉన్నది.

నవంబర్ ఒకటో తేదీ నుంచి వాంఖడే స్టేడియంలో మూడవ టెస్టు జరగనున్నది. కేన్ విలియమ్‌సన్ ఆరోగ్యం ప్రస్తుతం మంచి స్థితిలోనే ఉన్నా.. అతను జట్టుతో కలవడం లేదని కోచ్ గ్యారీ స్టడ్ తెలిపాడు. ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో అతనికి పూర్తి రెస్టు ఇస్తున్నట్లు చెప్పాడు. ఇంగ్లండ్‌తో నవంబర్ 28వ తేదీ నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో తొలి టెస్టు జరగనున్నది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**